అపరాధ పరిశోధన

రు.5 | ఏప్రెల్ 82



Blank Page

సంపుటి: 34 ఫోన్ నెం.
సంచిక: 3 64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 60 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

ఏప్రెల్, 1982

"Rattukolu Subba Reddy
Home Library, Pedaogirala.

:
... దర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
నండూరి శైలజ

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
ఏ. పి. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

మీ ఉత్తరాలు

"అపరాధ పరిశోధన"ను తొలిసారిగా చదివాను. సస్పెన్స్, సైంటిఫిక్, పరిశీలనాత్మకమైన కథలు వైవిధ్యంతో కూడిన ఇన్ని చక్కని కథలు అందజేస్తున్నందుకు నా కృతజ్ఞతలు. ఇంతకాలం ఒక చక్కని పరిశోధనాత్మకమైన పత్రికను ఎందుకు చదవలేదా అని బాధ కూడా కలిగింది. బొమ్మిడి అచ్చారావు, బుస్సా బాల చందర్‌గార్ల కథలు బాగున్నవి. కథలకు బొమ్మలు వేస్తున్న చంద్రగారికి నా అభినందనలు.

—వై. హేమసుందర్‌రావు, డోర్నకల్.

'రక్తం త్రాగే పిశాచం' సీరియల్ చాలా సస్పెన్స్‌తో సాగుతుంది. మల్లిక్‌గారి 'సంగీత సామ్రాట్' వసుంధరగారి 'ఈ కోర్కె తీరేది కాదు', జొ. రామలక్ష్మగారి 'దొంగలను పట్టే గజదొంగ' కథలు చాలా బావున్నవి. —కిషన్‌చంద్ర, కరీంనగర్.

ఈ నెల కథలలో పులి సవారీ, హోమ్స్ అండ్ జేమ్స్, డబ్బు సింహాసనం, గురువుగారి మట, మమ్మల్ని మైమరపించాయి. 'మృత్యు తార' సీరియల్ ప్రారంభమే ఎతచింతకాయ పచ్చడిలా వుంది. —సుమిత్రా నారాయణరావు, హన్మకొండ.

మార్చి నెల అపనలో కథలన్నీ బాగున్నవి. 'వెంట వెళ్ళిన దెయ్యం', 'నగ్న పురుషులు' నవలల థ్రిల్లింగ్‌గా వున్నవి. 'కాంచన గ్రహం', రక్తం త్రాగే పిశాచం' సీరియల్స్ హుషారుగా సాగుతున్నవి. —విన్నకోట లక్ష్మీదేవి, తెనాలి.

అపనలో శ్రీధర్‌గారి 'హోమ్స్ అండ్ జేమ్స్', బొమ్మిడి అచ్చారావుగారి 'అమ్మాయి తప్పిపోయింది', సప్లిమెంట్‌లో ఎమ్. వి. వి. సత్యనారాయణగారి 'నగ్న పురుషులు' నాకు చాలా బాగా నచ్చిన కథలు. కొత్త సీరియల్ 'మృత్యు తార' సస్పెన్స్‌గా వుంది. కార్టూన్స్ లేకపోయినా 'క్రైమ్‌లో తమాషాలు' బాగా నవ్వించాయి. —యన్. శివానంద్, బెల్లంపల్లి.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. దొంగకు సన్మానం—వసుంధర
18. దీవిలో దొరికిన శవం—ఎమ్.వి.వి. సత్యనారాయణ
32. మూగచిత్రం—రాణీమోహన్‌రావ్
46. నాలుగుపేటల రౌడీలు—ఎమ్. సత్యవతి
63. మృత్యుతార (సీరియల్)—గిరిజ శ్రీ భగవాన్
88. అమృతవర్షిణి—బొమ్మిడి అచ్చారావు
121. మంచిరోజులు—జొన్నలగడ్డ రామలక్ష్మి
135. గృహదహనం—ఎన్.ఆర్. నంది
153. పునాది ఎముకలు—ఇమందిరామారావు
168. కాంచన గ్రహం (సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. మహారాణి పీఠపెట్టై—వసుంధర
40. ఒక పుర్రె రెండు ఎముకలు—ఎమ్.వి.వి. సత్యనారాయణ
79. బ్రతకాలంటే పారిపో—సికిందర్
114. మాయాలోకంలో మానవకాంత—సికిందర్
174. రక్తం త్రాగే పిశాచం (సీరియల్)—వసుంధర

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, జోక్స్, మరెన్నో ఆకర్షణలు!!!

దొంగకు సన్మానం

వసుంధర

ఆయ నెవరో నాకు తెలుసు. ఆయన్ని చూడగానే నాకు భయం వేసింది. చూడగానే నా పని అయిపోయిం దనుకున్నాను.

కొంతమంది పేరు కోసం మాత్రమే మంచి పనులు

చేస్తూంటారు. కొంత మంది డబ్బు కోసం మంచి పనులు చేసి సమాజ శ్రేయస్సుకోసం అంటూంటారు. నిజంగా సమాజ శ్రేయస్సు కోసం కృషిచేస్తూ కూడా ఆ విషయం చెప్పుకోని తరగతివారు అరుదు. అరుదైన ఈ తరగతికి చెందినవాడే డిటెక్టివ్ వెంకన్న.

బల్లకట్టి డిటెక్టివ్ జీవితం ప్రారంభించినా ఆయన పూర్తిగా పరిష్కరించిన కేసులు అరుదు. అందుకు కారణం - నేరస్థుడిని పోలీసులకు అప్పగించడమే నేరానికి పరిష్కారమని ఆయన నమ్మకపోవడం. నేరస్థుడు బాగు పడడానికి మరో అవకాశ మివ్వడం కోసం ఆయన తను తెలుసుకున్న నిజాన్ని పత్రికలకు చెప్పడు. ఆయన దాకా వచ్చిన కేసుల గురించి చాలా మందికి తెలియదు.

ఆయనవల్ల ప్రయోజనం పొందిన వాళ్ళలో నే నొక డిని. ఒక దొంగతనం కేసులో నన్నాయన పట్టుకున్నాడు. ఏ పరిస్థితుల్లో నేను దొంగనైనానో విని జాలిపడి నన్ను హెచ్చరించి వదిలేశాడు. నా వద్ద నుంచి దొంగిలించిన డబ్బు మాత్రం తీసుకుని అసలు వాళ్ళకి అప్పగించాడు.

ఇప్పుడు వెంకన్నను చూస్తూంటే నాకు భయంగా వుంది. ఆయన హెచ్చరికను పెడచెవినిబెట్టి నేను నిన్ననే మళ్ళీ దొంగతనం చేశాను. అదీ శ్యామలరావు యింట్లో!

శ్యామలరావు స్మగ్లింగ్ వ్యవహారాల్లో చాలా డబ్బు సంపాదిస్తున్నాడంటారు. కానీ ఆయనకు దానగుణం వుంది. ఆయన చేతికి ఎముకలేదని అంతా అంటారు. అసలు అందరికీ సాయపడడం కోసమే స్మగ్లింగ్ లాంటివి చేస్తున్నాడని కొంద రంటారు.

శ్యామలరావుకు భార్య లేదు. పిల్లలు లేరు. యాభై యేళ్ళ వయసుంది. మనిషి దృఢంగా వుంటాడు. ఆయ

నకు కొంతమంది ఉంపుడుగత్తెలు. అక్రమ సంతానం ఉన్నట్లు కూడా చెప్పుకుంటారు. కానీ చూడగానే ఆయనకు చేయెత్తి నమస్కరించాలనిపిస్తుంది.

శ్యామలరావు మామూలు పెంకుటింట్లో వుంటున్నాడు. ఆ యింటిమీద ఒకటి రెండు సార్లు యిన్‌కంటాక్సువాళ్ళు రెయిడ్ చేసి డబ్బేమీ దొరక్క ఆయనకు సారీ చెప్పుకుని వెళ్ళిపోయారు.

ఆయన డబ్బును వేరే ఎక్కడో దాస్తాడంటారు. అదెక్కడో యెవ్వరికీ తెలియదు. ఆయన్ను యేదో విధంగా కటకటాల వెనక్కు తొయ్యాలని కొందరు పోలీసు యిన్‌స్పెక్టర్లు కసిగానూ, ఆత్రుతగానూ వున్నారని చెప్పుకుంటారు.

దొంగతనాలు చేసేవారెవ్వరూ ఆయ నింటికి వెళ్ళకూడదని ఓ రహస్య నియమ మున్నది. ఆయన యింట్లో ఆయుధా లేమీ ఉంచుకోడు. ఈ విషయం మాత్రం నేను నమ్మలేదు - నిన్నటి వరకూ!

నిన్నరాత్రి నేను ఆయనింటికే దొంగతనానికి వెళ్ళాను.

నాకు అర్జంటుగా డబ్బు కావాలి! అందుకని శ్యామలరావు యింటినే యెన్నుకున్నాను. ఎందుకంటే అక్కడ నా ప్రయత్నం ఫెయిలయినప్పటికీ ఆయన పోలీసులదాకా వెళ్ళడు. పోలీసులంటే భయంవల్ల కాదు - మానవత్వం కారణంగా!

అందుకే దొంగ లాయనింటికి వెళ్ళరు. కానీ దొంగలకు నియమా లేమిటీ అని నేను సరిపెట్టుకున్నాను. ఆయనింట్లో అట్టే డబ్బుండదని నాకు తెలుసు. కానీ నాకు వెయ్యిరూపాయలయినా చాలు. ఆ మాత్రం డబ్బు ఆయన దగ్గ రెలాగూ వుంటుంది.

రాత్రి వెళ్ళాను. ఇంట్లో ప్రవేశించడం సులభమే అయింది నాకు. సింపుల్‌గా వెళ్ళి తలుపు తట్టాను. శ్యామలరావు వచ్చి తలుపు తీశాడు. నేను నా గురించి కొన్ని అబద్ధాలు చెప్పి లోపల ప్రవేశించాను.

తర్వాత కత్తి చూపించి బెదిరించాను.

శ్యామలరావు ఆశ్చర్యపడ్డట్లు కనపడింది - "నా ఇంట్లో డబ్బుండదు. అనవసరంగా శ్రమపడకు" అన్నాడాయన.

"అది నేను చూసుకుంటాను" అన్నాను.

ఆయన మాటలేమీ వినకుండా యినప్పెట్టె దగ్గరకు నడిచాను.

పెట్టె తెరచి చూసే సరికి నా కళ్ళు చెదిరిపోయాయి.

అందులో మొత్తం రెండు లక్షల రూపాయలున్నాయి.

"అంతా తీసుకువెళ్ళకు. నీ క్కావలసిన డబ్బు పదివేల దాకా తీసుకువెళ్ళినా నాకు అభ్యంతరం లేదు" అన్నాడు శ్యామలరావు.

నేను ఆలోచిస్తున్నాను. నిజానికి వెయ్యి రూపాయలు చాలనుకున్నాను. కానీ చూస్తూ చూస్తూ రెండు లక్షలు యెలా వదులుకోగలను? ఈ దొంగతనం పూర్తి కాగానే యింక మళ్ళీ దొంగతనాల జోలికి వెళ్ళ నవసరం లేదు. న్యాయంగా జీవితం గడపవచ్చు.

నా కళ్ళముందు యెన్నో రంగుల కలలు.

అయితే శ్యామలరావు నన్ను హెచ్చరిస్తున్నాడు.

"పదివేలయితే నేనే నీకు ఆప్యాయంగా, ఆనందంగా యిస్తాను. మొత్తమంతా తీసుకుపోవాలనుకుంటే నిన్ను వేటాడతాను. నీ అంతు చూస్తాను."

ఆయన ఆ డబ్బు ఒక శరణాలయానికి గుప్తదానంగా యివ్వబోతున్నాడట. చావు బతుకుల్లో వున్న నలుగురు

అనాథుల కది ఖరీదైన వైద్యం జరిపించడానికి సహాక రిస్తుందట. సకాలంలో ఆ డబ్బు అందకపోతే ఆ అనాథులు నిష్కారణంగా చచ్చిపోతారుట.

డబ్బంతా జేబుల్లోకి తోసేశాను. కాస్త యెత్తుగా వచ్చినా సులభంగానే పట్టేసింది. నే నాయన్ను మంచం మీద పడుకోబెట్టి కాస్త వదులుగా తాళ్ళతో కట్టి - "ఓ అర గంట కష్టపడితే ఈ బంధనాలు విడిపించుకోవడం అంత కష్టం కాదు" అన్నాను.

"కానీ నువ్వు నా నుంచి తప్పించుకోలేవు. ఇంత వరకూ డిటెక్టివ్ వెంకన్న నా విషయంలో ఒక్కసారి కూడా ఫెయిల్ కాలేదు. జీవితంలో మళ్ళీ మరిచిపోలేని విధంగా నీకు పాఠం చెబుతాను. నువ్వు దొంగతనం చేశావని కాదు నా బాధ. నీ అత్యాశ నా రక్తాన్ని మరిగి స్తున్నది. ఆశపోతులను నేను భరించలేను."

శ్యామలరావు అరుస్తూనే వున్నాడు. అస లాయన యింట్లో యెప్పుడూ యింత డబ్బు వుండదట. ప్రత్యే కంగా అనాథుల వైద్యం కోసమని ఆయ నీ డబ్బు తెచ్చి వుంచాడట. రేపుదయం వాళ్లొస్తే తనేం చేయాలో తెలి యడం లేదని వాపోయాడు.

నే నా యింట్లోంచి బైటపడ్డాను. అంతా నా అదృష్టమే అనుకోవాలి. అదృష్టం కాకపోతే యెప్పుడూ యింట్లో డబ్బుంచని శ్యామలరావు అంత డబ్బెందుకు వుంచుతాడు' అనాథులకు వైద్యం సంగతి! అనాథులుగా బ్రతికే వాళ్ళు తమ జీవితాలను యెంత త్వరగా ముగించగలిగితే అంత మంచిది. వాళ్ళకు వైద్యం జరిపించి - వారి నికృష్ట జీవి తాలను పొడిగించడం సమాజానికీ అంత మంచిది కాదు.

అన్ని విధాలా మనసును సరిపెట్టుకుని హోటల్లోకి వెళ్ళి

పోయాను.

మా యిల్లు ఆ ఊళ్ళోనే వుంది. నా వాళ్ళంతా ఆ యింట్లోనే వున్నారు. కానీ దొంగతనం చేయాలనుకున్నప్పుడల్లా నేను మారువేషం వేసుకుని హోటల్లో మకాం పెడుతూంటాను. నా గురించి యెవరికీ యెలాంటి అనుమానమూ రాకూడదని నా ఆశ. ఏదైనా అర్జంటు కబురుంటే హోటల్ మేనేజరు కందజేయమని యింట్లో చెబుతాను. నేను హోటల్లో వుంటున్నట్లు యింట్లో వాళ్ళకు కూడా తెలియదు.

నిన్న హోటల్ ముందు ఓ కోయవాడు కూర్చున్నాడు. వా డెందుకో నన్ను చూస్తూనే "దొరా! నీకు అదృష్టం పట్టబోతోంది!" అన్నాడు. వాడి మాటల్ని నే నంత సీరియస్‌గా తీసుకోలేదు. అయినా వాడు మాట్లాడడం మానలేదు. నా జాతకం తిరిగిపోతుందనీ, దశ మారిపోతుందనీ చెప్పడం ప్రారంభించి పదిరూపాయ లిమ్మని అడిగాడు.

నేను సీరియస్‌గా, "ఎన్నాళ్ళలో మారుతుందంటావ్?" అన్నాను.

"రెండు మూడు రోజులు చాలు" అన్నాడు వాడు నమ్మకంగా.

"అయితే జాతకం తిరిగేక, దశ మారేక అప్పుడు నీకు పది కాదు - పాతిక రూపాయ లిస్తాను. రెండు మూడు రోజులు నువ్వూ ఆగి నీ జ్యోతిష విద్య ప్రభావాన్ని పరీక్షించుకుని వెళ్ళొచ్చు" అన్నాను.

ఇలాగంటానని వా డనుకున్నట్లు లేదు. ఇంకేమీ మాట్లాడలేదు.

వాడు చెప్పింది నిజమే అయింది. నిజంగా జాతకం

మారిపోయేటంత అదృష్టం పట్టింది. ఉదయమే వాడికి పాతిక రూపాయలూ యివ్వాలనుకుని గదిలోంచి బయటకు వస్తే తీరా డిటెక్టివ్ వెంకన్న కనిపించాడు.

అప్పుడు నాకు శ్యామలరావు వెంకన్న మీద పెట్టుకున్న ఆశలు గుర్తుకొచ్చాయి. అతడు అందుకే వచ్చాడా? వస్తే యిక్కడి కెలా రాగలిగాడు?

వెంకన్న హోటల్ మేనేజరుతో మాట్లాడుతున్నాడు. నేను నా గదిలోనికి వెళ్ళిపోయాను.

అనవసరంగా కంగారుపడడ మెందుకు? ఆయ నెందు కొచ్చాడో?

గదిలో అరగంట కూర్చున్నాను. ఇంక వెంకన్న వెళ్ళివుంటాడని ఊహించుకుని లేవబోయాను. సరిగ్గా అప్పుడే కాలింగ్ బెల్ మ్రోగింది.

ఎవరై వుంటారు?

తప్పకుండా డిటెక్టివ్ వెంకన్నే అయుంటాడు. అతడికి నా ఉనికి యింత త్వరగా యెలా తెలిసిపోయింది?

మొండి ధైర్యంతో వెళ్ళి తలుపు తీశాను.

బాయ్!

"ఇప్పుడు నా కేమీ అవసరం లేదే!" అన్నాను విసుగ్గా.

"డిటెక్టివ్ వెంకన్నగారట. మీతో మాట్లాడాలంటున్నారు. తమరు క్రిందకు వస్తారా, ఆయన్నిక్కడకు రమ్మంటారా?" అన్నాడు బాయ్.

అనుకున్నంతా అయింది. ఆయన నన్ను గుర్తించాడు.

"నా కిప్పుడు తల నొప్పిగా ఉంది. ఎవరితోనూ మాట్లాడలేను?"

"అలాగంటే ఆయన ఊరుకోరు సార్! డిటెక్టివులతో

లేనిపోని గొడవ లెందుకు సార్! ఓ అయిదు నిముషాలు మాట్లాడి పంపించేయండి!''

అప్పుడు గుర్తించాను. వెంకన్న ఎందుకొచ్చాడో తెలియకుండా అతడితో నేను మాట్లాడనంటే యిక్కడున్న వా రందరికీ నా మీద అనుమానం వస్తుంది. అసలు వెంకన్నకే లేనిపోని అనుమానాలు రావచ్చు.

ఏది యేమైనా వెంకన్నతో ఏకాంతంగా మాట్లాడడమే మంచిది. మా సంభాషణ నలుగురూ వినే చోట జరగడం శ్రేయస్కరం కాదు. ఇలా గనుకుని "సరే! అయితే ఆయన్ను పైకి రమ్మనమను'' అన్నాను.

బాయ్ వెళ్ళిపోగానే తలుపు గడియపెట్టాను. కిటికీ తలుపులు వేశాను. కర్టెన్లు లాగాను.

నా దగ్గ రిప్పుడు రెండు లక్షల రూపాయలున్నాయి. అవి వెంకన్న కళ్ళబడకుండా చేయాలి. నా కింకే ఉపాయమూ తోచలేదు. బెల్టు గట్టిగా బిగించి బనియన్లోంచీ లోపలకు నోట్లకట్టలు జారవిడిచాను.

అన్నీ వందరూపాయల కట్టలు. మొత్తం యిరవై. వంటికి గుచ్చుకుంటున్నాయి. వాటివల్ల పొట్ట కాస్త ఎత్తయింది. కానీ పెద్దగా తెలియడం లేదు. ఇలా అనుమానించడం కష్టం. అనుమానిస్తే నా కర్మ!

వెంకన్న పేరు చెబితే నా వళ్ళు జలదరిస్తోంది. ఆరేళ్ళ జైలుశిక్ష పడవలసింది నాకు. ఆయన నేరాన్ని కప్పిపుచ్చాడు. మరోసారి అలాంటి పని చేస్తే తనే స్వయంగా పోలీస్ స్టేషన్లో అప్పజెపుతానన్నాడు.

ఇప్పు డాయన అన్నంత పనీ చేస్తాడా?

కాలింగ్ బెల్ మ్రోగింది.

పెట్టుడు మీసాలు సవరించుకున్నాను. గరుకు గడ్డాన్ని రుద్దుకున్నాను. అంతా సరిగ్గానే వుంది. అద్దం ముందుకు వెళ్ళాను. అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు.

మేకప్‌లో మంచి ప్రావీణ్యమే సంపాదించాను.

అయినా వెంకన్న నన్ను గుర్తుపడతాడా?

మళ్ళీ కాలింగ్ బెల్ మ్రోగింది.

వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా డిటెక్టివ్ వెంకన్న!

నాకేసి చూసి నవ్వుతున్నాడు. ఆ నవ్వు చూడగానే ఆయన నన్ను గుర్తుపట్టాడని అనుమానం వచ్చింది. అయినా మేకపోతు గాంభీర్యం వహించాను.

వెంకన్న లోపలకు అడుగుపెట్టాడు. తనే తలుపు వేశాడు.

నేనేమీ మాట్లాడ లేదు. ఆయన ఓ కుర్చీలో కూర్చుని "నువ్వూ కూర్చో రమణా!" అన్నాడు.

రమణ నా అసలు పేరు కాదు. హోటల్లో ఉండడానికి సృష్టించుకున్న మారు పేరు. అంటే వెంకన్నకు నే నెవరో తెలియలేదన్నమాట!

తృప్తిగా నిట్టూర్చాను. కూర్చున్నాను.

"నువ్వేమీ అనుకోకూడదు. నే నొక చోరీ వ్యవహారం పరిశోధిస్తూ యిక్కడకు వచ్చాను" అన్నాడు వెంకన్న.

ఆయన తన చురుకు చూపులతో నా వంటిని గుచ్చుతున్నాడు. ఆ చూపులు బనియన్‌కూ నా శరీరానికీ మధ్య వున్న నోట్లను గుచ్చుతున్నట్లు నాకు అనిపిస్తోంది.

"నిన్న రాత్రి శ్యామలరావు యింట్లో చోరీ జరిగింది. దొంగ అత్యాశకుపోయి యినప్పెట్టెలో వున్న మొత్తం

రెండు లక్షలూ కాజేశాడు. వెంటనే శ్యామలరావు ఫోన్ చేసి నన్ను పిలిచాడు. నేను రంగంలోకి దిగాను."

"ఊఁ!"

"దొంగ యెవరో సులభంగానే తెలిసిపోయింది."

"ఎలా?" కుతూహలంగా అడిగాను.

"ప్రతి దొంగకూ ఓ పద్ధతి వుంటుంది. అదే వాడిని పట్టిచ్చింది" అని ఆగాడు వెంకన్న.

నే నాలోచిస్తున్నాను. ఏమి టా పద్ధతి? నేను చేసిన ఒకే ఒక్క దొంగతనం వెంకన్నకు తెలుసు. అందులోనూ ఇందులోనూ ఆయన గమనించిన పోలిక లేమిటి? గట్టిగా ఆలోచిస్తున్నాను.

"దొంగ పేరు సుబ్రహ్మణ్యం!" అన్నాడు వెంకన్న.

ఉలిక్కిపడ్డాను. అది నా అసలు పేరు. అంత సులభంగా వెంకన్న యెలా తెలుసుకున్నాడు?

"సుబ్రహ్మణ్యం దొంగతనం చేశాక ఇంటివారిని మంచానికి త్రాళ్ళతో కట్టిపోతాడు. అది అతడి ప్రత్యేకత. అదొక ప్రత్యేకమయిన ముడి. ఒక అరగంట శ్రమపడితే ఆ బంధాలను విడిపించవచ్చు...."

బాప్‌రే....ఎంత పొరపాటు చేశాను? వెంకన్న ఇంత దూరం ఆలోచించగలడని నేననుకోలేదు. ఆయన వెంటనే నా వెంటపడకుండా ఉండటానికీ—ఇంటిలో ఎక్కువసేపు బందీగా వుండకుండా వుండటానికీ అలాచేశాను. అదే నా కొంప ముంచింది.

వెంకన్న జేబులోంచి రెండు చాక్లెట్లు తీశాడు. ఒకటి నాకిచ్చి ఒకటి తను తిన్నాడు. నేను చాక్లెట్ నోట్లో వేసుకున్నాను. తియ్యగా ఎంతో బాగుంది.

"దొంగ సుబ్రహ్మణ్యం అని తెలియగానే అతడింటికి వెళ్ళాను. ఇంట్లో అడిగితే రెండ్రోజులుగా ఊళ్ళో లేడు అన్నారు. అర్జంటు పనివుంటే ఫలానా హోటల్ మేనేజరుకి సమాచారం అందచేయమన్నా రన్నారు. అంతే— అతడెక్కడున్నాడో నాకు తెలిసిపోయింది...." అన్నాడు వెంకన్న.

ఆర్నీ—ఈ డిటెక్టివులెంత అసాధ్యులు? నేనింట్లో ఈ హోటల్‌గురించి చెప్పకుండా ఉండాల్సింది. చెప్పినా రహస్యంగా ఉంచమనాల్సింది. రహస్యంగా వుంచమంటే అమ్మకో పెద్ద అనుమానం వస్తుంది. అది ఊరు ఊరంతా చర్చించేలా పాకిపోయినా ఆశ్చర్యంలేదు. ఇంకమీదట ఆ పని చేయకూడదు. అయినా రెండ్రోజులు ఇంట్లో లేకపోతే అంత అర్జంటు సమాచారా లేముంటాయి? అంతా నా తెలివి తక్కువ....

"హోటల్లో ఎంక్వయిరీని బట్టి సుబ్రహ్మణ్యం యిల్లు వదిలిన రోజునే ఇందులో ప్రవేశించినవారు ఇద్దరేనని తేలింది. అందులో ఒకామె స్త్రీ. రెండవది నువ్వు...." ఆగాడు వెంకన్న.

"అయితే?" అన్నాను. నా గొంతు తడారిపోయింది.

"అయితే ఏముంది—రెండురెళ్ళు నాలుగు...."

నాకు స్పృహ తప్పుతోందా అనిపించింది.

"వేషం బాగానే వేశావు. కానీ వెంకన్నముందు వేషాలెయ్యడం నువ్వుచేసిన పెద్దతప్పు!" అన్నాడు వెంకన్న.

"మీరు చెప్పేది నా కర్థం కావడంలేదు" అన్నాను.

"మిస్టర్ సుబ్రహ్మణ్యం—నా హెచ్చరికను నువ్వు పాటించలేదు. ఈ పర్యాయం నేను నిన్ను వదల దల్చుకో

లేదు. చేసిందానికి తగినశాస్తి అనుభవించు...."

"నన్ను మీరే రక్షించాలి....తమ్ముడి చదువుకు అర్జం టుగా అయిదొందలు కావలసొచ్చాయి. వేరేదారి కనబడ లేదు...."

వెంకన్నను దబాయించి ప్రయోజనంలేదని నాకు తెలుసు.

"వేరేదారి కనబడక కాదు....నువ్వు వెతుక్కోలేదు... అంతే!"

అదీ నిజమేనేమో....కానీ ఇప్పుడు నేనేం చేయాలి?

"నువ్వు తిన్నగా శ్యామలరావుగారింటికి వెళ్ళు. జరిగిందానికి క్షమార్పణలు చెప్పుకుని ఆయన డబ్బు ఆయన కిచ్చేసెయ్. ఆయన క్షమిస్తే ఇది చివరి దొంగతనం. క్షమించకపోతే పోలీసులు ఎలాగూ నీకిది చివరి దొంగ తనం చేస్తారు...."

"నేను వెళ్ళను...."

"వెళ్ళి తీరాలి. నీకూడా నేను రాకపోయినా కూడా వెడతావు నువ్వు" అని నవ్వాడు వెంకన్న—"ఇప్పుడు నువ్వు తిన్న చాక్లెట్ వుందిచూశావూ—అది విషం! సరిగా రెండుగంటల లోపున దానికి విరుగుడు పడాలి. లేకపోతే చచ్చిపోతావు. ఆ విరుగుడు శ్యామలరావు దగ్గర వుంది...." అన్నాడు వెంకన్న.

నాకు నవనాడులూ స్తంభించి నట్లయింది. నేను విషం మింగానా? ఈ వెంకన్న....అసాధ్యుడు! ఆయన వంక కోపంగా చూశాను.

"నీ ప్రాణాలు రక్షించుకుందుకు నీకింకా తొంభయ్యారు నిమిషాలు మాత్రమే టయిముంది" అన్నాడు వెంకన్న.

చటుక్కున లేచాను. వీధిలోకి పరుగెత్తాను.

హోటల్ గేటుదగ్గర కోయవాడు—"బాబూ! జాతకం తిరుగుతోందా?" అన్నాడు. వాడివంక గ్రుడ్లురిమి చూశాను.

శ్యామలరావు విరుగుడు ఇవ్వకపోతే.... నా జీవితకాలం నిముషాల్లోకి వచ్చేసింది.

నేను శ్యామలరావు ఇల్లు చేరేసరికి ఆయన దగ్గర యిద్దరు మనుషులున్నారు. నన్ను చూస్తూనే ఆయన—"అదుగో—మావా డొచ్చాడు. డబ్బు తీసుకుని వెడుదురు గాని—" అన్నాడు.

నేను మాట్లాడకుండా మొత్తం రెండు లక్షలూ వాళ్ళకి ఇచ్చేశాను. వాళ్ళు వెళ్ళిపోయారు. శ్యామలరావు నావంక అభిమానంగా చూసి—"నీ ఉపకారం మరచిపోలేను. ఏం కావాలో కోరుకో—" అన్నాడు.

ఆయన వెటకార మాడుతున్నాడని అర్థమయింది.

"ముందు విషానికి విరుగుడు కావాలి!" అన్నాను.

"అందుకింకా కాస్త టయముంది!" అన్నాడాయన—"ముందు నీకేం కావాలో కోరుకో!"

అది వేళాకోళమే కావచ్చు. నేను కోరుకోవడంలో నష్టమేముంది? "నా కుద్యోగంలేదు. అది ఇప్పించండి. అర్జంటుగా వెయ్యిరూపాయలు కావాలి. అవి ఇప్పించండి. ప్రస్తుతానికింతే నా కోరిక—" అన్నాను.

"అలాగే—కానీ ఇప్పుడు నువ్విచ్చిన రెండులక్షలూ నేను నీకు బాకీవున్నాను. అది నువ్వు సంపాదించుకున్న డబ్బు. ఒక్కసారిగా నీ బాకీ తీర్చలేను. రేపువచ్చి నువు కోరిన వెయ్యీ, నా బాకీ మొదటివాయిదా పాతికవేలూ పట్టుకుపో—ఉద్యోగం సంగతి—ఒకటి రెండు నెలల్లో చూద్దాం—" అన్నాడు శ్యామలరావు.

అది కలో, నిజమో తెలియలేదు నాకు

"మీరు నాతో వేళాకోళం మాడుతున్నారు" అన్నాను.

"వేళాకోళం నీతో ఎందుకాడతాను? నువ్వు నాకు సమ వుజ్జీవి కాదు...."

"మరి మీ మాటల అర్థం ఏమిటి?"

"నువ్వు నాకు వుపకారం చేశావు. అందుకిది ప్రత్యుప కారం. అంతే!" అన్నాడు శ్యామలరావు.

"నేను మీకు ఉపకారం చేశానా, ఎప్పుడు?" అన్నాను.

"నువ్వు వెళ్ళిన అరగంటకు నేను నీ కట్లనుంచి బయటపడి—డిటెక్టివ్ వెంకన్నకు ఫోన్‌చేసి రప్పించి నిన్ను పట్టుకోమని చెప్పాను. ఆయన ఇక్కడి పరిస్థితిచూపి మర్నాటికల్లా దొంగ దొరుకుతాడని హామీ ఇచ్చాడు. ఆ తర్వాత ఇంకో గంటకి ఇన్‌కంటాక్సు వాళ్ళు నా యింటి మీద దాడిచేశారు. నా శత్రువులెవరో రహస్య సమాచారం సేకరించి డిపార్టుమెంటుకు తెలియజేశారు. నువ్వు వచ్చి వుండకపోతే నాపని అయ్యేది. మచ్చలేని జీవితం గడుపు తున్న ఈ శ్యామలరావును ఏదో అదృశ్య శక్తి కాపాడు తోంది. ఆ అదృశ్య శక్తే నిన్ను పంపించిం దనిపించింది. అందుకే నిన్ను సన్మానించా లనుకున్నాను...." అని ఆగాడు శ్యామలరావు.

నేను నిశ్చేష్టుడనై నిలబడ్డాను.

ఆయన నాకు ఓ చాక్లెట్ యిచ్చి—"ఇది విరుగుడు!" అన్నాడు.

చటుక్కున అది మింగాను....

మర్నాడు శ్యామలరావు నాకు నిజంగానే ఇరవయ్యారు వేలు ఇచ్చాడు. కోయవాడికి పాతికరూపాయ లివ్వడం కోసం నేను హోటల్‌వైపుగా పరుగెత్తాను. □

దీవిలో దొరికిన శవం

ఎమ్.వి.వి. సత్యనారాయణ



శవం కాళ్ళూ చేతులూ కట్టివున్నాయి. కట్టడానికి కొబ్బరి డొక్క తాడు వుపయోగించారు. కాళ్ళమీదుగా చేతుల మీదుగా శరీరాన్ని చుట్టి కొబ్బరిడొక్క త్రాటితో బలంగా కట్టారు.

ఆ శవం వాళ్ళకు పగడాల దీవిలో దొరికింది. పగడాల దీవి విశాఖపట్టణానికి నాలుగయిదు మైళ్ళదూరంలో వుంది. నివాస యోగ్యంకాని అతి చిన్నదీవి అది.

"ఇతడిని గుర్తు పట్టారా?" అడిగాడు క్రయింబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్.

కుమార్‌కి చిరాకుగా వుంది. నగరంలోని కేసులతోనే తనకి తలనొప్పిగా వుంది. ఇక చుట్టుప్రక్కల దీవులలో కూడా శవాలు ప్రత్యక్షమవుతే....

సబ్‌యిన్‌స్పెక్టర్ ఆయనవైపు భయంగా చూశాడు.

"ప్రైవేటవున్‌లో ఒకవ్యక్తి నాలుగు రోజులుగా కనిపించడం లేదని రిపోర్టు ఫయిలయిందిట సార్!"

"అతడి ఫోటో యిచ్చారా?"

"ఇచ్చార్సార్! అతడే యితడు!"

"రిపోర్ట్ ఎవరు ఇచ్చారు?"

"అతడి భార్య!"

"ఫైలు పుటప్ చేశారా?"

"చేశాను సార్!" అతడు ఫైలు అందించాడు.

కుమార్ ఫైలు చదవసాగాడు.

దీవిలో దొరికిన శవం కాంతారావుది. అతడు నిషా బార్‌లో పనిచేస్తాడు. వెయిటర్. నాలుగురోజుల క్రితం అంటే జనవరి 10 నుండి కనిపించడంలేదని రిపోర్ట్‌వుంది. 10 రాత్రి డ్యూటీకి వెళ్ళినవాడు వెళ్ళినట్టే మాయమయాడు. అతడిభార్య వెంకటలక్ష్మి రిపోర్ట్ యిచ్చింది. నిషాబార్ ప్రైవేటవున్ ఏరియాలోదే!

"మీకు అంతకంటె మంచి శవం దొరకలేదా?" నవ్వాడు పాథాలజీ సర్జన్.

"బాగా చెడిపోయింది! ఆ దీవి మీదనుండి యిక్కడకి

తీసుకురావడం ప్రళయమయింది!" చెప్పాడు కుమార్.

"నాలుగు రోజులయి నీళ్ళలో నానివుంది! బాగా వుబ్బి పోయి వుంది. తలమీద దెబ్బ తగిలినట్టు సూచన లున్నాయి."

"తలమీది దెబ్బవల్లనే ప్రాణాలు పోయాయా?"

"దెబ్బ ప్రాణాలు పోయాక అయినా తగిలి వుండచ్చు. వూపిరి తిత్తులలో, జీర్ణకోశంలో సముద్రపు నీళ్ళు వున్నాయి."

"అంటే ముందే ప్రాణాలు పోయివుంటే శరీరంలోపల సముద్రజలం చేరివుండదు!"

"కరెక్ట్! నాకు ఇంకా ఒకటిరెండు సందేహాలున్నాయి. అవి తీర్చుకోవాలి!"

"ఏమిటా సందేహాలు?"

"శవం దుస్తులలో నాచువుంది! జీవశాస్త్రవేత్తలు తీర్చవలసిన సందేహం!"

"శవానికి కట్టిన కొబ్బరితాడు యివ్వగలరా?"

"షూర్!" పాథాలజీ సర్జన్ బల్లమీది బెల్ నొక్కాడు. ప్యూన్ కొబ్బరితాడు తెచ్చిపెట్టాడు.

"మొత్తం పన్నెండుమీటర్ల తాడు" అన్నాడు సర్జన్. కుమార్ త్రాడును చేతిలోకి తీసుకున్నాడు.

"మీరు అనిన నాచు ఈ త్రాడుకు అంటలేదా?" త్రాడును త్రిప్పసాగాడు. పీచుమధ్య నాచు ఆకు కనిపించింది. ఆకు ప్రక్కగా ఎర్రటి చారవుంది.

"ఈ చార ఏమిటంటారు?"

"ఇనుప వస్తువుకు సంబంధించిన త్రుప్పు."

"అంటే?"

"శవానికి త్రాడుకట్టి వుంచారు. తర్వాత శవం యేదో

ఇనుపరాడ్‌కి కట్టి వుంచడమో, వ్రేలాడదీయడమో చేసి వుంటారు! తాడుమీద ఎక్కువ బరువు మోసినచోట శవం దెబ్బ తిన్నది."

కుమార్ ఆలోచనలో పడ్డాడు.

2

డిటెక్టివ్ శిరీష్ ఆమెవైపు పరిశీలనగా చూశాడు. వీణకు ఇరవై రెండేళ్ళ వయస్సు వుంటుంది. సన్నగా మెరుపు తీగలాగా వుంది. ఒత్తయిన నల్లని జుత్తూ, విశాలమైన నేత్రాలూ, సంపెంగలాంటి ముక్కూ, లక్కపిడత లాగా చిన్ననోరూ, మొనదేలిన గడ్డమూ, ఎర్రటి శరీర ఛాయకు తగినట్టుగా రోజ్‌కలర్ చీరా, దంతం రంగు బ్లవుజూ, కాళ్ళకు ఎత్తు మడమల చెప్పులూ.

'ఆకారానికి తగ్గపేరు వీణ!' తలూపాడు శిరీష్.

"కాంతారావు పనిచేసే నిషాబార్ వద్దనే మా ఫిషింగ్ ట్రాలర్స్ వున్నాయి. నాన్నగారు నాలుగురోజుల క్రితం కాంతారావును ట్రాలర్‌మీద సముద్రంలో త్రిప్పారు. కాంతారావు సరదాపడ్డాడు. నాన్నగారికి కూడా కాంతారావు పట్ల అభిమానం! బార్‌కి వెళ్ళినప్పుడల్లా ఆత్మీయంగా అటెండవుతాడట."

"మీ నాన్నగారు....సుబ్రహ్మణ్యంగారు అతడిని హత్య చేసినట్టు ఎలా పట్టుకున్నారు?"

"కాంతారావు చివరిసారిగా ప్రాణాలతో వున్నప్పుడు మా నాన్నగారితోబాటు ట్రాలర్‌మీద కనిపించాడు. అది మొదటి కారణం. రెండో కారణం...." వీణ వూపిరి పీల్చుకోవడానికి ఆగింది.

ఆమె ఎర్రబడిన కళ్ళవైపే చూశాడు శిరీష్.

"నాన్నగారు రొయ్యలను రష్యాకు ఎగుమతి చేస్తారు.

రొయ్యల గంపలను కట్టడానికి కొబ్బరితాడు కొన్నారు. గంపలలో రొయ్యలు ఐస్‌ఫాక్టరీకి వెళతాయి. అవి అక్కడ డ్రెస్సింగ్ అయి టిన్స్‌లో పాక్ అవుతాయి. శవాన్ని కట్టి సముద్రంలోకి ముంచిన త్రాడు ఆ కొబ్బరి త్రాడులోంచి కట్ చేసిందే!"

"కొబ్బరి త్రాటినిబట్టి పోలీసులు మీ నాన్నగారిని అరెస్టు చేశారా?"

"అడవి పక్షులను వేటాడటానికి నాన్నగారు 10 వ తారీకున పగడాలదీవికి వెళ్ళారు. చేపలుపట్టే ట్రాలర్‌లో వెళ్ళినట్టు రుజువయింది. ఆరోజే కాంతారావును ట్రాలర్లో సముద్రంలో త్రిప్పి మరో ట్రాలర్‌లో వెనక్కి పంపేశారు. పోలీసుల కథనం ప్రకారంగా నాన్నగారు కాంతారావును దీవిమీద చంపి వెనక్కి వచ్చారట!"

"కాంతారావును వెనక్కి పంపిన ట్రాలర్ ఎవరిది?"

"నాలుగయిదు ట్రాలర్స్ ఒకేసారి ఎదురయ్యాయట! ఏ ట్రాలర్ ఎక్కి కాంతారావు ఒడ్డుకు చేరుకున్నాడో చెప్పలేక పోతున్నారు."

"ట్రాలర్స్‌ను దర్యాప్తు చేయలేదా?"

"పోలీసుకేసు కావడంతో వ్యవహారం బిగుసుకుపోయింది. కాంతారావు ఎవరి ట్రాలర్‌లో వెనక్కివస్తే ఆ ట్రాలర్‌లో వున్నవాళ్ళుకూడా అనుమానితులుకావచ్చును!"

"కాంతారావును హత్య చేయడానికి పోలీసులు యేం మోటివ్‌ను చూపిస్తోన్నారు?"

"నాన్నగారి ఆంతరంగిక విషయాలు కాంతారావుకు తెలుసునట. కాంతారావు ఆయనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. అందుకే ఆయన మంచిగా నటించి కాంతారావును సముద్రంలో ముంచి చంపారట!"

శిరీష్ నుదురు చిట్లించాడు.

"మిస్ వీణా! మీ కుటుంబం మీదగానీ, మీ నాన్నగారి మీదగానీ ఎవరికయినా కక్షవుందా?"

"నాకు ఆ విషయం తెలియదు."

"ఈమధ్య ఎవరినయినా దూషించడంగానీ, యెవరితో నయినా ఘర్షణ పడటంగానీ జరిగిందా?"

"లేదనుకొంటాను!"

శిరీష్ నవ్వి, "ఇంటరెస్టింగ్.... కేసు టేకప్‌చేస్తాను" అన్నాడు.

3

క్రయింబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ కుర్చీలో వెనక్కివాలాడు.

"కాంతారావుకు మోటివ్ రుజువు కాలేదు. ఒప్పుకుంటాను!" అన్నాడు.

డిటెక్టివ్ శిరీష్ బల్లమీద చిటికెలు వేశాడు.

"అయితే సుబ్రహ్మణ్యంమీద కేసు నిలవదు" అన్నాడు శిరీష్.

"సుబ్రహ్మణ్యం కాపిటలిస్ట్. బార్‌కి వెళ్ళే అలవాటున్నవాడు. అతడికి స్త్రీ వ్యసనం వుంది. ఆ విషయం అతడే ఒప్పుకున్నాడు. ఆ రహస్యాలు కాంతారావుకి తెలిసుండాలి!"

"కాంతారావు ఆయనను బ్లాక్‌మెయిల్ చేసినట్టు తెలిసిందా?"

కుమార్ పకపక నవ్వాడు. "నలుగురికి తెలిసేలాగా చేస్తే అది బ్లాక్‌మెయిలింగ్ అవుతుందా?"

శిరీష్ మొహం ఎర్రగా అయింది.

"సుబ్రహ్మణ్యానికి స్త్రీ వ్యసనం వున్నట్టు బార్‌లో అందరికీ తెలుసా?"

"వెయిటర్స్‌కి అందరికీ తెలుసు!"

"అయితే ఇక బ్లాక్‌మెయిలింగ్‌కి అవకాశం ఎక్కడ?"

"కాంతారావుకు తెలిసిన లోతైన విషయాలు అందరికీ తెలిసి వుండవ్!"

"పిట్టలేని పొదచుట్టూ తిరుగుతున్నాం మనం!"

"అంటే?"

"బ్లాక్‌మెయిలింగ్ విషయం నిర్ధారణ కాలేదు. నిర్ధాణ కాని విషయం చుట్టూ చర్చ అనవసరం!"

"ఆల్‌రైట్! హత్యకు మోటివ్...."

"నాలుగుమైళ్ళదూరం దీవిమీద శవం వున్నట్టు పోలీసులకు యెలా తెలిసింది?"

"జయంత్ అనే ఆయన తన డకోటాలో పక్షుల వేటకి వెళ్ళాడు. పగడాల దీవి బీచ్‌మీద శవం చూశాడు. వెంటనే నగరానికి వచ్చి మనకి తెలియపరచాడు."

"జయంత్....అంటే నగరంలో సెవెన్‌స్టార్ హోటల్ నడిపే జయంత్."

"అవును."

"ఒక పని చెయ్యి."

"ఏమిటది?"

"నావల్ హెలికాప్టర్ ఎరువు తీసుకురా! మనం పగడాల దీవికి వెళ్దాం."

"ఎందుకు? ఫిషింగ్ ట్రాలర్ వుంది. దాంట్లో...."

"వద్దు.... హెలికాప్టరే!"

"ఆల్‌రైట్!"

4

జయంత్ కారుని పోలీస్ స్టేషన్ ముందాపాడు. చక చక లోపలకు నడిచాడు. మెజిస్ట్రేట్ యిచ్చిన కాగితం

చూపించాడు.

సార్జెంట్ అతడిని సుబ్రహ్మణ్యం వున్న సెల్‌కి తీసుకు వెళ్ళాడు.

"అరె, జయంత్ మీరా!" ఆశ్చర్యపోయాడు సుబ్రహ్మణ్యం.

జయంత్ కొద్దిసేపు ఆయనతో ఏదో మాట్లాడాడు.

సుబ్రహ్మణ్యం కోటీశ్వరుడు అయినప్పటికీ ఆయన కళ్ళలో దైన్యం!

సార్జెంటు సెల్‌ని సమీపించాడు.

"రండి.... టైమయిపోయింది!" అన్నాడు సార్జెంటు.

జయంత్ బయటకు కదిలాడు.

సుబ్రహ్మణ్యం కళ్ళలో నీళ్ళు.

బూట్లు టకటక లాడించుకుంటూ ఇన్‌స్పెక్టర్ కుమార్, డిటెక్టివ్ శిరీష్ ఆఫీసు గదిలోకి వచ్చారు.

జయంత్‌ను విష్ చేశాడు కుమార్.

శిరీష్‌కి పరిచయం చేశాడు. జయంత్ స్నేహంగా నవ్వాడు.

"జనవరి 13న మీరు పగడాలదీవి మీదకు వెళ్ళారు గదా!" అడిగాడు శిరీష్.

"అవునండి. డకోటాలో వెళ్ళాను."

"పక్షులు దొరికాయా?"

"లేదు."

"వెంటనే తిరిగి వచ్చారా?"

"బీచ్‌లో శవాన్ని చూశాక యిక ఎగర బుద్ధికాలేదు."

"సుబ్రహ్మణ్యంగారు మీకు తెలుసా?"

"చాల కాలంగా తెలుసు."

"వీణ ఎటువంటిది?"

"మంచి అమ్మాయి!"

"ఇపుడు సుబ్రహ్మణ్యం గారితో మాట్లాడుకోటానికి వచ్చారా?"

"అవునండి. కేవలం సానుభూతికోసం!"

"హంతకుడి మీద సానుభూతి ఏమిటి?"

"హత్యకు దారితీసిన పరిస్థితులమీద!"

"పరిస్థితులు ఏమిటంటారు?"

జయంత్ పెదిమ విరిచాడు. "ఏమైతే అవి!"

శిరీష్ తలూపి లోపలకు నడిగాడు. కుమార్ వద్ద సెలవు పుచ్చుకుని జయంత్ వెళ్ళిపోయాడు.

శిరీష్, కుమార్ కుర్చీలు లాక్కుని కూర్చున్నారు.

"జయంత్ ఎలా వచ్చి మాట్లాడాడు?" అడిగాడు కుమార్.

"జుడీషియల్ మేజిస్ట్రేట్ నుండి ఆర్డర్ తెచ్చుకున్నార్ సార్!" అన్నాడు సార్జెంట్.

కుమార్ తెల్లబోయాడు.

"సుబ్రహ్మణ్యగారికి యాంటిసిపేటరీ బెయిలు యివ్వ లేదా?" అడిగాడు శిరీష్.

"లేదు."

"శవం దొరికిన స్థలం గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"సముద్రంలో మునిగిపోతుందని ఆశించాడు హంతకుడు. కాని అది పగడాల దీవికి కొట్టుకువచ్చింది."

"శవం కొట్టుకు రాలేదు. కెరటాలు వచ్చివుండే పొదల మీద యిసుక వుండేది. అంతేకాదు. పదిరోజులుగా

సముద్రానికి పోటు రాలేదు. ఓషనోగ్రఫీ నిపుణులు చెప్పారు!"

"అయితే శవం....దీవిమీద...."

బల్లమీద టెలిఫోన్ మ్రోగింది.

టెలిఫోన్‌లో పాథాలజీ సర్జన్ పలికాడు.

"ఆ నాచు సముద్రంలో పెరిగే నాచు కాదు! చెరువులోని నాచు!" అన్నాడు సర్జన్.

"వాట్ డూ యూ మీన్...." అరిచినంత పని చేశాడు కుమార్.

"శవం కొంతకాలం చెరువులో వుండి వుండాలి. అందుకే శవం దుస్తులలోనూ, త్రాటికీ నాచు అంటింది. ఆ నాచు వుప్పునీటిలో పెరగదు!"

"సుబ్రహ్మణ్యం గారికి చెరువు వుందా?" అడిగాడు శిరీష్.

కుమార్ లేచాడు. ఇద్దరూ సెల్‌వద్దకు నడిచారు.

"నాకు నగరం చివరగా పాత మేడ వుంది. దాని ముందు వుపయోగంలోలేని ఈత కొలను వుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

కుమార్, శిరీష్ మొహాలు చూసుకున్నారు.

5

నగరానికి చివరగా పాత మేడ.

శిరీష్ గేటు తెరిచాడు. లోపలకు అడుగు వేయబోతూ ఆగాడు.

కుమార్ చుట్టూ చూడసాగాడు.

శిరీష్ దృష్టి నేలమీద కేంద్రీకరించి వుంది.

నేలమీద కారు టైర్ల గుర్తులు!

శిరీష్ జేబులోంచి టేపు తీశాడు. టైర్ల గుర్తులను కొలవసాగాడు. ముందు చక్రాల మధ్య కొలతలు తీశాడు. వెనక చక్రాల మధ్య కొలత తీసి వాటికీ వీటికీ మధ్యదూరం కొలిచాడు.

"పెద్ద కారు. బహుశా ప్లిమత్ అయి వుండాలి!" అన్నాడు కుమార్.

శిరీష్ తలూపి ముందుకు నడిచాడు.

పగిలిన సిమెంటు పలకలమధ్య చెరువు.

సుబ్రహ్మణ్యం చెప్పిన ఈతకొలను. కొలనునిండా నాచు పట్టి వుంది.

"నువు సుబ్రహ్మణ్యంమీద కేసును మరీ బలిష్టం చేశావు!" అన్నాడు కుమార్.

"లేదు. కేసు మొదట్లోనే నువు పప్పులో కాలు వేశావు."

"ఎలా?"

"చెబుతాను" శిరీష్ కాగితంమీద ప్రశ్నలు రాయసాగాడు.

6

"నువ్వెవరవు?" అరిచాడు అతడు.

"నువు పగడాల దీవికి వేటకు వచ్చావు!" ఫోన్‌లో వినిపించింది.

"ఎప్పుడు?"

"జనవరి 10 న. పక్షులవేటలో సీజన్‌లో చివరిరోజు!"

"అయితే?"

"తర్వాత నువు బీచ్‌లో శవాన్ని దింపావు! ఆ రోజున కాదు!"

"ఎలా?"

"త్రాడు కట్టి."

"ఎక్కడ నుండి?"

"చెబుతాను. సుబ్రహ్మణ్యం ఈతకొలను దగ్గరకు రా."

క్లిక్ మన్నది.

అతడు రిసీవర్‌లోకి చూశాడు. చెమటలు క్రక్కుతున్నాడు. పోర్టికోలోకి చూశాడు. కారు లేదు. చకచక రోడ్డుమీదకు వచ్చాడు. చకచక భవనంలోకి పరుగెత్తాడు. జేబునిండా నోట్లకట్టలు క్రుక్కుకున్నాడు.

రోడ్డుమీదకు పరుగెత్తి టాక్సీ పట్టుకున్నాడు.

నగరం చివరలో పాత మేడవద్ద ఆగాడు. ఈతకొలను వైపు నడిచాడు. గేటు దాటాడు.

"చేతులెత్తి వుంచు కదలక!" గేటులో వినబడింది.

అతడు చేతులెత్తి వుంచాడు. తల త్రిప్పబోయాడు.

"తల త్రిప్పక! జయంత్!" అరిచాడు శిరీష్.

"మీరా?"

"అవును. నేనే ఫోన్ చేశాను. నీకూ సుబ్రహ్మణ్యానికీ మధ్యగా కాంతారావు వచ్చాడు. రొయ్యల బిజినెస్‌లో నువ పార్టనర్‌గా చేరాలనుకున్నావు. ఆయన కూతురు వీణను బుట్టలో వేసుకోవాలనుకున్నావు. నీకు చాల దురలవాట్లున్నాయి. వాటిని కాంతారావు సుబ్రహ్మణ్యంగారికి చెప్పాడు.

నువు కోపంతో సుబ్రహ్మణ్యం దృష్టిలో పడకుండా కాంతారావును మట్టుపెట్టావు. నేరం సుబ్రహ్మణ్యం మీదకు పోయేలాగా ప్రయత్నించావు. రొయ్యల పాకింగ్‌కు అతడు తెచ్చిన కొబ్బరి త్రాడు సంగ్రహించావు. కాంతారావు ఫిషింగ్ ట్రాలర్‌మీద వెళ్ళడం చూశావు. కాంతారావు

దీవికి వెళ్ళడు. అతడికి బార్‌లో డ్యూటీ వుంది. కాంతా రావు సగం ప్రయాణంలో తిరిగి వస్తాడని నువు నిర్ధారించు కున్నావు.

నువు పదేపదే కాంతారావు గురించి ప్రశ్నించడం వీణ విన్నది. అయితే అది ఏమంత ప్రముఖ విషయంగా ఆమె గుర్తించలేదు. ట్రాలర్‌లో ఒడ్డుకు తిరిగి వచ్చిన కాంతా రావును దొరకబుచ్చుకున్నావు. సముద్రంలో ముంచి చంపాలనుకున్నావు. ఆతడు అరవకుండా తలమీద రాడ్‌తో కొట్టావు. అతడు స్పృహ తప్పి వుంటాడు. ఆ స్థితిలో సముద్రంలో ముంచి చంపావు. శవాన్ని తీసుకెళ్ళి సుబ్రహ్మణ్యంగారి ఈతకొలనులో దాచివుంచావు" ఆగాడు శిరీష్.

జయంత్ విసురుగా వెనక్కి తిరిగాడు.

అతడి మొహం నీటిలో ముంచినట్టుగా వుంది. పెదిమలు వొణుకుతున్నాయి.

"అవును. శవాన్ని 12వ తేది రాత్రి డకోటాలో చేర్చాను. కాంతారావును తలమీద కొట్టిన రాడ్‌ను శరీరానికి అంటించి పెట్టి కొబ్బరి డొక్కు త్రాటితో శవాన్ని కట్టాను. పొడవుపాటి నైలాన్ త్రాటికి రాడ్‌ను కట్టాను. శవాన్ని విమానంలోంచి దీవిలో దింపాను.

కాంతారావు అడ్డం తప్పుకుంటాడు.

సుబ్రహ్మణ్యం జైలుపాలవుతాడు.

లక్షల ఆస్తితో, బిజినెస్సుతో వీణ నాకు దగ్గరవాల. ఇదీ నా వ్యూహం! అయితే నేనే హత్య చేసినట్టు మీకు ఎలా తెలిసింది?" అడిగాడు జయంత్ ఆశ్చర్యంగా.

"శవం తీరానికి నాలుగుమైళ్ళలో వుంది. దాని ఆచూకీ

పోలీసులకు ఎలా తెలిసింది?

జనవరి 13 న నువ్వు పగడాల దీవికి వెళ్ళావు. ఎందుకు? పక్షులకోసం! కాని పక్షులు లేవు. వుండవని నీకు తెలుసు. పక్షులవేట సీజన్ కాదు ఇది. నగరంలోని వేటగాళ్ళకు తెలిసిన విషయం నీకు తెలియక కాదు. శవాన్ని దీవిలో వదిలి పోలీసులకు సమాచారం అందించావు.

శవానికి నాచు పట్టి వుంది. సముద్రంలో చనిపోయిన కాంతారావుకు నాచు ఎలా పట్టింది?

సుబ్రహ్మణ్యంగారికి ఈత కొలను వుంది.

ఆయన తానే కాంతారావును సముద్రంలో ముంచి చంపి తన కొలనులో శవాన్ని దాస్తాడా, ఎందుకు? శవాన్ని సముద్రంలో వదిలించుకోవడం సులువుగదా!

ఈతకొలనును పరిశీలించాం.

కొలను యివతల ప్లిమత్ కారు వంటి భారీ కారు ఆగి నట్టు టైర్ల గుర్తులున్నాయి.

సుబ్రహ్మణ్యంగారిది ఫియట్ కారు. చిన్న కారు.

మీది చెవర్లెట్. భారీ వాహనం! టైర్ల గుర్తులు సరి పోతాయి. అందుకే కొంత కల్పించి నీకు ఫోన్ చేశాను. నువ్వు పట్టుబడ్డావు."

జయంత్ చటుక్కున తన జేబులోంచి నోట్ల కట్టలు తీశాడు.

"ఎంత కావాలి?" హీనస్వరంతో అడిగాడు.

శిరీష్ హేళనగా నవ్వాడు. "పెట్టుబడిదారీ మనస్తత్వం నువ్వు ప్రదర్శించడం మానలేదు. ఐ హేట్ బ్లడీ మెంటాలిటీ!"

శేఖరం బెల్టు విప్పుకున్నాడు. అప్పటికే ప్రతిమ సీట్లోంచి లేచింది. ఇద్దరూ విమానంలోంచి దిగారు. బొంబాయి శాంతాక్రజ్ విమానాశ్రయం రద్దీగా వుంది.

శేఖరం రన్‌వేమీద నడుస్తూ వాచీ చూసుకున్నాడు.

మధ్యాహ్నం 1.10 ని॥ మరో ఇరవై నిమిషాల్లో హైదరాబాద్ వెళ్ళే కారవెల్లీ వుంది.

ఆఫీస్ రూంకి నడిచి పని ముగించుకున్నాడు శేఖరం.

భార్యతో కలసి కారవెల్లీలో కూర్చున్నాడు.

"ప్రతిమా! ఏమైనా తాగుదాం!" అన్నాడు శేఖరం ప్రేమగా.

ప్రతిమ తలూపింది.

శేఖరం సైగ చేశాడు. ఎయిర్‌హోస్టెస్ వారిని సమీపించింది. ఆమె చేతిలో ట్రే వుంది. ట్రేలో డ్రింకులూ, చాక్‌లెట్లూ, బిస్కత్తులూ వున్నాయి.

భార్యాభర్తలు బిస్కట్స్: డ్రింక్సూ తీసుకున్నారు.

ఎయిర్‌హోస్టెస్ నవ్వుతో చూచింది. "ఫ్రం హాలెండ్!" అడిగింది.

శేఖరం తలూపాడు. ఎయిర్‌హోస్టెస్ వెళ్ళిపోయింది.

"మరో రెండు గంటల్లో హైదరాబాదులో వుంటాం!" అంది ప్రతిమ.

శేఖరం సీట్లో వెనక్కి వాలాడు. తన తలలో అనేకమైన ఆలోచనలు మెదులుతోన్నాయి. హాలండులో బయలుదేరేటప్పుడు తమ కారును ఏదో కారు వెన్నాడింది. హాలండ్ విమానాశ్రయంలో తమని ఎవరో పలకరించారు.

"ఇండియాకేనా?" అన్నారు వాళ్ళు.

విమానంలో వున్నంతసేపూ తమని ఎవరో కనిపెడుతోన్నట్టే అనిపించింది.

ఇప్పుడు ఎయిర్ హోస్టెస్ "ఫ్రం హాలెండ్?" అని అడిగింది.

తమ గురించి ఎవరో ఎందుకో సమాచారం లాగుతో

న్నారు. తన మేనమామ రాజావారి ఆస్తికి తానే వారసుడు. ప్రతిమ ఆయనకు ఒక్కతే కూతురు. రాజావారికి హాలండులో బిజినెస్సు వుంది. దాన్ని ఆయన తన చేతిలో పెట్టాడు. ఇప్పుడు తామిద్దరమూ రాజావారు ఏర్పాటుచేసిన 'తరతరాల ప్రదర్శ' నకు ఆహ్వానం మీద ఇండియా వచ్చారు.

"చూడండి!" అంది ప్రతిమ మోచేత్తో పొడిచి.

శేఖరం అటు చూశాడు.

గుమ్మం దగ్గర ఎవరో నిలబడి వున్నారు. హాలండ్ ఎయిర్‌పోర్ట్‌లో పలకరించింది అతడే. అతడు తమవైపు చూచీ చూడనట్టు చూస్తోన్నాడు. అతడు ఎవరు? తమ వెంట ఈ కారవెల్లీలో రావడానికి కారణం ఏమిటి? లేక అతడూ తన పనిమీదే హైదరాబాద్ వస్తున్నాడా?

"అతడు మనలనే ఎందుకు పరిశీలిస్తోన్నాడు?" అడుగుతోంది ప్రతిమ.

ఎయిర్‌హోస్టెస్ గుమ్మంలో ప్రత్యక్షమయింది.

"ప్లీజ్....మీ సీటులో కూర్చోండి" అతడిని అభ్యర్థించింది ఎయిర్ హోస్టెస్.

అతడు చకచక నడచి శేఖరం వెనకసీట్లో కూర్చున్నాడు.

భార్యాభర్తలు యిబ్బందిగా కదిలారు.

మరో నిముషంలో విమానం రన్‌వేమీద పరుగెత్తుతోంది. బేగంపేటలో విమానం దిగింది.

శేఖరం, ప్రతిమ విమానాశ్రయంలోంచి బయటపడ్డారు.

శేఖరం వెనక్కి తిరిగి పరిశీలనగా చూశాడు. తమని వెంటాడుతోన్న వ్యక్తి కనిపించలేదు.

భార్యాభర్తల ముందు టాక్సీ ఆగింది. డోర్ తెరచి కూర్చున్నారు.

టాక్సీ కదిలింది. వసంతవిహార్ ముందు ఆగింది.

భార్యాభర్తలు టిఫిన్ సెక్షన్‌లో ప్రవేశించారు. తృప్తిగా టిఫిన్ చేశారు. టాక్సీ డ్రయివర్‌కి కూడా టిఫిన్ ఆర్డర్ యిచ్చారు.

"నాగార్జునసాగర్ వెళ్ళాలి. వస్తావా?" అడిగారు టాక్సీ డ్రయివర్‌ను.

అతడు తలూపాడు.

సాగర్ రోడ్లో బయలుదేరింది టాక్సీ.

"హాలండు నుండి వస్తున్నారా?" అడిగాడు టాక్సీ డ్రయివర్, తల తిప్పకుండానే.

శేఖరం, ప్రతిమ వులిక్కిపడ్డారు.

"నువ్వు ఎవరు?" అడిగాడు శేఖరం.

టాక్సీ డ్రయివర్ పక పక నవ్వాడు. మరుక్షణంలో టాక్సీ ఆగింది. నిర్మానుష్యమైన అడవిమార్గం. అతడి చేతిలో పిస్తోలు మెరిసింది.

"ఆస్తే అల్లరి చేయవద్దు. సహకరిస్తే మీ యిద్దరి ప్రాణాలు గడ్డిపరకలు కావు!" పక పక నవ్వాడు అతడు.

2

రాజావారి భవనం ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది. ఎటు చూచిన పచ్చటి జెండాల తోరణాలు కట్టారు. రంగు రంగుల విద్యుద్దీపాల వెలుగులో అతిథులు తళతళలాడుతోన్నారు.

రాజావారు శేఖరం అతిథులను రిసీవ్ చేసుకుంటున్నారు.

"తమ అల్లుడుగారు వచ్చారు. మరి అమ్మాయి ఎక్కడ?" అడుగుతోన్నారు అతిథులు.

"చివరి క్షణాల్లో ప్రతిమకు వీలుకుదరలేదు. ప్రదర్శనం

ఆగకూడదని అల్లుడు పరుగెత్తుకు వచ్చాడు" సమాధానం చెబుతోన్నారు రాజావారు.

శేఖరం హుందాగా టై సర్దుకున్నాడు.

రాజావారు అల్లుడిని మురిపెంగా చూసుకున్నారు.

లైట్ మెరూన్ కలర్ మీద చిన్నగడి షేడింగ్ వున్న సూటు వేసుకున్నాడు శేఖరం. గడికి మాచింగ్‌గా కాస్త పెద్ద గళ్ళువున్న టై కట్టుకున్నాడు. మెరూన్ కలర్‌లో పాలిష్ చేసిన షూ తళతళలాడుతోంది. ఎర్రగా యాపిలు పండులాంటి బుగ్గలూ, నిండైన మొహమూ, ఆకర్షణీయమైన కళ్ళూ, హుందాతనం ప్రత్యక్షమయ్యే కదలికలూ....తన మేనల్లుడికి పెట్టని ఆభరణాలు.

మెయిన్ హాలులో ప్రదర్శనకు రాష్ట్ర గవర్నర్ ప్రారంభోత్సవం చేశారు. అతిథులు ఒక్కరూ ఒక్కరుగా హాలులో ప్రవేశిస్తోన్నారు.

శేఖరం అతిథులతోబాటు నడుస్తున్నాడు.

"సాగర్‌లో ఎప్పుడూ యింత వుడకబోయలేదు" అన్నాడు శేఖరం.

ప్రక్కనున్న అతిథులు తలలూపారు.

శేఖరం మెల్లగా టై వదులుచేసుకున్నాడు.

అతిథులు వరుసగా అమర్చిన రాజావారి తరతరాల ఆస్థిగా వస్తున్న అపురూపమైన వస్తువులు చూస్తున్నారు. హాలులోంచి బయటకు చూశాడు శేఖరం.

పేలస్ చుట్టూ పోలీసు బందోబస్తు!

రాష్ట్ర గవర్నరే రావడంతో పత్రికా ప్రతినిధులూ, అధికారులూ, రాజకీయ ప్రముఖులూ ప్రదర్శనకి వచ్చారు. ప్రదర్శనకి ముందు అందరినీ చెక్ చేశారు. ఎవరి దగ్గరా ఎలాంటి మారణాయుధాలూ, కెమేరాలూ లేకుండా జాగ్రత్త

పడ్డారు. అందరి వేలిముద్రలూ రికార్డు చేసుకున్నారు.

అతిథులు గోడలకు తగిలించిన చిత్రపటాలూ, తైల వర్ణచిత్రాలూ షోకేసులూ చూస్తున్నారు.

ప్రాచీన కళాఖండాలకున్న నగిషీ, నైపుణ్యం ప్రస్తుతం తయారవుతోన్న కళాఖండాలకు లేవు. మనిషి జీవితంలో వేగం పెరిగింది. తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆనందం! ఈనాటి నినాదం యిదే!

అతిథులు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

పదో షోకేసు ముందుకు నడుస్తున్నారు అతిథులు.

గాజుతలుపుల మధ్య 'షాహినూర్' దేదీప్యమానంగా మెరుస్తోంది. గుప్పెట్లో పట్టే వజ్రం. ఎర్రటి, నీలం, తెలుపు కిరణాలు అన్ని కోణాల్లోనూ ప్రతిఫలిస్తున్నాయి. ఉన్నది చిన్న వజ్రమే కాని దాని కాంతి వలయాలతో గుప్పెటి పరిమాణంలో కనిపిస్తోంది. దాని విలువ సుమారు అరవై లక్షలు. అంత విలువైన అతిచిన్న వజ్రం ప్రపంచ వజ్రాల చరిత్రలోనే అపురూపం!

అతిథులకు కళ్ళు చెదురుతోన్నాయి. నీలంరంగు మఖమల్ గుడ్డమీద కాంతి పుంజాల సమూహంలాగా వుంది షాహినూర్.

రాజావారు షోకేసు ముందు నిలబడ్డారు. మెల్లగా షోకేసు తలుపు ఎత్తారు.

కాంతిరేఖలు కళ్ళలోకి ఎదురు తన్నుతోన్నాయి.

"ఈ వజ్రం...." అంటున్నారు రాజావారు.

అంతే! దీపాలు ఆరిపోయాయి. హాలులో కేకలు!

"మాపయ్యా జనరేటర్!" అరిచాడు శేఖరం.

దీపాల కాంతిలో తళతళలాడిన వజ్రం మూగగా పూరుకుంది.

రాజావారు క్షణకాలం దిగ్భ్రాంతిలో పడ్డారు. కరెంటు ఫెయిలయితే ఆటోమాటిక్‌గా జనరేటర్ పనిచేయాలి. జనరేటర్ ఎందుకు పనిచేయటంలేదు?

రాజావారి మనసు కీడు శంకిస్తోంది. చటుక్కున షోకేసు తలుపు మూయబోయారు. ఆయన ప్రక్కగా ఎవరో రాసుకుంటూ వెళ్ళారు.

రాజావారు తలుపు మూశారు.

చీకట్లో ఎవరో ఈలవేశారు.

కొన్ని క్షణాల తర్వాత లైట్లు వెలిగాయి.

రాజావారూ అతిథులూ గుడ్లప్పగించి చూస్తోన్నారు.

షోకేసులో షాహినూర్ లేదు. నీలం ముఖమల్ గుడ్డ కళావిహీనంగా వుంది.

రాజావారు కోపంతో వూగిపోయారు. ఆయన మీసాలు అల్లల్లాడాయి. కళ్ళలో ఎర్రటి జీరలు లేచాయి. బయటకు చూశారు.

బయటవున్న పోలీసులలో చలనంలేదు. అటెన్షన్‌లో నిలబడి చర్యకు సిద్ధంగా వున్నట్టు చూస్తోన్నారు.

"దొంగ మెయిన్‌హాలు దాటలేదు!" అరిచారు పోలీస్ కమీషనర్.

కాని రాజావారు ఎవరినీ తనిఖీ చేయటానికి ఒప్పుకోలేదు. అందరూ గౌరవనీయులైన ఆహ్వానితులే.

ప్రదర్శన మూతబడింది.

3

సెక్రటరీ స్విచ్ ఆన్ చేశాడు. తెరమీద బొమ్మ పడుతోంది. మెయిన్ హాలులో గుమ్మందగ్గర రిబ్బన్ మెరుస్తోంది. గవర్నర్ ఆయన ప్రక్కన రాజావారు రిబ్బన్‌కి అటు వస్తున్నారు.

సెక్రటరీ ఫిలింవైపు వూపిరి బిగబట్టి చూస్తోన్నాడు. మూకీ ఫిలింలో సెక్రటరీ పళ్ళెం పట్టుకువచ్చాడు. పళ్ళెంలో కత్తెర వుంది. గవర్నర్ వైపు పళ్ళెం చాపాడు సెక్రటరీ.

గవర్నర్‌గారు కత్తెర అందుకున్నారు. రిబ్బన్ అందుకుని కట్ చేశారు. గవర్నర్‌గారూ ఆయన వెనుక రాజావారూ, సెక్రటరీ, అతిథులూ, శేఖరం క్రమంగా తెరమీద ప్రముఖంగా కనిపించడం మొదలుపెట్టారు.

అతిథులు పదో షోకేసు ముందు గుమిగూడారు.

శేఖరం రాజావారి వైపే చూస్తోన్నాడు.

రాజావారు షోకేసు తలుపు ఎత్తారు.

ఫిలిం మూగగా కదులుతోంది.

రాజావారు ఏదో మాట్లాడుతోన్నారు.

మధ్యలో చీకటి! ఫిలిం కదులుతోంది. చీకటి తెరలు! ఫిలింకు ఏమాత్రం లైటింగ్ అందినా వజ్రం ఎవరి చేతుల్లోకి వెళ్ళిందో తెలిసేదేమో!

ఫిలింకి లైటింగ్ వచ్చింది.

అందరూ తెల్లబోయి చూస్తోన్నారు. షోకేసులో షాహినూర్ మాయమయింది. శేఖరం బిగువుగా వున్న టై సర్దుకుంటూ మావయ్యప్రక్కనే నిలబడివున్నాడు.

ఫిలిం ఆగిపోయింది.

తెరమీద తెల్లటి వెలుగు పడుతోంది.

"స్పూల్ మార్చండి. మరల స్టార్ట్ చేయండి!" అన్నారు రాజావారు. సెక్రటరీ విడ్డూరంగా చూశాడు.

ఇప్పటికి ఇదే ఫిలింను తాను పదిసార్లు తెరమీద ప్రొజెక్ట్ చేశాడు. ఎన్నిసార్లు ఫిలిం చూచినా చీకటిలో వజ్రం ఎవరు తీశారో ఏం తెలుస్తుంది?

"ఆశ్చర్యం! సెక్రటరీగారూ! అతిథుల మనోభావాలను

మీరు పసిగట్టలేకపోయారు!" అన్నారు రాజావారు.

"నాకు అందరూ ఒకే రకంగా అంటే....వజ్రం దొంగతనానికి ముందు ఎలా వున్నారో తర్వాత కూడా అలాగే...."

"శేఖరాన్ని పరిశీలించండి!"

"సా....రీ...."

"సెక్రటరీగారూ! శేఖరం ప్రవర్తనలో తేడా వుంది. దొంగతనం జరిగాక మొహంలో గాభరా...."

"సార్....తమరు...."

"శాంతా క్రజ్ కస్టంస్‌కి ఫోన్ చేశాను. ప్రతిమ ఇండియా వచ్చింది. కస్టంస్‌లో మన మిత్రుడు నిర్ధారణగా చెప్పాడు."

"అయితే ప్రతిమ...."

"అన్నీ తెలుస్తాయి! ముందు శేఖరం వజ్రాన్ని ఎక్కడ దాచాడు? ఎందుకు దాచాడు? ఈ విషయాలకు జవాబులు కావాలి? స్విచ్ మార్చండి!"

తెరమీద మరల మూగచిత్రం ప్రారంభమయింది.

4

శేఖరం అద్దం ముందు నిలబడ్డాడు. టై సర్దుకున్నాడు. కోటూ పాంటూ సరిచేసుకున్నాడు. షూ టకటకలాడించాడు. క్రాపు సవరించుకున్నాడు.

'అంతా సక్రమంగా జరిగింది?' బరువుగా నిట్టూర్చాడు శేఖరం. పదోకేసు ముందుకు తాను చేరుకున్నాడు. తనను వెంటాడుతూ వచ్చిన వాళ్ళిద్దరూ తన సైగ చూసి లైట్లు ఆర్పారు. తానే జనరేటర్ పాడుచేశాడు.

తలుపుమీద చప్పుడయింది.

శేఖరం వులిక్కిపడి అద్దంలో తనని మరోసారి పరి

శీలించుకున్నాడు. పై ముడి సవరించుకున్నాడు.

తలుపు తెరిచాడు. రాజావారు!

"సిద్ధంగా వున్నావా శేఖరం" అడిగారు రాజావారు.

శేఖరం బ్రీఫ్‌కేసుతో బయటకు నడిచాడు.

"వజ్రం దొంగ దొరకలేదు!" అన్నారు రాజావారు.

శేఖరం చిత్రంగా చూశాడు. "నిజమేనండి మామయ్యా గారూ!" అన్నాడు.

"ప్చ...." రాజావారు కదిలారు. కారు పోర్టికోలో వుంది. సెక్రటరీ, రాజావారూ, శేఖరం వెనక సీట్లలో కూర్చున్నారు. రాజావారు సైగచేశారు. డ్రయివర్ కారు స్టార్ట్ చేశాడు.

కారు సాగర్ రోడ్డుమీద పరుగెత్తుతోంది.

విశాలంగా కొండలమీద పరచుకొన్న విజయపురి ప్రకృతి కనులపండుగగా వుంది. కొండలమీద ఎత్తుగా పెరిగిన చెట్లూ, కొండలను ఒరుసుకుంటోన్న నల్లటి కృష్ణ నీళ్ళూ, మరోప్రక్క జలాశయం తాలూకా బలమైన సిమెంటు గట్టూ.... కారు వీటిని దాటుతోంది.

క్షణాలలో హైదరాబాద్ పోయే రోడ్డు పట్టింది.

సాయంకాలానికి కారు వసంత మహల్ హోటల్ కం లాడ్జి ముందు ఆగింది. పార్కింగ్ ప్లేస్‌లో కారును పార్క్ చేశాడు డ్రయివర్.

డ్రైవర్‌ను కారులోనే వుంచి రాజావారు వసంతమహల్ భవనంలోకి నడిచాడు.

"వీసా పాస్‌పోర్టులు సిద్ధంగా వున్నాయా?" అడిగారు రాజావారు.

శేఖరం తలూపాడు. రాజావారు అతడి మొహంలో

కదులుతోన్న భావాలను పసిగట్టారు.

శేఖరం కళ్ళు చంచలంగా కదులుతోన్నాయి.

"శేఖరం! ఎటయినా వెళ్ళాలా?" అడిగారు రాజావారు.

"అవునండి మామయ్యాగారూ! బొత్తిగా ఒక్కరాత్రే సాగర్‌లో వుండటంమూలాన పనులు పూర్తికాలేదు" అన్నాడు శేఖరం.

"ఏమిటా పనులు?"

"మీకెందుకులెండి శ్రమ? డ్రైవర్‌కి చెబుతాను!"

రాజావారు తలూపారు.

"నేను వచ్చేవరకూ...."

"ఏదో ఒకటి తింటూంటాం! సరేనా?"

శేఖరం హుషారుగా బయటకు పరుగెత్తాడు.

"వజ్రం దొంగలకు యింకా అందలేదు!" అన్నారు రాజావారు.

సెక్రటరీ అయోమయంగా చూశాడు. "శేఖరంబాబు గారిని వజ్రం దొంగగా ఎలా నిర్ణయించాలో నాకు అర్థం గావడంలేదు సార్! ఆయన దొంగతనం రోజున పూర్తిగా మీతోనే వున్నారు. పైగా ఆయనను కొత్త వాళ్ళెవరూ కలుసుకోలేదు!" అన్నాడు.

రాజావారు అతడి మాటలను లక్ష్యపెట్టడంలేదు.

చొక్కా ప్రక్కజేబులోంచి మినీవైర్‌లెస్‌సెట్టు తీశారు. ఏరియల్ లాగారు. మీట నొక్కారు.

సెట్టుకు దగ్గరగా నోరు పెట్టారు.

"పోలీస్ కంట్రోల్!....వసంత విహారు నుండి మా కారు బయలుదేరింది...."

5

తలుపుమీద టకటక కొట్టాడు శేఖరం.

"ఎవరు?" అడిగారు లోపల నుండి.

"షా! నేనే హిహి....తీయండి నూరున్నాయా?" అడిగాడు శేఖరం.

దుండగులు తనకు యిచ్చిన కోడ్ మాట అది! ఈ గదిలో ప్రతిమ రెండు రోజులపాటు బందీగా వుంది. తన కూడా సాగర్ వచ్చిన దుండగులిద్దరూ వజ్రం దొంగతనం ముగిశాక యిక్కడికి పారిపోయి వచ్చారు.

సంకేతం చెప్పగానే తలుపు తెరుచుకుంది.

తలుపు తెరచిన వ్యక్తిని తప్పించుకుని లోపలకు నడిచాడు శేఖరం. రెండో దుండగుడు ప్రతిమకు పిస్తోలు ఆన్చి నిలబడివున్నాడు. ప్రతిమను కుర్చీలో బంధించి వుంచారు.

"నా భార్యను కట్లు విడిపించండి! వజ్రం తెచ్చాను" శేఖరం తన మెడచుట్టూ రెండుచేతులు వేశాడు.

"ఎవరూ నీ వెంట రాలేదు కదూ!" తలుపు తీసినవాడు వరండాలో నిలబడి చుట్టూ చూశాడు.

స్తంభంచాటున అలికిడయింది. అరవబోయారు. అతడి తలమీద పిడుగుదెబ్బ పడింది. మరుక్షణంలో పిస్తోలు ప్రేలింది. ప్రతిమకు పిస్తోలు గురిపెట్టినవాడు తొడలు విరిగినట్టు కూలబడ్డాడు. స్తంభం చాటునుండి పోలీసాఫీసర్ కదిలాడు.

పోలీసాఫీసర్ దుండగులను బంధించాడు.

"మీరు ఎలా రాగలిగారు?" శేఖరం కలో నిజమో అన్నట్టు చూస్తోన్నాడు. పోలీసాఫీసర్ నవ్వుతూ చూశాడు.

గదిలోకి రాజావారు, సెక్రటరీ వచ్చారు.

వాళ్ళవెనుక డ్రైవర్.

"డ్రైవర్‌ను కారులో వుంచింది ఎందుకనుకున్నావు శేఖరం? నువ్వు ఏదో వంకతో మమ్మల్ని హోటల్‌లో వుంచి బయటపడతామని తెలుసు. నువ్వు అపహరించిన వజ్రం యింకా ప్రతిమను బంధించిన వాళ్ళకి అందలేదని తెలుస్తోంది" ఆగారు రాజాగారు.

"నేను దొంగనని ఎలా తెలిసింది!" అడిగాడు శేఖరం సిగ్గుగా.

"ప్రదర్శనానికి వచ్చినపుడు అతిథులనూ వారి హావభావాలనూ, అసూయద్వేషాలనూ పరిశీలించాలనుకున్నాను. మెయిన్ హాలులో ఆటోమాటిక్ కెమేరాస్ ఏర్పాటు చేశాను. మొత్తం మూడు కెమేరాలు సమగ్రంగా దృశ్యాలను చిత్రీకరించాయి.

సెక్రటరీ వెంటనే ఫిలిం డెవలప్ చేశాడు.

వివరంగా వచ్చిన భాగాలను నేర్పుగా ఎడిట్ చేశాడు.

కరెంటు పోయింది. అప్పుడే వజ్రం పోయింది.

జనరేటర్ పని చేయలేదు. నాకు కారణం వెంటనే తోచలేదు.

అతిథులకు క్షమాపణలు చెప్పుకుని నేనూ శెక్రటరీ రహస్యంగా ఫిలిం డెవలపింగ్‌లో వుండిపోయాం. ఎడిటింగ్ అయిన ఫిలింను అప్పటికప్పుడు తెరమీద వేసుకున్నాం. ఒకసారి కాదు! ఇరవైసార్లు.

కరెంటు పోకముందు అతిథుల ముఖకవళిక లేమిటి?

కరెంటు పోయాక అంటే వజ్రం దొంగతనం అయాక వాళ్ళు ఎలా స్పందించారు? ఈల ఎవరు వేశారు? వజ్రం తీసుకున్నవాళ్ళే.

బాగా పరిశీలించడం మొదలుపెట్టాను.

దాదాపు అందరూ కరెంటు పోకముందు ఆశ్చర్యంగా చూస్తోన్నారు. ప్రాచీన కళాఖండాలను దర్శిస్తోన్న ఆసక్తి అది!

వజ్రం పోయాక మాత్రం మొహాల్లో దిగ్భ్రాంతి!

శేఖరం! నువు మాత్రమే ఎలాంటి ఆసక్తి ప్రదర్శించ లేదు.

నువ్వు ఏనాడూ ప్రతిమ లేకుండా ఇండియా రాలేదు. నా గౌరవ పత్రిష్ఠలకు ప్రతీకగా ఏర్పాటు చేసిన ప్రదర్శ నానికి నువ్వు ప్రతిమను ఎందుకు తీసుకురాలేదు? వజ్రం పోయిన వెంటనే రకరకాల ఆలోచనలతోబాటు ఈ ఆలోచనా వచ్చింది.

వెంటనే శాంతాక్రజ్‌కి ఫోన్ చేశాను. నువ్వు ప్రతిమా హైదరాబాద్ వచ్చే విమానం ఎక్కే సమపాయం విమానాశ్ర యంలో జరిగింది అంటే నా ప్రతిమను ఎవరో అపహ రించి తిరిగి ఒప్పచెప్పడం కోసం నిన్ను దొంగతనం చేయ మని పురికొలిపారన్నమాట!"

శేఖరం తన భార్యను బంధనాలు తప్పించాడు. తన టై ముడి విప్పాడు.

లైట్లు ఆరిపోకముందు నువు టై ముడి వదులు చేసు కున్నావు. లైట్లు పోయివచ్చాక టై బిగించి వుంది. చీకట్లో టై ముడి యెందుకు బిగించవలసి వచ్చింది?" అడిగారు రాజావారు.

శేఖరం నవ్వి, టై ముడిలోంచి షాహినూర్ తీశాడు. వజ్రం తళ తళ లాడుతోంది.

"టై ముడిలో వజ్రం వుంటుందని ఎవరనుకుంటారు?" నవ్వాడు సెక్రటరీ.

నాలుగు పేటల రౌడీలు

ఎమ్. సత్యవతి



సిమెంట్ రోడ్డుమీద నిలబడ్డాను.

చలిగాలి వీస్తోంది. చుట్టూ వున్న చీకటిని వీధి దీపం తరిమి పోగుపెడుతోంది. గాలి రివ్వున చెవులను తాకింది. చెవులకు జేబురుమాలు చుట్టుకున్నాను. అయినా గాలిని

రుమాలు ఆపలేకపోతోంది.

ఒక నిమిషంపాటు చలిగాలికి పళ్ళు పటపట లాడించాను.

సిమెంటు రోడ్డుమీద దీపం వెలుగుపడుతోంది. వెలుగులో మూడు నీడల చారలు! అవి నావైపు ప్రాకుతోన్నాయి.

ఉలెన్ కోటు జేబులో చెయ్యిపెట్టాను. రెండో చేత్తో ఫెల్ట్ హాట్ సర్దుకున్నాను.

ముగ్గురు నావైపు వస్తున్నారు.

కోటు జేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాను. ముగ్గురూ ఆగారు.

"కరీం!" పిలిచాను.

ముగ్గురిలో ఒకడు ముందుకు వచ్చాడు.

"ఎస్ భాయ్!" అన్నాడు కరీం.

కరీంకు పాతికేళ్ళుంటాయి. లాల్చీ, షర్వా ధరించాడు. మొహానికి మఫ్లర్ చుట్టుకున్నాడు. పెదిమలమీద ఏటవాలుగా ఆశ్చర్యార్థకంలాంటి గాటు! పొడవుగా వుంటాడు కరీం. కొత్తపేటకు రౌడీ.

కరీం తన కుడిప్రక్కన వున్న సురేంద్రని భుజం తట్టాడు.

సురేంద్రను తేరిపార చూశాను. అతడికి నలభై సంవత్సరాలుంటాయి. కసరత్తు శరీరం. అంత పొడుగూ కాదు, పొట్టీ కాదు. పంచె కట్టి లాల్చీ వేసుకున్నాడు. సురేంద్ర నాకు బాగా తెలుసు. జాన్ పేటకు అతను తిరుగు లేని రౌడీ.

కరీంకు ఎడం ప్రక్కనే వున్న శాంసన్ నాకు బాగా తెలుసు. అతడి భార్య సూకరత్నం నా క్లాస్‌మేట్. అతను ప్రస్తుతం సంతపేట రౌడీ! యవ్వనాన్ని ఎప్పటికప్పుడే

జ్వరేసుకుంటున్నట్టు అతడి శరీరం పట్టుసడలింది. ముప్పయి అయిదేళ్ళకే ముసలాడయి నట్టుంటాడు. నల్లపాంటులోకి ఎర్రటి షర్టు టక్ చేశాడు. కుడిజబ్బకు తాయెత్తు.

ముగ్గురినీ తృప్తిగా చూశాను. ముగ్గురికీ పోలీస్ రికార్డ్స్‌తో కావలపినంత దోస్తీ వుంది. అండర్ గ్రౌండ్ ప్రపంచంలో పరపతీ వుంది.

నేను ముగ్గురికీ సిగరెట్స్ ఆఫర్ చేసి ఒకటి నేను ముట్టించాను.

ఊపిరితిత్తులలో పొగ వెచ్చటి విన్యాసం చేస్తోంది.

నలుగురం నాలుగు పేటలకు రౌడీలం. సమవుజ్జీలం.

మెల్లగా చీకట్లోకి దారి తీశాను.

ముగ్గురూ నన్ను అనుసరించారు.

"రాజారావు యింటికి ఆల్సేషియన్ కుక్క కాపలా వుంటుంది. ఇంటికి గేటు యివతల వాచ్‌మాన్ వుంటాడు. మన తెలుగువాడు కాదు. నేపాలీ. రాజారావు దగ్గర డబుల్ బారెల్ గన్, రెండు పిస్తోళ్లూ...."

"భాయ్! భయపెట్టక? ఆశపెట్టే ఆస్తి వివరాలు చెప్పు" శాంసన్ విసుక్కున్నాడు.

"నలభై లక్షల రూపాయిల బంగారుపు కడ్డీలూ, మడత నలగని ఉల్లిపొరలాంటి రాజారావు కూతురు ఊర్మిళా!"

శాంసన్ నాలిక తడుపుతున్నాడు.

"ముందే చెబుతోన్నాను. ఊర్మిళ నాకోసం పుట్టింది. యీ పథకం వేసినందుకు ఆమె నాకు కొసరు అన్న మాట!"

కరీం, సురేంద్ర తలలూపారు.

శాంసన్ భుజం తట్టాను. "అట్టే ఆలోచించక! నూక రత్నంతో చెప్పానంటే అపాటి కూడా పెట్టదు!"

శాంసన్ బయట రౌడీ! నూకరత్నం ముందు బానిస! నలుగురమూ చీకట్లో పడి నడుస్తోన్నాం.

దూరంగా లంకంత బంగాళా. బంగాళా అంతటా చిన్న పాటి వెలుగు. గదులలో జీరోవాట్ బల్బ్స్ వెలుగు తోండాలి. పోర్టికోలో కాంతివంతంగా వుంది. అక్కడ పెద్ద లైటు వెలిగివుంది.

గేటుముందు నీడ తారట్లాడింది.

జేబు తడుముకున్నాను.

"కరీం! పోర్టికోలో కారు వుంటుంది. కారుకి అవతల ప్రక్క సిటింగ్‌రూం పిట్టగోడ. పిట్టగోడ చువ్వకి ఆల్సేషియన్‌ను కట్టి వుంచుతారు. నేను వాచ్‌మాన్‌ని చూసు కుంటాను. నువ్వు కుక్కపని చూడు" ఆగాను.

"అలాగే భాయ్!"

వాచ్‌మాన్ అటూ యిటూ తారట్లాడి ఆగాడు. స్టూలు మీద కూర్చోవడం అస్పష్టంగా కనిపిస్తోంది.

"నేను విజిల్ వేస్తాను! అదే క్షణంలో మన పిస్తోళ్ళు మ్రోగాలి" జేబులోంచి పిస్తోలూ, సైలెన్సరూ తీశాను.

బారెల్‌కి సైలెన్సర్ అమర్చాను.

కరీం కూడ తన లాల్చీ జేబులోంని పిస్తోలు తీశాడు.

అతడి పిస్తోలుకు కూడా సైలెన్సర్ ఫిక్స్ చేశాను.

"క్విక్! ప్రహరీ గోడవైపు వెళ్ళు!" అన్నాను. "చెయ్యి వూపు!"

కరీం పిల్లిలాగా వంగి పరుగెత్తాడు.

సురేంద్రనూ, శాంసన్‌నూ కూర్చోమన్నట్టు భుజాలు తొక్కిపట్టాను. నేలమీద కూర్చుండిపోయారు.

నేను నేలమీద ప్రాకుతున్నాను. కరీం పిట్టగోడవైపు

చూస్తోన్నాడు. ప్రహరీ మీద నుండి అతడి తల కని పిస్తోంది.

కరీం చెయ్యి వూపాడు. అంటే ఆల్సేషియన్ అతడి లక్ష్యంలోకి వచ్చిందన్నమాట.

నేను పిస్తోలు గురిపెట్టాను.

"పాపం! నేపాలీ! రానని యింట్లో చెప్పి వచ్చాడో లేదో!" నవ్వాను. కాపిటలిస్టులవద్ద వూడిగమే అనుక్షణం ప్రమాదం!

విజిల్‌వేసి ట్రిగ్గర్ లాగాను.

ప్లావ్!

ప్లావ్!

నా పిస్తోలూ, కరీం పిస్తోలు మెల్లగా గర్జించాయి. వాచ్ మాన్ వెనక్కి పడిపోయాడు. పోర్టికోలో కుక్క ఎగి రింది. దబ్బున శబ్దమయింది.

చుట్టూ చీకటి! నిశ్శబ్దం!

నేను ప్రక్కకు తిరిగి యిద్దరినీ తడిమాను. చటుక్కున పరుగెత్తాను. గేటు యెక్కి దిగాను.

గేటు కిర్రుమని చప్పుడు చేస్తోంది. సురేంద్ర, శాంసన్ గేటు దూకారు! కరీం ప్రహరీగోడ దూకాడు.

నలుగురమూ తలుపువద్ద నిలబడ్డాం.

మా వెనక ఆల్సేషియన్ పడివుంది. శవంచుట్టూ రక్తం మడుగు కడుతోంది.

తలుపు తట్టాను.

కాలింగ్‌బెల్ వున్నప్పటికీ నేపాలీ వాచ్‌మాన్ తలుపే తడతాడు. వారం రోజులుగా నేను యీ యింటిని నిఘా వేసి చాల విషయాలు తెలుసుకున్నాను.

"వాచ్‌మాన్!" లోపల పిలిచారు.

"సాబ్!" అన్నాను.

"క్యోం?"

ముగ్గురినీ ప్రక్కకు తోసి నేనూ ప్రక్కకు జరిగాను. తలుపులో 'మాజిక్ ఐ' ఏర్పాటు వుంది.

ఇప్పుడు పలికింది రాజారావు. 'మాజిక్ ఐ' లోంచి చూచి తలుపు తీస్తాడు.

"సాబ్! ఆల్సేషియన్...." అన్నాను.

చటుక్కున తలుపు తెరచుకుంది. రాజారావు తన కుక్కకు ఏం జరిగినా సహించలేడు.

తలుపు అవతల రాజారావు నిలబడి వున్నాడు. అతడి ఒంటిన నైట్ గౌను. దీపం వెలుతురులో బట్టతల మెరుస్తోంది.

చటుక్కున అతడిమీదకు దూకాను. చేతులను బ్లేడుల మాదిరి కోణం చేశాను. మెడకు రెండువైపులా బ్లేడు విసిరాను.

"కియ్‌కు...." మూలిగాడు రాజారావు. వెనక్కి తూలాడు. అతడి గొంతు పట్టుకున్నాను.

రాజారావు గింజుకోబోయాడు. శాంసన్ అతడిని సమీపించాడు. మెడమీద చెయ్యివేశాడు.

అతడు ఏం చేయబోతున్నాడో నాకు తెలుస్తోంది.

రాజారావు మెడమీది నరాన్ని నిముర్తోన్నాడు.

రాజారావు క్షణాలలో స్పృహ తప్పిపోయాడు. కరీం చక చక అతడిని సమీపించాడు. నోటికి ప్లాస్టర్ అంటించాడు. అతడి చేతులను నైలాన్ త్రాటితో కట్టి పడేశాడు.

రాజారావును మెల్లగా ఈడ్చాం. ప్రక్కగదిలో అతడిని కూలవేశాం. తలుపు దగ్గరగా లాగి లాక్ చేశాం.

వరండా చివర క్రిందకు మెట్లున్నాయి. నేను మెట్లు దిగాను. మారు తాళం చెవులగుత్తితో తలుపు తెరిచాను. స్విచ్ నొక్కాను. గదిలో ఒక పక్కగా కేబుల్‌వైర్ వెళ్తోంది.

రాజారావు తెలివైనవాడు. అండర్‌గ్రవుండ్ కేబుల్ పద్ధతిలో టెలిఫోన్ కనెక్షన్ యిచ్చుకున్నాడు.

తీగెలు కత్తిరించాను.

గదిలో ఒక మూలగా ఐరన్ సేఫ్.

సురేంద్ర సేఫ్‌పని పట్టసాగాడు. నేను గదిలోంచి బయట పడ్డాను.

"ఊర్మిళ జాగ్రత్త!" నవ్వాడు శాంసన్!

నేను నవ్వి తలూపాను. వరండాలోంచి నడిచాను. ఒక్కొక్క గది వెదకసాగాం.

తర్వాత మెట్లు యెక్కి మేడమీది గది ముందు నిల బడ్డాను.

తలుపు తట్టాను. తలుపు తెరుచుకుంది. లైటు వెలుతురులో ఊర్మిళ మెరుస్తోంది.

ఆమె చేతిలో పిస్తోలు మరింత మెరుస్తోంది.

"ఊర్మిళా! నీకు మెలకువ వచ్చిందా?" అడిగాను.

ఆమె ట్రిగ్గర్ నొక్కుతోంది.

ఆమెకు ఎలా తెలిసింది?

నా బుర్రలో తళుక్కుమన్నది. టెలిఫోన్ తీగలను కత్తిరించినపుడు ఊర్మిళ గదిలో గంట మ్రోగే ఏర్పాటు వుండాలి.

"నా పేరు కూడా తెలుసుకున్నావు. ఎవరు నువ్వు?" అడిగిందామె. ఆమె గొంతు వణకుతోంది.

"నీ అందానికి దాసుడిని!" ప్రమాద సమయంలో

సైతం ఆమె అందం నన్ను మురిపిస్తోంది.

"మా నాన్నకు అపకారం తలపెట్టారా....?" అరచిందామె.

నేను జవాబు చెప్పబోయాను. నా వెనుక చప్పుడయింది. మరుక్షణంలో గాలిలో తళుక్కున మెరిసింది. బంగారపు బిస్కట్టు ఎగిరి ఊర్మిళ చేతిని తాకింది. ఊర్మిళ చేతిలోని పిస్తోలు ఎగిరింది.

దూరంగా ఎక్కడో వాహనాలు పరుగెత్తుతోన్నాయి.

"పోలీసు వాహనాలు!" అరిచాడు కరీం. నా వుత్సాహం నీరు కారిపోయింది.

"బంగారం పాక్ చేశారా?" అడిగాను. పోలీసు వాహనాలు ఎలా వస్తున్నాయో అర్థం కావడంలేదు.

ఊర్మిళను నిర్దాక్షిణ్యంగా చేతులు విరచికట్టాడు శాంసన్.

ఆమెకు స్పృహ తప్పిపోయింది. ఆమెను బెడ్ మీదకు చేర్చాడు. బంగారంతో నలుగురమూ బయటకు పరుగెత్తాం.

నలుగురం పరుగులు తీస్తున్నాం. వెనుకగా పోలీసు వాహనాలు రెండు వస్తోన్నాయి. సిమెంట్ రోడ్డుమీదనుంచి నలుగురం నాలుగు సందులలోకి మాయమయ్యాం.

2

బద్ధకంగా పరుపుమీద యిటు తిరిగాను.

ఎవరో తలుపు కొడుతున్నారు. ఓపిక పోయేలాగా దబదడ బాదుతోన్నారు. వాచీ చూసుకున్నాను. పన్నెండున్నరయింది. మధ్యాహ్నం పన్నెండున్నరయి వుండాలి. రాత్రి పోలీసులనుండి పారిపోయి వచ్చి నిద్రకు పడ్డాను. తిరిగి ఇదే మెలకువ రావడం.

లేచివెళ్ళి తలుపువద్ద ఆగాను.

"ఎవరు?" అన్నాను ముందు జాగ్రత్తగా.

పోలీసులయితే నాకు దొడ్డిదారి వుంది.

తలుపు అవతల గాజుల చప్పుడయింది.

"నేనే బావా! నూకరత్నాన్ని!" అంది ఆడగొంతు.

నేను చటుక్కున తలుపు తెరిచాను. అవతల నూక రత్నం నిలబడి వుంది.

తలుపు తెరచుకోగానే లోపలకు వచ్చింది. తలుపు మూశాను.

ఆమె ఎగరొప్పుతోంది కళ్ళలో ఎర్రటి జీరలు.

కళ్ళు వొత్తుకుంది నూకర్నం.

ఆమెకు కుర్చీ చూపించి నేను పరుపుమీద కూర్చు న్నాను.

"శాంసన్‌ని ఎవరో చంపేశారు" అన్నది నూకరత్నం.

నేను తెల్లబోయాను. వార్త నా మెదడులో ఒకపట్టాన జీర్ణం కాలేదు. శాంసన్‌ని చంపేశారా? ఎవరు? పోలీసులా? రాత్రి తమతో అతడూ పారిపోయి వచ్చాడు. పోలీసులకు చిక్కిపోయాడా? బంగారం బరువు మోయలేక అలసి పోయాడా!

"పోలీసులేనా?" అన్నాను.

నూకరత్నం విచారంగా నవ్వింది. "పోలీసుల చిత్ర హింసలకు చనిపోయినట్టు నేనూ అనుకున్నాను. కాని శాంసన్‌ని మీలో ఒకరు చంపేశారు."

"నూకరత్నం!" నిర్ఘాంతపోయాను.

"అవును బావా! నీతోబాటు ఎవరు వచ్చారు?"

"ఎవరొస్తే ఏంలే?"

"శాంసన్ చెప్పాడులే. మీ యిద్దరితో వచ్చే వాళ్ళ

గురించి."

నేను పళ్ళు బిగించి ఆమెనే చూస్తోన్నాను.

కరీం, సురేంద్ర పేర్లు ఆమెకు తెలుసా?

"ఎవరని చెప్పాడు?" అడిగాను.

"ఈ సురదలి దగ్గరా నీ దాపరికం?" ఆడది! అస్త్రం వదిలింది.

"నీకు నిజంగా తెలియదు!" అన్నాను.

"శవాన్ని చూద్దాం వస్తావా?"

"శవంవద్ద పోలీసుల నిఘా వుంటుంది."

"కానిస్టేబులును ఒకడినే వుంచారట! కిట్టిగాడు చెప్పాడు."

"ఇలాగే వెళ్దామా?"

"వేషాలు మార్చుకోవడం మంచిది!"

నేను చకచక కాలకృత్యాలు తీర్చుకున్నాను. పండు ముసలిలాడిలాగా నెరిసిన జిత్తు తగిలించుకున్నాను. గడ్డం అంటించుకున్నాను.

నూకరత్నం చీరె మార్చింది. నేను పంజాబీ గౌను అందించాను. సిగ చుట్టింది. షర్వా అందించాను.

ఇద్దరమూ బయటకు నడిచాం.

"శాంసన్ శవం ఎక్కడుంది?" అడిగాను.

"రాజారావు బంగళా దగ్గర."

వులిక్కిపడ్డాను. శాంసన్ అక్కడికెందు కెళ్ళినట్లు?

ఇద్దరమూ శవం వున్నచోటకి నడిచాం.

శాంసన్ పచ్చగడ్డినేలమీద పడివున్నాడు. శవం వెల్లకింతలా పడి వుంది. అతడి కళ్ళు ఆశ్చర్యంగా తెరచుకుని వున్నాయి. తలకి ఎడమ కణతమీద రంధ్రం వుంది.

రంధ్రంలో నెత్తురు కారి గడ్డకట్టి వుంది. కణతకు పై భాగంలో నల్లటి మసి అంటినట్టుగా వుంది.

శవం ప్రక్కనే పిస్తోలు! అది నా పిస్తోలే! పాయింట్ త్రీ ఎయిట్ కాలిబర్!

రాత్రి కరీం చేతికి ఆ పిస్తోలును యిచ్చాను.

అయినా శాంసన్ యింటి వెనుకవైపుగా తిరిగి ఎందుకు వచ్చాడు? అతడు మోసుకు తెస్తోన్న బంగారం ఏమయింది?

అసలు పోలీసులకు తమ దోపిడిని గురించి ఎలా తెలిసింది?

శాంసన్ ఎవరో తెలియనట్టు నూకరత్నం చూస్తోంది.

నా గదికి వచ్చే ముందు ఆమె మొహంలో కనిపించిన దుఃఖం లేదు. దుఃఖం స్థానంలో నిర్లిప్తత చోటు చేసుకుంది.

హత్య చేసినవాళ్ళు శాంసన్‌ని బాగా దగ్గరనుండి హత్య చేశారు. కరీంకు అవకాశం వుంది. కాని అవసరం ఏమిటి? అయినా అతడికి రాత్రి శాంసన్‌ని హత్యచేసే వీలు ఏది?

ఒక ప్రక్క పోలీసులు ప్రవేశించి మా పథకం పాడు చేశారు. పోలీసుల తొందరలో నేనున్నాను. కరీంను గమనించి వుండను.

"తప్పుకోండి! ఇన్‌స్పెక్టర్‌గారు ..." పోలీసు గాలిలో లాఠీ త్రిప్పాడు.

దూరంగా జీపు వస్తోంది.

నేను ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టాను. నూకరత్నంను మోచేత్తో పొడిచాను. నూకరత్నం మెల్లగా కదిలింది.

శాంసన్ యింటివద్ద నూకరత్నంను దిగబెట్టి, మళ్ళీ బయలుదేరాను.

3

టాక్సీని సెంటర్‌లో ఆపించి దిగాను. బాడుగ చెల్లించాను. చకచక సందులో నడవసాగాను.

కరీం తన గదిలో యింకా నిద్రపోతున్నాడు.

అతడిని నిద్రలేపి సంగతి చెప్పాను. అతడికి నిద్రమత్తు వదిలేసింది. కరీం నన్ను హంతకుడిని చూచినట్టు చూశాడు.

"కరీం! నువు చంపి వుంటే నిజం చెప్పు!" మామూలుగా అడిగాను.

"నేనా భాయ్! శాంసన్‌ని చంపవలసిన అవసరం నాకు ఏముంది?"

"ఆ కారణం చాలు! హత్య చేయడానికి!"

"అంటే?"

"అంటే?" కరీం గొంతులో సహజమైన ఆశ్చర్యం!

"నీకు అతడిని చంపే అవసరం లేదు. కాని అతడి వద్ద బంగారం వుంది. ఎవరో చంపినట్టు చంపితే ఆ చంపిన వాళ్ళే బంగారం ఎత్తుకుపోయినట్టు నేను అనుకోవాలి."

"నాన్సెన్స్!"

"నీకరత్నం ఒంటరిదవుతుంది. ఇటు కాంతా అటు కనకం...."

కరీం నన్ను డొక్కలో పొడిచాడు. నేను మెలిక తిరిగి కింద పడ్డాను. పడుతోనే కరీంను లాగి విసిరాను. కరీం మొగ్గవేశాడు. అతడి తల గోడను తాకింది.

కరీం అరిచాడు. తల పట్టుకున్నాడు.

"భాయ్! నువు చాల దారుణంగా మాట్లాడావు!" మూలిగాడు కరీం.

నేను కరీంను సమీపించాను. జుత్తు పట్టుకుని తల పైకెత్తాను.

"ఊర్మిళ వద్దకు వెళ్ళబోతూ నా పిస్తోలును నీకు అందించాను. హత్య ఆ పిస్తోలుతోనే జరిగింది. శాంసన్‌కి బాగా ఆత్మీయంగా నటించి హత్యజేశావు."

కరీం కళ్ళు పెద్దవయాయి. "కాదు భాయ్! నన్ను నమ్ము. నిన్ను ఊర్మిళ పిస్తోలుతో కవర్ చేసేటప్పటికే నా చేతిలో పిస్తోలు లేదు. శాంసన్ నా వద్ద అడిగి పుచ్చుకున్నాడు. బయటనుండి ఎవరైనా వస్తారేమో—కవర్ చేస్తాను అన్నాడు."

కరీం జుత్తు వదిలాను. అతడు చెప్పే విషయం నిజమై వుండాలి. ఊర్మిళ చేతిలోని పిస్తోలును అతడు ఎగరగొట్టడం నాకు గుర్తుంది. బంగారు బిస్కత్తుతో ఎగరకొట్టాడు.

నేను బయటకు కదలబోయాను.

"ఎక్కడికి భాయ్?"

"సురేంద్ర దగ్గరకు."

"బంగారం పంచుకుందాం!"

"తొందర లేదు" బయటకు నడిచాను. శాంసన్ మాలో ఒకడు. అతడిని ఎవరు హత్య చేశారు? సురేంద్ర? అతడికి మాత్రం మోటివ్ ఏమిటి?

తల విదిలించాను. పోలీసులా?

పోలీసులు హత్యజేసి వుంటే పిస్తోలు అవసరం ఏమిటి?

సురేంద్ర బార్‌లో దొరికాడు.

నన్ను చూస్తూనే కొత్త విస్కీ బాటిలు రప్పించాడు.

"శాంసన్ ఆత్మశాంతి కోసం!" బాటిలు మూత

విప్పాడు. గ్లాసులలో ద్రవం ఒంపాడు.

అతడి చెయ్యి పట్టుకున్నాను.

"శాంసన్‌ని ఎందుకు చంపావ్?" అన్నాను.

సురేంద్ర నవ్వి, "ఇంకా నయం భాయ్! నాకరత్నం మరదలు పిల్లకోసం నువ్వే చంపావనుకున్నాను!"

నుదురు చిట్లించాను. సురేంద్ర ప్లేటు మారుస్తున్నాడు.

"నేనా? నేను చంపివుంటే నా పిస్తోలు అక్కడ ఎందుకు పడివుంటుంది?"

"దొంగపిస్తోలు! లైసెన్స్ వుంటే కదా! నీదని ఎలా తెలుస్తుంది?"

"నేను చంపలేదు."

"కరీం చంపాడేమో!"

"కాదు, కరీం నువ్వూ నేనూ చాలదూరం కలసి పరుగెత్తాము."

"వెరీగుడ్? హత్య చేసింది నేను కాదన్న మాట!" సురేంద్ర పకపక నవ్వాడు.

బార్ పల్చగా వుంది.

"సురేంద్ర! శాంసన్‌ని చంపిన వాళ్ళు బంగారం ఎత్తుకుపోయారు."

"అవును. కనీసం నువ్వు చంపివుంటే అతడి వాటా మనం పంచుకునే వాళ్ళం!"

"సురేంద్రా! సీరియస్‌గా వుండు!"

"మనం వెలుగులో ఊర్మిళ కళ్ళబడ్డాం. రాజారావు నిన్ను చూశాడు. మన గుర్తులు పోలీసులకు అంది వుంటాయి."

"ఈ వూళ్ళో వుంటే గదా! ఒరిస్సా పారిపోదాం! ఏదో మారుమూల గ్రామంలో తల దాచుకోవచ్చు."

"ఈ రాత్రికేనా?"

"శాంసన్‌ని ఎవరు చంపారో తెలిస్తే....!"

"ఈలోగా పోలీసులు మనను పట్టుకుంటే...."

"వాళ్ళ మొహం" లేచాను.

కుంటుతూ నడుస్తున్నాను. దూరంగా రాజారావు బంగాళా. నా వేషం పూర్తిగా మారిపోయివుంది. కుంటి బిచ్చగాడిలాగా వున్నాను.

రాజారావు బంగళా నిర్జనంగా వుంది.

రాజారావూ, ఊర్మిళా బెదిరిపోయివుంటారు. ఎక్కడికో సురక్షితమైన స్థలానికి వెళ్ళిపోయి వుంటారు.

లేకపోతే ఒంటరిగా బంగళాలో బంగారం వుంచుకోవడం ఏమిటి? రాజారావు బంగళా వెనక్కి నడిచాను.

పచ్చగడ్డిమీద ఎంతోమంది తిరిగినట్టు గడ్డి నలిగివుంది. శాంసన్ శవం కనిపించిన స్థలంవైపు నడిచాను.

గడ్డిమీద రక్తం కొద్దిగా అంటివుంది. కుక్కలు నాకి వుండాలి. చుట్టూ చూశాను. గడ్డిలో వెతుకుతున్నాను.

నా అంచనా సరైనదయితే నాకు కావలసిన వస్తువు దొరుగుతుంది. బంగళా వెనుక ప్రహరీగోడను సమీపించాను.

గంటపాటు అటూ ఇటూ తచ్చాడాను.

నా కళ్ళు మెరిశాయి. వంగి అందుకున్నాను.

పోలీసులకు సమాచారం ఎవరు యిచ్చారో నాకు అర్థమైపోయింది. శాంసన్‌కి బంగళా వెనక్కి రమ్మని సలహా యిచ్చారు. మేము బయలుదేరే ముందు పోలీసులకు వర్తమానం వెళ్ళింది. శాంసన్ బంగారంతో యింటి వెనక్కి వస్తాడు. అతడి చేతిలో పిస్తోలు వుంటుందని తెలియదు,

హత్య చేయబోయేవాళ్ళకు. కరీం తన చేతిలోని పిస్తోలును శాంసన్‌కి యిచ్చాడు. కరీం నా వద్దకు రాగానే శాంసన్ బంగళా వెనక్కి వెళ్ళాడు. అక్కడ వున్న వాళ్ళకు తన వద్దవున్న బంగారం, పిస్తోలూ యిచ్చాడు. తన సంచిలో ఏదో పనికిమాలిన బరువు పెట్టుకుని తిరిగి వచ్చాడు.

హత్య చేయబోయే ఆత్మీయులూ అతడూ కలసి వేసుకున్న పథకం ప్రకారంగా పోలీసులు వచ్చారు. మేము కంగారుపడ్డాం.

శాంసన్ మాతోబాటు పరుగెత్తుతోన్నట్టు నటించాడు. తిరిగ బంగళా వెనక్కి వెళ్ళాడు. హతమయ్యాడు.

నా చేతిలో వున్న కత్తివైపు చూశాను. పదునైన కత్తి!

నా లాంటి గుండాకి ఈ రకమైన కత్తులు ఎక్కడ దొరుకుతాయో తెలుసు.

కత్తిని దుస్తులలో దాచుకుని రోడ్డెక్కాను.

కత్తులు అమ్మే షాపులో దర్యాప్తు చేశాను. నా వూహ నిజం అయింది.

అయిదు నిమిషాలలో మరదలి ముందు నిలబడ్డాను. పెట్టె సర్దుకుంటోంది. నా కళ్ళలో ఎరుపు నూకరత్నాన్ని బెదిరించి వుండాలి.

"శాంసన్‌ని ఎందుకు చంపావ్?" అరిచాను. పెట్టె లాగాను. బంగారం!

నూకరత్నం చేతులు చాపింది. నా మెడను కావిలించుకుంది. ఆడది! అస్త్రాలు వదులుతోంది.

"నీ కోసం!" హొయలు ఒంపింది. "బావా! నువ్వు కావాలి!"

"అబద్ధం!"

"ఎలాగో...."

"పిస్తోలు నాదని నీకు తెలుసు. శవం దగ్గర నా పిస్తోలు పడవైచావు. అంటే శాంసన్‌ని నేను హత్య చేసినట్లు అనుకోవాలి. కాని పిస్తోలు నాదని ఏ రికార్డ్‌లోనూ లేదు. ఆ విషయం నీకు తెలియదు."

నూకరత్నం తెల్లబోయింది.

"క్షమించు బావా. ఎటయినా బంగారంతో పోయి బతకాలనుకున్నాను. శాంసన్ నన్ను పిప్పిలాగా పీల్చేస్తున్నాడు. భరించలేక...."

రోడ్డుమీద కుక్కల గొడవ! కంయ్ కంయ్ మని అరుస్తోన్నాయి. నూకరత్నం మాటలు ఆపింది.

తలుపు తోసుకుని కుక్కలూ, వాటి వెనక గొలుసులు పట్టుకుని పోలీసులు! కుక్కలు నా బట్టలు పీకాయి.

నా తప్పు తెలిసివచ్చింది.

క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ హత్యాస్థలంలో కత్తిని చూశాడు. కుక్కలకు వాసన చూపించాడు. ఎర అలాగే వుంచాడు. నేను కత్తిని ఎత్తుకు వచ్చి కుక్కలకు దొరికాను.

పోలీసులు మా చేతులకు బేడీలు తొడిగారు. □

సీరియల్

మృత్యుతార

గిరిజశ్రీ భగవాన్

(గత సంచిక తరువాయి)

"ప్లీజ్....నే చెప్పేమాటలు కాస్త అర్థం చేసుకోండి ప్రొఫెసర్! నర్సన్ కావాలని యీ హత్య చెయ్యలేదు. అతని ఆవేశాన్ని గుర్తించి అక్కడికి నేను ఎంత

బలంగా అతన్ని కావిడేసి పట్టుకున్నానో మీరూ చూశారుగా! ఆ గూఢచారి పదేళ్ళక్రితం మా రెండు కుటుంబాల సభ్యుల్నీ దారుణంగా హతమార్చాడు. నర్సన్‌కి యీగతి పట్టించాడు. పదేళ్ళ తర్వాత మళ్ళీ ప్రత్యక్షమై...."

ప్రొఫెసర్ డోగ్రేతో రావ్ అంటున్న మాటలు నర్సన్ చెవి కెక్కడంలేదు. అతని చూపులు గదిమధ్యన పడి వున్న గూఢచారి శవంమీద కేంద్రీకృతమై వున్నాయి.

తానేం చేశాడు? అసలేం జరిగింది? తనలో అంత ఆవేశం, ఒక మనిషిని హత్యచేసేంతటి దారుణమయిన ఆవేశం ఎలా పొంగిపొర్లింది? ఈ హత్యకి తానెంతవరకు బాధ్యుడు? తన కళ్ళముందు అనూహ్యంగా, హటాత్తుగా జరిగిందేమిటి?

"పదేళ్ళక్రితం నిన్ను చంపేద్దామనే పిస్తోలుతో కాల్చాను నర్సన్! అప్పుడు నువ్వు చావలేదన్న అక్కసుతోనే మరెన్నడూ నా జోలికి రాకుండా నీకు బుద్ధిచెప్పడానికే ఆనాడు నీవాళ్ళ నందర్నీ చంపేశాను. నువ్వీ లెనిన్‌గ్రాడ్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నా నా జోలికి రావనే యీ పదేళ్ళూ నిన్ను పట్టించుకోకుండా వదిలేశాను. పదేళ్ళ తర్వాత, నిన్న యీ రావ్ యిక్కడికి వచ్చి పాత సంగతులన్నీ పైకి తవ్వడం, నామీద పగ తీర్చుకోవాలనే కాంక్ష నీలో ప్రబలడం నిన్నటినించీ గమనిస్తూనేవున్నాను. అందుకే యిప్పుడు...."

"షటప్ బాస్టర్డ్....ఇన్నేళ్ళ తర్వాత నా కళ్ళపడ్డ నిన్ను ప్రాణాలతో వదిలిపెట్టను. రావ్....ముందు నన్నొదిలెయ్యి. యీ దుర్మార్గుడి ప్రాణం...."

"ఒద్దు నర్సన్....ఆవేశం వద్దు. నా మాట వినండి. ప్లీజ్...."

"ఒదిల్తే మాత్రం యీ జీవచ్ఛవం సన్నేం చేస్తుంది మిస్టర్ రావ్! జవసత్వాలుడిగిపోయిన యీ ముసలికుక్క నా ఒంటిమీంచి ఒక్క వెంట్రుకనైనా...."

"ఏం కూశావురా బాస్టర్డ్...." గర్జిస్తూ, రావ్‌ని ఒక్క విదిలింపు విదిల్చి ఒక్క ఎగురున ముందుకు దూకి, బూటు కాలెత్తి ప్రత్యర్థి దవడకింద మహోద్రేకంతో ఫెడేలుమని ఒకేఒక్క తాపు....అంతే!

కెవ్వున అరుస్తూ చెట్టంత మనిషీ వెనక్కి విరుచుకు పడిపోవడం, గిలగిల గిలగిల తన్నుకుంటూ ప్రాణం వదలడం....అంతా రెప్పపాటులో జరిగిపోయింది. గర్వాంధుడైన పదేళ్ళనాటి ప్రత్యర్థి ప్రాణం అరక్షణంలో ఎగిరిపోయింది. ఆ తర్వాత....

"మైగాడ్! హత్య! నర్సన్ నిలువునా ఒక మనిషిని చంపేశాడు. దారుణంగా హత్యచేశాడు. వెంటనే పోలీసు రిపోర్టు...." అరుస్తున్న ప్రొఫెసర్ నోరు నొక్కేసి, ఆ తర్వాత ప్రాధేయపడుతున్నాడు రావ్. పోలీసు రిపోర్టు యివ్వకుండా అతన్ని ఒప్పించడానికి, నచ్చజెప్పడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

"సారీ మిస్టర్ రావ్! ఒక సివిలియన్‌గా, బాధ్యతగల సైకియాట్రిస్ట్‌గా నా డ్యూటీ నేను చెయ్యాలి. నర్సన్ ఒకనాడు మహామేధావి అయివుండవచ్చు! హత్య చెయ్యబడిన మనిషి అతనికి తీవ్రమైన అపకారం చేసివుండవచ్చు. అతని జీవితాన్ని సర్వనాశనంచేసి వుండవచ్చు! కానీ, హింసకి ప్రతిహింస సమాధానం కారాదు. కాకూడదు. ఇతను హత్య చేశాడు. మెంటల్ కండిషన్ సరిగ్గాలేని పరిస్థితిలో ఒక హత్యచేసిన యీ మనిషిని యిలాగే వదిలేస్తే, ఇప్పుడు

మనం జాలితల్చి నిర్లక్ష్యం చేస్తే, ముస్ముందు యీ మనిషి మరెలాంటి దారుణకృత్యాలకి తలపడతాడో.... నో...."

"ప్లీజ్....యిక్కడకాదు. అవతలికి వెళ్ళి మాట్లాడుకుందాం. మీరిలా రండి...." అంటూ ప్రొఫెసర్ రెక్క పట్టుకుని అవతలికి లాక్కుపోయాడు రావ్. గదంతా నిశ్శబ్దం ఆవరించుకుంది. గదిమధ్యన పడివున్న గూఢచారి శవం ముందు ఒంటరిగా నిలబడిపోయాడు నర్సన్. అతని మస్తిష్కంలో లక్షసుడిగుండాలు సుడులు తిరుగుతున్నాయి.

తనలో అంత ఆవేశం ఎందుకు కలిగింది? అప్పటిదాకా ఒక్కసారి కూడా చూడని, ముక్కూ మొహం ఎరుగని గూఢచారిమీద అంత కోపం ఎందుకు వచ్చింది? వివేకాన్ని, విచక్షణాజ్ఞానాన్ని ఎందుకు కోల్పోయాడు? ఒక మనిషిని హత్య చేసేటంతటి మనోదౌర్బల్యం తనకెందుకు కలిగింది? అసలు పదేళ్ళక్రితం యీ మనిషిని పట్టుకునే కేసు తనకి ఎందుకు అప్పగించాలనుకున్నారు? ఆ నాడు యితనివల్ల భారతదేశానికి యెలాంటి ప్రమాదం సంభవించబోయింది?

తనమీద హత్యాప్రయత్నం జరిపి, తన కుటుంబాన్ని బలి తీసుకున్న యీ మనిషి ఆ తర్వాత ఆ ప్రయత్నాన్ని యెందుకు విరమించుకున్నాడు? పదేళ్ళు గడిచిన తర్వాత యీ పదేళ్ళూ తన దినచర్యలను క్షుణ్ణంగా గమనించిన తర్వాత, యిప్పుడు తనని కవ్వించడానికి ఎందుకొచ్చాడు?

అంటే, తన జీవనయాత్రలో పదిసంవత్సరాల కాలం తనకి తెలియకుండా వాష్ అయిపోయిన మాట నిజమేనా? పదేళ్ళుగా జరిగినవాటినన్నింటినీ తాను నిజంగానే మర్చిపోయాడా? తనకి ప్రొబెషనరీ బ్రెయిన్‌వాష్ సంభవించిందా?

రెండు చేతులతో తల పట్టుకున్నాడు నర్సన్. హత్య

చెయ్యబడిన గూఢచారి శవాన్ని పరిశీలించడానికని ఒక అడుగు ముందుకు వెయ్యబోయి అంతలోనే ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. లేదు! తన కా హక్కు లేదు! హంతకుడి స్థానంలో వున్న తనకి హతుడి శవాన్ని పరీక్షించే హక్కు లేదు! తను నేరం చేశాడు! క్షణికోద్రేకంలో ఓ మనిషిని చంపేశాడు! తనకి శిక్షపడాలి! తాను శిక్ష అనుభవించాలి!

అయితే, ఒకందుకు తాను సంతోషిస్తున్నాడు. తన కుటుంబాన్ని దారుణంగా హతమార్చి తన జీవితాన్ని సర్వనాశనం చేసిన శత్రువుమీద పగ తీర్చుకున్నాడు. ప్రపంచానికి భవిష్యత్తులో హాని సంభవించకుండా ఒక రాక్షసుడిని తుదముట్టించాడు! చాలు! ఇహ, తానేమైపోయినా బాధ లేదు? విచారంలేదు!

"హమ్మయ్య. ఎలాగైతేనేం, ప్రొఫెసర్ని ఒప్పించగలిగాను" అంటూ గదిలోకి వచ్చాడు రావ్. ఆలోచనల్లోంచి తేరుకుంటూ తలెత్తి అతని వైపు చూశాడు నరసన్.

"పోలీసులకి రిపోర్టు చెయ్యండి రావ్! వెంటనే వాళ్ళని యిక్కడికి రప్పించండి. అరెస్టు కావడానికీ, చేసిన నేరానికి తగిన శిక్ష అనుభవించిడానికీ నేను సిద్ధంగా వున్నాను. ప్లీజ్ రిపోర్ట్ దెమ్ యిమీడియట్లీ" అన్నాడు గంభీరంగా.

రావ్ తృళ్ళిపడి, ఆందోళనగా చూస్తూ "ఈ విషయం బయటపడకుండా చచ్చీ చెడీ నేను ప్రొఫెసర్ని సరెండర్ చేసుకుంటే....మీకు నిజంగానే మతిపోయింది. లాభం లేదు. మిమ్మల్ని యీ స్థితిలో యిలా వదిలెయ్యకూడదు.... ప్రొఫెసర్....ప్రొఫెసర్...." అని పిలిచాడు బిగ్గరగా.

"వస్తున్నాను" అంటూ బయట్నించి డోగ్రే పలికాడు. నర్సన్ అది పట్టించుకోకుండా "జరిగిన నేరాన్ని కప్పి పుచ్చడమంత ఫూలిష్ థింగ్ మరొకటిలేదు రావ్! తప్పించుకోవాలనే తపన కూడా నాకులేదు. ఈ చరమాంకదశలో యింకా జీవించి నేను సాధించేదేమీలేదు కూడా! వ్యర్థ ప్రయత్నాలు మాని మీ డ్యూటీ చెయ్యండి. లేదా, నేనే పోలీసులకి ఇన్‌ఫార్మ్ చేస్తాను" అని చెప్పాడు ఖచ్చితంగా.

అంతలో ప్రొఫెసర్ డోగ్రే లోపలికి వచ్చి, "ఏవిటంటున్నాడు? పోలీసు రిపోర్టు యివ్వమంటున్నాడా?" అని అడిగాడు. వెలవెలబోతున్న రావ్ అయోమయంగా తల వూపాడు. కళ్ళతోనే ప్రొఫెసర్ని అభ్యర్థించాడు. అతను అదోలా నవ్వి "నే చెప్పలేదా? మనం ఈ హత్యని దాచిపెడదామనుకున్నా నర్సన్ అందుకంగీకరించడు. అతడి మనస్తత్వం అంత దృఢమైంది" అన్నాడు. నర్సన్ మాట్లాడలేదు.

"ఆల్‌రైట్! ఇప్పుడు యిక యెవరు చెయ్యగలిగిందేమీలేదు. తెలిసి తాకినా, తెలియక ముట్టుకున్నా నిప్పు నిప్పే! నేరమూ అంతే! మన బాధ్యత మనం నెరవేర్చుకోవాలి."

అని ఓ క్షణం ఆగి "మిస్టర్ నర్సన్! క్షణికోద్రేకంలో మీ రీ హత్య చేశారు. అంటే మీ మెంటల్ బాలన్సు ఏ కండిషన్లో వుందో నే చెప్పనవసరంలేదు. పోలీసులు వస్తే, వాళ్ళ అడ్డదిడ్డమైన ప్రశ్నలకి యీ మానసిక బలహీన స్థితిలో మీరెలా రియాక్ట్ అవుతారో చెప్పలేను. అది మరిన్ని ప్రమాదాలకి దారి తియ్యవచ్చు! అంచేత, మీ మనస్సూ, మైండూ మీ కంట్రోల్లో వుంటానికి మీరు

స్టడీగా వుంటానికి మీకొక ఇంట్రావీనస్ ఇంజెక్షన్ యిస్తాను. దాని ప్రభావంవల్ల మీరు దృఢంగా వుండ గలుగుతారు. ఆ తర్వాత పోలీసులు వచ్చాక ఏదెలా జర గాలో అలా జరుగుతుంది. మీకేమైనా అభ్యంతరమా?" అని అడిగాడు?

అంగీకారసూచకంగా తల వూపాడు నర్సన్.

"థాంక్స్ కనీసం యిందుకైనా ఒప్పుకున్నారు" అంటూ డోగ్రే చకచక వెళ్ళి టీపాయ్‌మీదున్న తోలుబాగ్ లోంచి సిరంజి తీసి, అందులోకి మందు యెక్కించి, వెనక్కి వచ్చి "మీ కుడిచేతిని ముడవండి నర్సన్.... మోచేతి కార్నర్‌లో నరాల్ని పొంగించండి....ఆఁ.... అలాగే....యీ నరంలోకి ఇంజెక్షన్ యిస్తాను" అంటూ నీడిల్ని లోపలికి గుచ్చాడు డోగ్రే. ఒకే ఒక్క క్షణం.

ఒళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లు, అగ్ని జ్వాలలతో దహించుకుపోతున్నట్లూ భగభగ మంటలు పుట్టసాగింది. నాలిక పిడచకట్టుకుపోసాగింది. మొహం నిండా ముచ్చెమటలు పోసేస్తున్నాయి. కళ్ళు తిరిగి పోతున్నాయి. కాళ్ళు గాలిలో తేలుతున్నట్లున్నాయి. కళ్ళ ముందు చీకట్లు కమ్ముకువస్తూ ప్రాణం గాలిలో కల్సిపోతు న్నట్లు అనిపించసాగింది.

"మోసం చేశావు ప్రొఫెసర్....నమ్మించి...." అంటూ మాట పూర్తికాకుండానే గాలికి రెపరెపలాడిన గడ్డిపరకలా వూగిసలాడుతూ దభీల్న తూలి వెనక్కి విరుచుకుపడ్డాడు నర్సన్! అంతే! ఆ తర్వాతేం జరిగిందో....?

4

"హలో....కూర్చునే కునికిపాట్లు పడుతున్నారేమిటి?"

ఉలికిపాటుతో కళ్ళుతెరిచి చూస్తూ కరెంట్‌షాక్ తగిలి

నట్లు కొయ్యబారిపోయాడు నర్సన్. ఏమిటది? తను చూస్తున్నదేమిటి? తనకి జరిగిందేవిటి?

"ఏవిటలా ఆశ్చర్యంగా చూస్తున్నారు? మీ కళ్ళకి నేనేమైనా దెయ్యంలా కనిపిస్తున్నానా? ఈ రెండు నిమిషాల్లో ఏదైనా మార్పు కన్పిస్తోందా! అరె....టీ సగం తాగి మిగతాది అలాగే వుంచేశారేం? తాగండి....ఇదే ఆ ఫైలు....దీనికోసమే నేను రికార్డ్ రూంలోకి వెళ్ళాల్సి....నర్సన్ మిష్టర్ నర్సన్....ఏవిటలా చూస్తున్నారు? ఇంతలోనే ఏమైంది మీకు! ఒంట్లో బాగాలేదా?"

తన కళ్ళని తానే నమ్మలేకపోతున్నాడు నర్సన్.

ఎదురుగ్గా ఇండియన్ స్పెషల్ బ్రాంచ్ డైరెక్టర్ రావ్ ఆందోళనగా నిలబడివున్నాడు. అయితే అతని జుట్టు నెరవలేదు. మెడకింద చర్మం జారలేదు. కళ్ళకింద గుంటలు ఏర్పడలేదు. వార్ధక్యపు లక్షణాలూ, చిహ్నాలూ ఒక్కటి కూడా ఏ కోణానా అతనిలో కన్పించడంలేదు. ఎప్పటిలా యధాతథంగా మామూలు నలభై అయిదేళ్ళ మనిషిలా దృఢంగా, బలంగా చెక్కు చెదరకుండా వున్నాడు.

పైగా అతని వెనకవున్న గోడకి తగిలించిన పెద్ద డేట్ కాలెండర్లో 18 ఏప్రిల్ 1981 అన్న అంకెలూ, అక్షరాలూ స్పష్టంగా కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి! ఆ రోజు ఆదివారం అని కూడా వుంది!

మరి, తనకి వార్ధక్యం రావడం, పదేళ్ళ గతాన్ని మర్చిపోవడం, 1992 ఏప్రిల్ 26 ఆదివారం లెనిన్‌గ్రాడ్ నివాసం, ప్రొఫెసర్ డోగ్రే, శతృగూఢచారిని దారుణంగా హతమార్చడం, తనకి ప్రొఫెషనరీ బ్రెయిన్ వాష్ సంభవించడం—అదంతా ఏవిటి? తను కలగన్నాడా? నిమిషాల మీద కలగన్నాడా?

"ఏవిటి నర్సన్? ఇంతలోనే ఏం జరిగింది మీకు?" ఆందోళనతో దగ్గరికి వచ్చి భుజాలుపట్టి కుదిపాడు యస్.బి. డైరెక్టర్. నర్సన్ ఉలిక్కిపడి గట్టిగా తల విదిలించు కుంటూ "అదే....ఏం జరిగిందో నాకే అర్థం కావటంలేదు. నా మెంటల్ బాలన్స్ కండిషన్ తప్పుతోందా, అన్న అను మానం కలుగుతోంది. నేనేదో అయిపోతున్నానేమోనన్న భయం కలుగుతోంది" అన్నాడు అస్పష్టంగా.

యస్.బి.డైరెక్టర్ చిన్నగా నవ్వుతూ "నాన్సెన్స్! అహర్నిశలూ దుర్మార్గాలూ దుష్టుల గురించి ఆలోచించే వాళ్ళకి అప్పుడప్పుడూ యిలాంటి న్యూసెన్స్ కలుగుతూనే వుంటుంది. ఇహ, మీ విషయం వేరే చెప్పాలా? నిన్న రాత్రివరకూ గూఢచారుల్ని వేటాడుతూ దాదాపు పదిరోజు ల్నుంచీ నిద్రాహారాలు కూడా మర్చిపోయారు. మళ్ళీ ఇంకో కేసుకి అటెండ్ అవడానికి వెంటనే యిక్కడికి వచ్చేశారు. నిద్రమత్తులో ఏదో కలగనివుంటారు. ముందు టీ తాగండి. కాస్త రిలాక్స్ అవుతారు. కమాన్ హేవిట్" అన్నాడు.

తలదించి తన ముందున్న టీ కప్పువైపు చూశాడు నర్సన్. సగం మిగిలిన టీ యింకా పొగలు కక్కుతోంది. టీ మీదనించి దృష్టిని మళ్ళించి తన అరచేతులవైపు చూసు కున్నాడు. యథాప్రకారం దృఢంగా బలంగా వున్నాయి. వార్ధక్య లక్షణాలు వచ్చినట్లు బలహీనంగా లేవు. మరి?

"నేను లెనిన్‌గ్రాడ్ వెళ్ళానా? మనం లెనిన్‌గ్రాడ్‌లో కల్సుకున్నామా?" అంటూ నెమ్మదిగా గొణిగాడు నర్సన్. యస్.బి.డైరెక్టర్ ఆశ్చర్యంగా చూస్తూ "అప్పుడే యీ విషయాన్ని మీరెలా వూహించారు? మీరు కేసు టేకప్ చేస్తే మిమ్మల్ని లెనిన్‌గ్రాడ్ పంపించడానికి మేం ఏర్పాట్లు

చేసిన విషయం మీకు తెల్సిపోయిందా? అయితే మీరు అక్కడికి వెళ్ళడానికి సిద్ధంగా వున్నారా?'' అని అడిగాడు.

ఆ ప్రశ్నలతో హంటర్ దెబ్బ తగిలినట్లు అదిరిపడ్డాడు నర్సన్. కావాలనే అరచేతులు పిసుక్కుంటూ "దయచేసి నా ప్రశ్నకి సూటిగా జవాబు చెప్పండి. ఇంతకుముందు అంటే నిన్నగానీ, మొన్నగానీ మనం లెనిన్‌గ్రాడ్‌లో వున్నామా?'' అనడిగాడు.

యస్. బి. డైరెక్టర్ అయోమయంగా తల అడ్డంగా తిప్పుతూ "లేదు. మీరు మా కేసు టేకప్ చేస్తారనే నమ్మకంతో మీకు లెనిన్‌గ్రాడ్ ప్రయాణానికి ఈ రాత్రి ఫ్లయిట్‌కి పాస్‌పోర్ట్, వీసా రెడీ చేయించి వుంచాం. నిన్నా, మొన్నానే కాదు! దాదాపు పది రోజుల్నుంచీ మీ జాడలు మాకెవ్వరికీ తెలియలేదు. ఆఖరికి నిన్నరాత్రి ఫోన్‌చేసి పదిరోజుల్నించీ మీరు వెంటాడుతున్న శతృగూఢచారుల్ని పట్టుకుని కలకత్తా పోలీసులకి అప్పగించినట్లూ, వాళ్ళ నాయకుడు మాత్రం తప్పించుకుని లెనిన్‌గ్రాడ్ పారిపోయినట్లూ మీరే చెప్పారు. అందుకే ఆ మనిషిని వెతికి వేటాడే నిమిత్తం మిమ్మల్నే యీ వేళ లెనిన్‌గ్రాడ్‌కి పంపించాలని మేం నిశ్చయించుకున్నాం. మిమ్మల్ని ఢిల్లీకి ఆహ్వానించి మిగతా ఏర్పాట్లు చేశాం.

అరగంట క్రితం మీరు విమానం దిగి సరాసరి యిక్కడికి వచ్చారు. చాలా బడలికగా వున్నారు. మిమ్మల్ని కూర్చోపెట్టి టీ తెప్పించి యీ ఫైలు తీసుకురావడానికి నేను అవతలకి వెళ్ళాను. ఈ రెండు నిమిషాల్లోనే మీరు నిద్రలోకి జారుకున్నారు. మామూలుగానే వున్నారనుకుని నిద్ర లేపాను. సారీ! కావాలంటే రెస్టు తీసుకోండి. మీరు సుఖంగా నిద్రపోవడానికి ఏర్పాట్లు చేయిస్తాను. వివరాలు

తర్వాత మాట్లాడుకుందాం" అని చెప్పి అక్కడినించి కదల బోయాడు యస్.బి. డైరెక్టర్.

"ఆగండి...." అన్నాడు నర్సన్. యస్.బి.డి. అతని వైపు ఆశ్చర్యంగా చూస్తూ "మీ రెంతో అలసటగా వున్నా రని మీ మొహం చూస్తూనే అర్ధమవుతోంది. వెంటనే మరోకేసుకి అటెండ్ అవమని కోరడం నాదే బుద్ధి తక్కువ! ఒకటి, రెండు రోజులాలస్యమైతే ముంచుకు పోయేదేమీలేదు. మీరు ఆదుర్దాపడకండి. బాగా రెస్టు తీసుకున్న తర్వాతనే...."

"ప్లీజ్ స్టాపిట్...." మధ్యలోనే అన్నాడు నర్సన్. తల వంచుకుంటూ "నేను కలకత్తా వెళ్ళినట్లుగానీ. పది రోజుల పాటు వేటాడి గూఢచారుల ముఠాని పట్టుకున్నట్లు గానీ, అరగంట క్రితం యిక్కడికి వచ్చిన విషయంగానీ- అసలీ పదిరోజుల అన్వేషణకి వెనకా ముందూ నిమిషం క్రితం, మీరు నన్ను నిద్రలోంచి మేల్కొలిపేంతవరకూ జరిగిన సంఘటనలేవీ నాకు గుర్తు లేవు. మీరు చెప్పేదేదీ నాకు అర్థం కావడం లేదు. ఇప్పుడే వివరాలు మీనోట వింటున్నట్లు అంతా కొత్తగా వుంది. అసలు నే నిక్కడికి ఎలా వచ్చానో, ఎందుకొచ్చానో నాకే తెలియదు" అని గొణిగాడు నెమ్మదిగా.

నర్సన్ ముందున్న టేబిల్‌మీద పరచిన సన్‌గ్లాస్ మీద యస్.బి. డైరెక్టర్ ప్రతిబింబం కనిపిస్తూ ఉలిక్కిపడింది. నర్సన్ మొహంకూడా అద్దంలోలా సన్‌గ్లాస్ మీద ప్రతిబింబిస్తోంది. నిద్రలేమివల్ల మొహం పీక్కుపోయినట్లుగా వుంది తప్పితే, వార్ధక్య లక్షణాలేవీ లేవు. జుట్టుకూడా నల్లగా నిగనిగలాడుతోంది.

"వాట్....వాటార్ యూ టాకింగ్...." అరిచాడు

యస్ బి.డి. భయంతో.

"యస్. మీరు ఎలా వూహించుకున్నా నిజం చెప్పడం నా ధర్మం. నాకేం జరిగిందో నాలో యిలాంటి మార్పు ఎందుకొచ్చిందో నేనే వూహించలేక పోతున్నాను. మీరు చెబుతున్న పదిరోజులూ నాలో రాబోయే పది సంవత్సరాల మార్పునీ, అనుభూతినీ చూపించాయి. నాకేం జరిగిందో నాకే అంతుబట్టడం లేదు."

"బ్రెయిన్ వాష్...." అప్రయత్నంగా అన్నాడు యస్.బి.డి.

"ప్రొఫెషనరీ బ్రెయిన్ వాష్...." చెప్పాడు నర్సన్ తాపీగా. మరుక్షణంలోనే యస్.బి. డైరెక్టర్ మొహం పాలిపోవడాన్ని సన్‌గ్లాస్ షీట్‌మీద తిలకించిన నర్సన్ చివాల్న తల పైకెత్తుతూ "ఏం? ప్రొఫెషనరీ బ్రెయిన్‌వాష్ గురించి ఎక్కడైనా విన్నారా?" అనడిగాడు సూటిగా. యస్.బి.డి. తబ్బిబ్బవుతూ "లేదు. అయాం సారీ" అని చెప్పాడు.

"నేను విన్నాను. లెనిన్‌గ్రాడ్‌లో సైకియాట్రిస్ట్‌గా ప్రఖ్యాతి గాంచిన ప్రొఫెసర్ డోగ్రే యీ విషయం చెబుతూండగా నా చేవుల్తో స్పష్టంగా విన్నాను" చెప్పాడు నర్సన్ అతని మొహంలోకి సూటిగా చూస్తూ. మళ్ళీ యింకో క్షణం తర్వాత "అంతే కాదు. అలాంటి మానసిక దౌర్బల్య స్థితిలో నేనో హత్యకూడా చేశాను" అని చెప్పాడు తాపీగా.

"ఓహ్....నిజంగానే మీలో ఏదో మార్పు వచ్చింది. మీ మాటలు విచిత్రంగా వున్నాయి. మిమ్మల్ని ఎలా అర్థం చేసుకోవాలో కూడా నాకు తెలియడంలేదు. మీమీద ఏదో ప్రయోగం జరిగింది.ఎవరో మీమీద ఏ మత్తుమందో జల్లారు.

ఇప్పుడు మీరు కేసు టేకప్ చెయ్యడం సంగతేలా వున్నా-మీకు తక్షణమే వైద్య చికిత్స జరగాలి. వెంటనే డాక్టర్ని పిలిపిస్తాను. కాసేపు రెస్టు తీసుకోండి'' అన్నాడు యస్.బి.డి. గాబరాగా.

"ఎందుకు? నాలో మీరు చూస్తున్న మార్పేమిటి? సూటిగా చెప్పండి. ప్లీజ్."

"ఏమిటో మీకు తెలియదా? ప్రొఫెసర్ డ్రోగే మరణించి పది సంవత్సరాలైంది. మన శత్రు గూఢచారులతో చేతులు కలిపి మన డిపార్టుమెంట్ ఏజెంట్లకి బ్రెయిన్ వాష్ చెయ్యడంలో సహకరిస్తున్నాడనే కారణంవల్ల పదేళ్ళ క్రితం మేమే అతన్ని మా ఏజెంట్ల ద్వారా మర్డర్ చేయించాము. ఆ మనిషి గురించి యిప్పుడు మీరు....''

"కానీ, అతన్ని నేను యింతకుముందే చూశాను మిస్టర్ రావ్! మీరు నన్ను మేల్కొలపడానికి ముందు ప్రొఫెసర్ డ్రోగ్రే యిచ్చిన ఇంజక్షన్‌వల్లనే నాకు స్పృహ పోయింది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ, తిరిగి మెలుకువ వచ్చి కళ్ళు తెరిచేసరికి, ఇక్కడ, యీ టేబిల్ ముందు మీ సమక్షంలో కూర్చుని వున్నాను. ఇది నిజం.''

"నాన్సెన్స్....ఇంకొక్క క్షణం కూడా ఉపేక్ష చెయ్యడం మంచిది కాదు. మిమ్మల్ని వెంటనే మెడికల్ చెకప్ చేయించాలి'' అంటూ బల్లమీదున్న ఇంటర్-కం-ఫోన్ స్విచ్ నొక్కి "కాల్ డాక్టర్ మిత్రా ఇమీడియట్లీ.... అర్జెంట్'' అని అరిచాడు యస్. బి. డైరెక్టర్ బిగ్గరగా. తర్వాత నర్సన్‌వైపు తిరిగి "ఈ పది రోజుల్లో మీరు కలకత్తాలో చేసిన పరిశోధనలుగానీ, ఇవాళ పొద్దుట యిక్కడికి రావడంగానీ, యీ విశేషాలేవీ గుర్తుకు రావడంలేదా?''

అని అడిగాడు విస్మయంగా.

నర్సన్ తల అడ్డంగా తిప్పి "ఆ వివరాలే కాదు. అసలీ మధ్య జరిగిన విశేషాలేవీ నాకు జ్ఞాపకం రావడంలేదు. మీరు చెబుతుంటే వినడమే తప్ప కలకత్తా వెళ్ళినట్లు కూడా నాకు తెలియదు. అక్కడ నేనేం చేశానో అస్సలు జ్ఞాపకం రావడంలేదు. ఆ విశేషాలన్నీ ఎలా వున్నా యీ పూట అరగంట క్రితం నేను మీ ఆఫీసుకి, అంటే యిక్కడికి వచ్చిన వైనం కూడా ఎలా జరిగిందో నాకు తెలియడం లేదు" అన్నాడు.

"చాలు! ఇహ, మీరేం మాట్లాడవద్దు. కాసేపు కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకోండి. కాసేపట్లో డాక్టర్ మిత్రా వస్తాడు. వేడి వేడిగా టీ తెప్పిస్తాను. తాగితే కాస్త రిలాక్స్ అవుతారు" అంటూ కాలింగ్ బజర్ నొక్కి, "ప్రైమినిష్టర్‌కీ, హోం మినిష్టర్‌కీ వెంటనే యీ విషయం తెలియపరుస్తాను. అంతేకాదు. ట్రంకాల్ చేసి మీ కుటుంబాన్ని వెంటనే యిక్కడికి రప్పిస్తాను. యీ స్థితిలో మీరు కొత్త ఎసైన్‌మెంట్ గూర్చి ఆలోచించడం మంచిది కాదు. యూ హేవ్ టు టేక్ బెడ్ రెస్ట్" అని చెబుతూ. దర్వాను లోపలికి రాగానే "వేడి వేడిగా టీ పట్టుకురా! డాక్టర్ మిత్రాని తప్ప నా పర్మిషన్ లేకుండా ఎవ్వర్నీ లోపలికి రానివ్వకు! నర్సన్ లోపల వున్న సంగతి ఎవ్వరికీ తెలియనియ్యవద్దు" అంటూ ఆదేశించాడు. దర్వాను తల వూపి బయటకు వెళ్ళి తలుపు మూశాడు.

"పదేళ్ళ తర్వాత మీరెంత ముసలివారై పోతారో మీకు తెలియదుగానీ ఆ వార్ధక్యంలో మీరెలా వుంటారో నేను కళ్ళారా చూశాను రావ్."

"సంధి ప్రాలాపన అంటే యిదేనేమో: మీరు కాసేపు మాట్లాడకుండా వూరుకుంటారా?" విసుగ్గా అరిచాడు యస్. బి. డైరెక్టర్.

"అయితే నిజం ఏమిటో యిప్పుడైనా చెప్పండి" అడిగాడు నర్సన్ గంభీరంగా.

"నిజమా? అంటే నేనేదైనా దాస్తున్నానా" రెట్టించాడు యస్. బి. డి.

"యస్. కారణం ఏమిటో చెప్పలేను గానీ, మీరేదో నాటకం ఆడుతున్నారు మిస్టర్ రావ్! ఎందుకో నాతో చెలగాట మాడుతున్నారు" అంటూ చివాల్న కుర్చీలోంచి లేచి "కొన్ని రోజుల క్రితం ఒక కేసు గురించి చర్చించడానికి మీరు నన్నొక ఇరానీ రెస్టారెంట్‌కి తీసుకువెళ్ళారు. అక్కడ టీ తాగుతుండగా నాకు హఠాత్తుగా మైకం కమ్మింది. ఆ తర్వాత మీరొక పెద్ద డ్రామా ఆడారు. నన్ను 1992 లోకి తీసుకెళ్ళారు. వృద్ధుడిగా, మతిభ్రష్టుడిగా చూపించారు. డోగ్రేని రప్పించారు. నాచేత ఒక హత్య చేయించి, ఆ పైన మళ్ళీ స్పృహ తప్పించి, మామూలు రూపంలో యిక్కడికి చేర్చి అదేమీ తెలియనట్లు యింకో డ్రామా ఆడుతున్నారు. ఎందుకు? అసలిలా చెయ్యడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి?" అడిగాడు సీరియస్‌గా.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్" బిగ్గరగా అరిచాడు యస్. బి. డైరెక్టర్.

"అయాం యిన్‌ఫుల్ సెన్స్...." అంతకంటే బిగ్గరగా అరిచి చెప్పాడు నర్సన్. క్షణం ఆగి తమాయించుకుంటూ "ఒక మామూలు మనిషితో చదరంగం ఆడటంలేదని మర్చిపోవద్దు, మిస్టర్ రావ్! అపరాధపరిశోధకుడిగా, ఒక మెడికోగా, లీగల్ అడ్వయిజర్‌గా, ప్రతి గూఢచారిగా నా కెంతో

అనుభవం వుంది! ఆ సంగతి మీరు మర్చిపోయారు. నన్ను ట్రాప్ చెయ్యాలనీ, నా మస్తిష్కాన్ని, మేధస్సునీ కలవర పర్చాలనీ సైకలాజికల్‌గా ప్రయోగాలు చేస్తున్నారు. రాబోయే 1992 వ సంవత్సరాన్ని కొద్దికాలం పాటు నా అనుభవంలోకి తీసుకొచ్చి, అంతలోనే ఆ షాక్ ట్రీట్ మెంట్‌నించి ఒక్కసారిగా మళ్ళీ యీ వర్తమానంలోకి, యీ 1981 లోకి తీసుకురావడంలో మీ ఆంతర్యం ఏమిటి? చెప్పండి" అని అడిగాడు సూటిగా.

యస్. బి. డైరెక్టర్ ఏదో జవాబివ్వబోతుండగా నెమ్మదిగా తలుపు తెరుచుకుంది. దర్వాను లోపలికిప్రవేశించాడు. ట్రేలోని టీ కప్పులని బల్లమీద వుంచి "సర్! ప్రొఫెసర్ డోగ్రే ఫోన్లో మీ కోసం వెయిట్ చేస్తున్నారు. ఇక్కడికి కనెక్షన్ ఇవ్వమంటారా? మీరే పి. బి. యక్స్‌కి వచ్చి మాట్లాడుతారా?" అనడిగాడు.

"స్టుపిడ్....గెటవుట్...." గొంతు చించుకొని అరిచాడు యస్. బి. డైరెక్టర్. అప్పటికే అతని మొహం కత్తివాటుకి నెత్తురు చుక్క లేనంతగా నల్లగా మాడిపోయింది. దర్వాను బెదురుతో గుమ్మంవైపు గెంతి తలుపుతెరుచుకుని బయటపడుతుండగా పక పక నవ్వాడు నర్సన్.

"అనుకోకుండానే మీ మోసం బైటపడిపోయింది మిస్టర్ రావ్! ప్రొఫెసర్ డోగ్రేని పదేళ్ళ క్రితం మీ ఏజెంట్లతో హత్య చేయించినట్లు ఇంతకుముందు చెప్పారు. అతనే యిప్పుడు మీ కోసం ఫోన్లో వెయిట్ చేస్తున్నాడట! యీజిట్ పాసిబుల్! బహుశా అతను స్వర్గంనించి మీకు ట్రంకాల్ చేశాడంటారా?"

"చెబుతాను. ముందు టీ తీసుకోండి" అంటూ కప్పు

అందుకున్నాడు యస్. బి. డైరెక్టర్. రెండో కప్పు నర్సన్ అందుకుని ఓ గుటకవేసి "చెప్పండి. ఇప్పుడు సరి కొత్తగా యింకే నాటకం ఆడబోతున్నారు?" అన్నాడు పరిహాసంగా.

"నాటకం కాదు నర్సన్! మీకు బ్రెయిన్‌వాష్ జరగడంతోపాటు తీవ్రమైన మతిమరుపు జాడ్యం కూడా అంటుకున్నదని యిప్పుడు నాకు అర్థమవుతున్నది. దాంతోపాటు వినికిడి శక్తి కూడా లోపించి వుండాలి. అంటే మీకు చెవుడు కూడా వచ్చివుండాలి. నా గదిలో, నా బల్ల సొరుగులో ట్రాన్స్‌మీటర్ కమ్ టేప్‌రికార్డర్ రహస్యంగా యేర్పాటు వున్నదనీ, యెవరితోనైనా సరే, నేను జరిపే ప్రతి సంభాషణా ఆటోమాటిక్‌గా రికార్డు చెయ్యబడుతుందనీ మీకు జ్ఞాపకం వున్నదా?" అడిగాడు యస్. బి. డైరెక్టర్ టీ చప్పరిస్తూ.

"ఆఁ....అయితే?" రెట్టించాడు నర్సన్ మరోసారి టీ చప్పరిస్తూ.

"ఇప్పుడా టేప్ రికార్డర్ని ఆన్ చేస్తాను...." అంటూ యస్. బి. డైరెక్టర్ బల్ల దగ్గరికి వెళ్ళి డ్రాయరు లాగి ఓ స్విచ్చి నొక్కి "మన మధ్య జరిగిన సంభాషణ యావత్తూ యిప్పుడు వినిపిస్తుంది? జాగ్రత్తగా వినండి. ప్రొఫెసర్ డోగ్రే పేరు నా మాటల్లో పొరపాటున కూడా దొర్లలేదనీ, అతన్ని మా ఏజెంట్లతో హత్య చేయించినట్లు నేను మీతో చెప్పడం మీ భ్రమ అనీ...."

"దిస్ సీజ్ టూ మచ్...." అరిచాడు నర్సన్. ఆగ్రహంతో నిలువునా కంపించిపోతూ "నిమిషం క్రితం మీరు అన్నమాట యింతలో నా భ్రమగా మారడం అసంభవం! అసాధ్యం!" అన్నాడు గట్టిగా.

అంతలో టేప్ రికార్డర్ స్పీకర్లోంచి—"వెంటనే డాక్టర్ని పిలిపిస్తాను. కాసేపు రెస్టు తీసుకోండి" అన్న యస్. బి. డైరెక్టర్ కంఠస్వరం, ఆ వెనువెంటనే—"కానీ, అతన్ని నేను యింతకు ముందే చూశాను మిస్టర్ రావ్! మీరు నన్ను మేల్కొలపడానికి ముందు ప్రొఫెసర్ డోగ్రే యిచ్చిన ఇంజెక్షన్‌వల్లనే నాకు స్పృహ పోయింది...." అన్న నర్సన్ స్వరం వినిపించగానే స్విచ్ ఆఫ్ చేశాడు యస్. బి. డి.

"విన్నారా, నర్సన్! అమాయకుడైన ప్రొఫెసర్ డోగ్రేని మీరే అనవసరంగా అనుమానించారు. ఆ గూఢ చారుల ముఠాకీ అతనికీ సంబంధం వుందని మూడురోజుల క్రితం మీరు ఫోన్లో నాతో చెప్పడంవల్లనే అతన్ని ప్రత్యేకంగా లెనిన్‌గ్రాడ్‌నించి పిలిపించాను. అతను యీ పూటే, పొద్దుట ఏడున్నర గంటలకి ఇండియాలో దిగాడు. ఎర్‌పోర్ట్‌కి వెళ్ళి అతన్ని స్వయంగా రిసీవ్ చేసుకున్న నేనే దానికి ప్రత్యేక సాక్షిని!

కానీ మీరు, మీ పరిస్థితి ఏమిటో తెలియని స్థితిలో ఒకసారి చెప్పిన మాట మరుక్షణంలోనే మర్చిపోయి యిష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. దీన్నిబట్టి యిప్పటి మీ పరిస్థితేమిటో నాకు క్షుణ్ణంగా బోధపడింది. మీకు బ్రెయిన్‌వాష్ చెయ్యబడింది. ఆ షాక్‌వల్ల మతిమరుపు కూడా సంభవించింది. మీ మైండ్ కంట్రోలు తప్పి అన్ బాలెన్స్‌డ్‌గా వుంది...."

"నో, నో, నో....ఇటీజ్ టూ మచ్...." గొంతు చించుకొని బిగ్గరగా అరిచాడు నర్సన్. అనూహ్యమైన శిరోభారంతో, అసాధారణమైన భావోద్వేగంతో తీగను కదిల్చిన ఆకులా వూగిపోతూ దభీలున కుప్పలా కూలిపోయాడు. ఆ

మరుక్షణమే అనిర్వచనీయమయిన మైకం అతన్ని కమ్మే సింది.

"దాహం....దాహం...." హీనస్వరంతో గొంతుక లోంచి వినవస్తున్న గొణుగుడు తన చెవులకి తనకే అస్పష్టంగా వినిపిస్తోంది. అయితే అసాధారణమైన మైకంలో చాలాసేపు మగతగా పడివుండటం వల్లనో యేమో కను రెప్పలు తెరిపిడిపడటంలేదు. చల్లటి ఐస్‌వాటర్ బొట్టు బొట్టుగా పెదాలమీదకి చింది మెల్లిగా, ధారగా నాలికపై నించి గొంతుకలోకి జారుతోంది. చల్లటి నీరు పిడచకట్టుకు పోయిన నాలికమీద పడేసరికి ప్రాణం లేచివచ్చినట్లు హాయిగా అనిపించింది. కొద్ది కొద్దిగా గుటకలు మింగు తున్నాడు.

"స్పృహ వస్తున్నట్లుంది. తెలివిలోకి వస్తున్నాడు."

"ఆఁ....వస్తే మాత్రం యేం లాభం? పది నిమిషాలో, పావుగంటో కళ్ళు తెరిచి వెర్రిచూపులు చూస్తాడు. పిచ్చి వాడిలా వెర్రికేకలు పెడతాడు. కనిపించిన వాళ్ళనందర్నీ కొట్టి చంపేస్తానంటూ రంకెలు పెడతాడు. ఆంబోతులా అందర్నీ కుమ్మి పారేస్తూ తప్పించుకు పారిపోవడాకి ప్రయత్నిస్తాడు. ఆ గోల భరించలేక ఇంజెక్షన్ యిస్తాం. మళ్ళీ స్పృహకోల్పోతాడు. ఇదీ వరస. రెండేళ్ళనించీ యిదే విధంగా మమ్మల్ని కాల్చుకుతింటున్నాడు. ఈ ముసలాడికి సేవ చెయ్యలేక చచ్చిపోతున్నాం."

"ప్లీజ్....అలా అనకూడదు సిస్టర్! ఒకానొకనాడు ఇతని మేధాసంపత్తివల్ల అనేక ప్రమాదాల్నించి ప్రపంచం రక్షించబడింది. ఇతనిపట్ల కాస్తంత జాలి, కరుణ చూపిం

చండి. వృత్తిరీత్యా చూసినా అది మీ ధర్మం. సేవాభావానికి మారు రూపు మీ నర్సు వృత్తి.”

“కనుకనే, ఓపిగ్గా యితని ఆగడాలను రెండేళ్ళనించీ భరిస్తున్నాను. ఇహ నావల్ల కాదు. ఇంకో పేషెంటు దగ్గరకి నా డ్యూటీ మార్చమని మెడికల్ డైరెక్టర్‌కి చెబుదామనుకుంటున్నాను. అదిగో.... తెలివి వస్తోంది. కళ్ళు తెరుస్తున్నాడు. ఈసారైనా ఇతడు మీ ప్రశ్నలకి జవాబులు చెబితే మీకూ యీ న్యూసెన్స్ తప్పిపోతుంది. ప్రయత్నించండి.”

మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడే కళ్లు తెరుస్తున్న నర్సన్‌కి ఆ సంభాషణల్లోని అంతరార్థం బోధపడలేదు. మస్తిష్కంలో కోటి ప్రశ్నలు సుడులు తిరుగుతుండగా బొటన వేళ్ళతో కనురెప్పలూ, కణతలూ రుద్దుకోడానికి చేతులెత్తాడు. ఖంగు ఖంగుమని గొలుసులు కదిలిన చప్పుడు వినిపించింది. చేతులు మాత్రం కదల్లేదు. ఎందుకని? ఎందుకని?

బరువెక్కిన కనురెప్పల్ని బలవంతాన తెరిచాడు నర్సన్. పై కప్పున వెలుగుతున్న లైట్ కాంతి సూర్యకిరణాల కంటె వాడిగా కనుగుడ్లల్లోకి దూసుకుపోయింది. చురుక్కుమంటూ కళ్ళు మంటలు పుట్టాయి. కళ్ళల్లో కారం జల్లినట్లనిపించింది. ఆ బాధ భరించలేక కళ్ళు మూసుకున్నాడు. కనుపాపల మధ్య కన్నీళ్ళు సుడులు తిరిగాయి. గొంతులోకి ఐస్‌వాటర్ డ్రాప్స్ జారుతున్నాయి.

“ఇహ, చాలుగానీ, కళ్ళు తెరిచి చూడవయ్యా మహానుభావా! రెండేళ్ళనించీ మా ప్రాణాలు కొరికేస్తున్నావు” యీసడింపుగా నర్సు కంఠం వినిపించింది.

“ప్లీజ్! అలా పీదరించుకోవద్దు సిస్టర్” మరో పురుష

కంఠం కొ_త్తంత కరకుగా అభ్యర్థిస్తోంది. భగభగ మండు తున్న కళ్ళను బలవంతాన తెరిచాడు నర్సన్. మొదట, చిమ్మ చీకటి, క్షణం తర్వాత దీపపు వెలుగు ఆ తర్వాత అస్పష్టంగా ఆకారాలూ కన్పించాయి. ఇంకో క్షణంతర్వాత తెల్లటి దుస్తుల్లో వున్న అందమైన నర్సు, ఆకుపచ్చటి యూనిఫాం ధరించిన పోలీసు అధికారి పక్క_ పక్క_నే నిలబడి వుండటం స్పష్టంగా గోచరించింది.

"నే నెక్క_డున్నాను?" జ్ఞాపకం చేసుకోడానికి ప్రయత్నిస్తూ ప్రశ్నించాడు నర్సన్.

"ఎక్క_డా? యీ ప్రశ్నలు యిప్పటికి సవాలక్షసార్లు అడిగావు. జవాబు చెప్పి, చెప్పి నా ప్రాణం చచ్చిపోయింది తండ్రీ....నువ్విప్పుడు స్వర్గంలో వున్నావు. రెండేళ్ళనించీ యీ స్వర్గంలో నీకు శుశ్రూషచేస్తున్న అప్సరసని నేనే!" అంటూ తన జోక్ కి తనే నవ్వింది సిస్టర్. ఆ మాటల్లో వ్యంగ్య భాష్యాన్ని వూహించడానికి నర్సన్ భృకుటి సాలోచనగా ముడిపడింది.

"అలా హేళన చెయ్యకూడదని చెప్పానా? ఇలా అయితే నీ ప్రవర్తన గురించి మీ బాస్ కి రిపోర్టు చేస్తాను. కీప్ క్వయిట్" చిరుకోపంతో మందలించాడు ప్రక్క_నున్న పోలీసు అధికారి నర్సన్ వైపు సూటిగా చూస్తూ "నథింగ్ టు వర్రీ మిస్టర్ నర్సన్! ఈ సిస్టర్ మాటలు పట్టించుకోకండి. మీ రిప్పుడు సెంట్ మేరీస్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఐథింక్ నౌ యు ఆర్ ఆల్ రైట్! బై దిబై మై నేమీస్ బాండ్! లెనిన్ గ్రాడ్ సిటీ పోలీస్ డిపార్ట్ మెంట్ చీఫ్ క్రైం డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ని! ఇప్పుడు మీ కెలా వుంది? పాత విషయాలేవైనా గుర్తు

కొస్తున్నాయా? నా ప్రశ్నలకి జవాబులు చెప్పగలరా?'' అని అడిగాడు ఇన్‌స్పెక్టర్ బాండ్ అనునయంగా.

నర్సన్ తల అడ్డంగా తిప్పుతూ పక్కమీదనించి లేవ బోయాడు. రెండు మణికట్లకీ యినుప కడియాలూ, వాటి మధ్యన గొలుసూ కనిపించాయి. అప్పుడు గ్రహించాడు, కాళ్ళకీ, చేతులకీ గొలుసులు వేసి తనని మంచానికి కట్టేశా రని! ఆ చర్యకి విస్తుబోతూ "వాటీజ్ దిస్?'' అడిగాడు.

"ఇప్పుడేం! రెండేళ్ళనించీ మిమ్మల్ని అలా గొలు సుల్తో మంచానికి కట్టి పడేసే వుంచాం. తెలివి వచ్చినప్పు డల్లా మీ రా ప్రశ్న అడుగుతూనే వున్నారు'' విసురుగా జవాబుచెబుతున్న నర్సు పోలీస్ ఆఫీసర్ బాండ్ గుడ్లురిమి చూడటంతో ఠక్కున నోరు మూసింది.

నర్సన్ ఆ జవాబు పట్టించుకోకుండా "యీ గొలుసు లతో నన్నెందుకు కట్టేశారు? అసలిది ఎన్నోనెల, ఎన్నో తేదీ?'' అని అడిగాడు చిరాకుగా. బాండ్ అతని మొహం లోకి సూటిగా చూస్తూ "నిజం చెప్పనా! షాక్ అవకండి! దాదాపు రెండేళ్ళనుంచి యీ గొలుసుల్తో మీ రీ మంచానికి అంటిపెట్టుకునే పడున్నారు. అప్పుడప్పుడూ మీకు తెలివి వచ్చినట్లనిపించినా యీ రెండేళ్ళనించీ దాదాపు కోమాలోనే వున్నారు. ఇప్పుడు 1994వ సంవత్సరం జూన్‌నెల నడు స్తోంది. ఈరోజు తేదీ పదహారు'' అని చెబుతూ అతని మొహంలో రియాక్షన్స్‌ని జాగ్రత్తగా పరిశీలించసాగాడు బాండ్.

"ఓహో....'' చాలా సర్వ సాధారణంగా తల పంకిం చాడు నర్సన్. తన మనస్సుల్లో మస్తిష్కంలో విజృంభి స్తున్న శతకోటి భావోద్వేగాలను బలవంతంగా అణచి

పెడుతూ.

"అయితే, ఇప్పుడు మీకేం ఆశ్చర్యం అనిపించడం లేదా?" రెట్టించాడు బాండ్.

"ఆశ్చర్యం ఎందుకు?" ఎదురుప్రశ్న వేశాడు నర్సన్. నర్సు మొహం పాలిపోయింది. బాండ్ తబ్బిబ్బులవుతూ "మీరింత ప్రశాంతంగా, తాపీగా జవాబులివ్వడం, ఏవిధం గానూ రియాక్ట్ కాకపోవడం యిదే మొదటిసారి! ఈసారి మీ ప్రవర్తన చూస్తూంటే ఆ షాక్ ఏదో నాకే తగిలినట్లుగా ఫీలవుతున్నాను" అనేశాడు దాచుకోలేక.

"ఓహ్....అదా...." అంటూ నర్సన్ నవ్వి, "ఇలా, యింత ప్రశాంతంగా యీ సన్నివేశం సంభవించడానికి కారకురాలయిన యీ నర్సుకి మనం థాంక్సు చెప్పుకోవాలి. నాకు తెలివి వస్తూండగా మీమధ్య జరిగిన సంభాషణా, నాతో యీ సిస్టర్ పడిన సాధక బాధకాలూ స్పష్టంగా వినిపించాయి. అందువల్లే యీ పరిస్థితిని ప్రశాంతంగా ఎదుర్కొ-గల మనోనిబ్బరం నాకు కలిగింది. అందుకే షాక్ అవలేదు యీసారి!" అని మోచేతులతో పడకని నొక్కి-పట్టి ఏటవాలుగా లేచి కూర్చున్నాడు.

"ఇప్పుడు నేను రిలీఫ్‌గా ఫీలవుతున్నాను. నా మనస్సూ మస్తిష్కం చాలా ప్రశాంతంగా వున్నాయి. నాలో ఏ విధ మయిన వికారంలేదు. నాపేరు నర్సన్ అని నాకు తెల్సు! కొన్నికొన్ని గతస్మృతులుకూడా యిప్పుడిప్పుడే జ్ఞాపకాని కొస్తున్నాయి. మీరు కొన్ని విషయాలు గుర్తుచేస్తే నేను మిగతా విశేషాలు గుర్తుకు తెచ్చుకోగల ననుకుంటాను" అనిచెప్పి ఓక్షణం ఆగి "యీ సామాన్య స్థితిలోకూడా యింకా నా చేతులకి యీ సంకెళ్ళు వుండాలా? చేతులు

నెప్పి పుడుతున్నాయి. ప్లీజ్! వీటిని తీసెయ్యకూడదూ?" అనడిగాడు జాలిగా నర్సన్.

"నో, నో! ఆ సంకెళ్ళు తీసెయ్యడం చాలా ప్రమాదం మిస్టర్ బాండ్! వాయుగుండం ఏర్పడేముందు ప్రశాంతంగా వుండే సముద్రంలాంటి పరిస్థితి అతనిది! డాక్టర్ అనుమతి లేకుండా మనం తొందర పడకూడదు" అని చెప్పింది నర్సు గాబరాగా.

"డోంటాక్ నాన్సెన్స్ సిస్టర్! ఇలాంటి అనవసరమైన భయాందోళనలతోనే ఎప్పుడో కుదుట పడాల్సిన నర్సన్ ఆరోగ్యాన్ని యింతదూరం యీడ్చుకొచ్చారు. ఐనో వాట్ అయాం డూయింగ్" అన్నాడు బాండ్ మందలింపుగా.

"అది నర్సు తప్పుకాదు మిస్టర్ బాండ్! ఇప్పుడైతే నేను అసలు విషయం తెల్సుకోగలిగాను గానీ, రెండేళ్ళ నించి నేను పెట్టిన అవస్థవల్ల ఆమె అలా భయపడటంలో తప్పేమీ లేదు! మీ కున్నంత ధైర్యం, వివేకం వొక మామూలు నర్సుకి వుండదు" అన్నాడు నర్సన్ నెమ్మదిగా.

"యూ ఆర్ రైట్ నర్సన్! మీలో ఇలాంటి మార్పు కోసమే నేను ఎదురు చూస్తున్నాను. ఇక భయంలేదు" అంటూ బాండ్ జేబులోంచి కీ తీసి నర్సన్ హాండ్‌కప్స్‌కి వున్న తాళాన్ని గబగబ తీసేసి గొలుసులు పక్కన పడేశాడు.

"థాంక్స్ మిస్టర్ బాండ్! నౌ అయాం ఫ్రీం" అంటూ నర్సన్ ఓసారి ఒళ్ళు విరుచుకుని తన చేతుల మణికట్లవైపొకసారి చూసుకుని "రెండేళ్ళపాటు సంకెళ్ళు తగిలించబడి వుండటంవల్ల నా చేతులు బాగా చిక్కిపోయాయి బాండ్! ఈ సంకెళ్ళను భరించీ, భరించీ ఎంతగానో నీర

పించి పోయాయి'' అన్నాడు తాపీగా.

"అంటే....?" అనుమానంగా ప్రశ్నించాడు బాండ్. అదే సమయంలో నర్సన్ చివాల్న వంగి రెండు చేతులతో చటుక్కున అతని మెడ దొరకబుచ్చుకుని "యిడియట్! నువ్వు నిజమయిన పోలీసు ఆఫీసరయితే యీచిన్న విషయాన్ని ఎప్పుడో గ్రహించి వుండేవాడివిరా బాస్టర్డ్! రెండేళ్ళుగా నా చేతులకి సంకెళ్ళువుంటే మణికట్లచుట్టూ చారలు ఏర్పడి వుండేవి! రెండేళ్ళుగా నేను కోమాలో వుండివుంటే యిప్పుడు మెలుకువ వచ్చి జ్ఞాపక శక్తిని పొందగలిగినా ముందుగా మెడికల్ చెకప్‌కోసం డాక్టర్ని పిలిపించి వుండేవాడివి! అంతేకాదు! హాస్పిటల్లో సంకెళ్ళతో పడివున్న నన్ను యింత సులభంగా బంధవిముక్తుణ్ణి గావించడానికి యీ హాండ్‌కప్స్ కీ నీ జేబులోకాక యీ నర్సు దగ్గరో ట్రీట్‌మెంట్ చేస్తున్న డాక్టర్ దగ్గరో వుండేది. అంటే...."

అంటూ అతని గొంతు బలంగా నొక్కుతూ "మీరు చెప్పిన విషయం యావత్తూ హంబక్ అన్నమాట! ఇది 1994 సంవత్సరం కాదు. ఈ సంకెళ్ళు రెండేళ్ళుగానూ లేవు. చెప్పు. ఏమిటీ నాటకం? ఎందుకిలాంటి కుట్రపన్నుతున్నారు? వాటీజ్ ది ఫ్యాక్ట్!" గర్జించాడు నర్సన్ ఆగ్రహంతో.

మరుక్షణం——

"ఎక్సలెంట్ నర్సన్ .... రియల్లీ యూ ఆర్ ఏ జీనియస్" అన్న మాటలు ఆ గదిలో ప్రతిధ్వనించాయి.

(ఇంకా వుంది)

అమృతవర్షిణి

బొమ్మిడి అచ్చారావు

పార్కులో జనం పలచబడ్డారు. ఒకరొకరు లేచి వెళ్ళి పోతున్నారు.

రాజశేఖరం తనుకూడా బయలుదేరాలని అనుకొంటూ వాచీ చూసుకున్నాడు. ఆరూ ఇరవై అయిదు అయింది.

ఏదయినా సినిమాకు పోదామా అనిపించింది. మళ్ళీ అంత లోనే ఆ ఆలోచన విరమించుకున్నాడు.

అతని దృష్టి అనుకోకుండా పార్కులో ఓచోట నిలిచి పోయింది. అతని చూపుల్ని కట్టేసిన యువతి తాలూకు చూపులు అనుకోకుండా అతని చూపుల్తో కలిశాయి.

ఒక్కక్షణం ఇంద్రధనుసు వెల్లి విరిసింది. అతని హృదయం స్పందించింది. గుండె ఓక్షణం ఆగి మళ్ళీ కొట్టుకోవటం మొదలయింది.

ఆ అమ్మాయి చాలా అందంగా వుంది. సామాన్యమైన అలంకరణతో చాలా ఆకర్షణీయంగా వుంది. చాలా అరుదుగా వుంటారు అలాంటి అందగత్తెలు. రాజశేఖరం బ్రహ్మచారి మనసు లయతప్పింది. ఆమెమీదినుండి చూపులు తప్పించుకోవటం ఎందుకో అతని శక్యం కాకుండావుంది.

ఆమె ఒక్కతే వచ్చినట్టుగా వుంది. పక్కన యెవరూ లేరు. ఎంత సేపట్నుంచి అక్కడ కూచునివుందో తను గమనించలేదు. అనుకోకుండా తనచూపు అటు తిరిగేసరికి ఆమె అక్కడ వుంది.

రాజశేఖరం లేచాడు.

ఆమెను దగ్గర్నుంచి పరీక్షగా చూడాలన్న తీవ్రమయిన కోరికని అణచుకోలేక పోతున్నాడు.

ఆమె తనవంక చూడటంలేదు. ఇందాకా అనుకోకుండా తన చూపుల్లో చూపులు కలిపింది. మళ్ళీ అలాంటవకాశం వస్తుందేమో ననుకుంటే రాలేదు మరి!

ఆమెకి సమీపంలో క్రోటన్స్ ప్రక్కగా చోటుచేసుకుని చతికిలబడ్డాడు. అప్పటికి ఆమె ముఖం బాగా కనిపిస్తోంది. ఆమెకి అనుమానం రాకుండా ఆమెను నఖశిఖ పర్యంతం పరీక్షగా చూడవచ్చును. అదేపని చేశాడు రాజశేఖరం!

ఆమె గులాబిరంగు ఫుల్‌వాయిల్ చీర కట్టింది. అదే రంగు మేచింగ్ బ్లవుజు వేసుకుంది. గుండ్రని ముఖంతో గడ్డంమీద చిన్ననొక్కు ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తోంది.

చక్రాల్లాంటి వెడల్పాటి కళ్ళు. నుదుట దోసగింజ ఆకారంలో సింగార్ కుంకుమ. మెడలో సన్నటి చెయిన్ వుంది. చివర లాకెట్ వుంది. ఆ చెయిన్ జాకెట్ లోపలికి కాకుండా పమిట మీదుగా పైకి వేసుకుంది సుతారంగా.

పొడవాటి నల్లటిజడ పాము కుబుసంలా వుంది. తలంటుకున్నట్టుంది. ముంగురులు ఫాలభాగంమీద మనోహరంగా నృత్యం చేస్తున్నాయి పిల్లగాలికి.

అవయవాలు బింకంగా పొంకంగా వున్నాయి. ఎక్కడ వుండాల్సిన ఎత్తుపల్లాలు అక్కడున్నాయి. కాళ్ళవంక చూశాడు. మెత్తటి కుషన్ హైహీల్సు వేసింది. వేళ్ళ వంక చూశాడు—మట్టెలున్నాయేమోనని! హమ్మయ్య; లేవు! మెడలో చెయిన్‌తప్ప మంగళసూత్రాల వంటివేమీ లేవు.

రాజశేఖరం తన పరీక్ష ముగించాడు.

అంత సన్నిహితంగా, అంత పరీక్షగా తనెప్పుడూ వో అమ్మాయిని చూడలేదు. ఈ అమ్మాయిని చూశాక యెందుకో తనకు మనసు అదుపు తప్పిపోయింది. కల్లుతాగిన కోతిలా గంతులు వేస్తోంది. అమ్మాయిలపట్ల ఏనాడూ ఆసక్తి చూపించని తను యీ అమ్మాయి అందం ముందు తన అంతస్తూ, హోదా మరచిపోయి మరీ చూస్తున్నాడు.

ఆ అమ్మాయి లేచింది

అప్పటికప్పుడే అక్కడే ఆమెని పలకరించి తనగురించి చెప్పుకుని, ఆమె గురించి తెల్సుకోవాలన్నంత తపన,

ఆరాటం అతన్ని నిలవనియ్యలేదు.

ఆమె కూర్చున్నవేపు చూసి ఉలిక్కిపడ్డాడు.

ఆమెలేదు.

ఏమయింది? ఇప్పటివరకు అక్కడే కూర్చుంది. ఎటు పోయింది?

గేటు పక్కగా ఆమె వదనం తళుక్కుమంది లైట్ల వెలుగులో!

అరె, అప్పుడే గేటుదాకా వెళ్ళిపోయిందే?

రెండంగల్లో గేటు దగ్గరికి పరుగెత్తుకు వెళ్ళాడు రాజశేఖరం.

ఆమె గేటు బయటవున్న ఆటోవాడితో ఏదో చెపుతోంది. వెళ్ళిపోయేలా వుంది. మళ్ళీ తనకు కనిపిస్తుందో లేదో! ఎందుకంటే ఇదివరలో ఆమెను యీ పార్కులో ఎన్నడూ చూడలేదు.

అవకాశం వదులుకోవద్దు. మనసుచేసే రొద విమానం రొదలా చెవులు హోరెత్తించేస్తోంది.

"ఎక్స్‌క్యూజ్‌మీ!" గొంతు సవరించుకుని ఆమెను పిలిచాడు.

ఆమె ఆటోలో కూచోబోతూ ఆగి వెనుతిరిగి చూసింది.

చాలు, ఆ ఒక్కచూపులో కోటి స్వర్గాలు కనిపించాయి తనకి!

ప్రశ్నార్థకంగా చూస్తున్న ఆమెతో వెంటనే యేం చెప్పాలో అర్థంకాలేదు రాజశేఖరానికి! మనసులో యేదో అలజడి, దడ! తెలియరాని స్పందన.

"మిస్, మీతో కొంచెం మాట్లాడాలి...." అన్నాడు పొడిగా.

"సారీ, నేను మిమ్మల్ని ఎన్నడూ చూసినట్టులేదు"

అన్నది.

చురుక్కుమంది రాజశేఖరానికి. అయినా తప్పదు.

"అన్యధా భావించవద్దు మేడమ్! నాపేరు రాజశేఖరం! జూనియర్ యింజనీరుగా పనిచేస్తున్నాను. మీతో పరిచయం చేసుకోవాలనుకొంటున్నాను. మీరు నన్నపార్థం చేసుకోకపోతే మీ గురించిన వివరాలు...."

అతనిమాట పూర్తికాలేదు.

ఆమె అదోలా రోడ్‌రోమియోని చూసే చూపుతో అతనివంక చూసింది.

"సారీ, నా కిలాంటివి కిట్టవు" అనేసింది.

ఆటో ఎక్కి "పోనీ!" అన్నది.

ఆటో వెళ్ళిపోయింది.

నీరుకారిపోయాడు రాజశేఖరం. ముఖ్యంగా అతని మెదడు కాసేపు పనిచెయ్యటం మానేసి మొద్దుబారిపోయింది.

2

రాజశేఖరం ఆమె జ్ఞాపకాలనుంచి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్న సమయంలో మళ్ళీ ఆమె విచిత్రంగా అతనికెదురయింది. అదీ విచిత్ర పరిస్థితిలో!

ఆరోజు రామారావుపేటలో స్నేహితుడి ఇంటికి వెళ్ళి బాగా పొద్దుపోయి వస్తున్నాడు స్కూటర్‌మీద!

కాలేజిగ్రౌండు ప్రక్కగా ఎవరో అరిచిన శబ్దం! అదీ స్త్రీ గొంతుక.

సమయం రాత్రి 11 గంటలు.

అతనికి మానభంగం కేసులు ఒక్కసారిగా గుర్తుకు వచ్చాయి.

అయితే ఎవడో అత్యాచారం తలపెట్టాడా?

స్కూటర్‌ని ఆపి దిగాడు. గ్రౌండు ప్రక్కన యేవో ఆకారాలు చీకట్లో లీలగా కనిపిస్తున్నాయి. అక్కడ వీధి లైటు లేదు.

ఏమీ కనిపించటంలేదు.

మెల్లగా అటువెళ్ళాడు.

ముగ్గురు దుండగులు ఓ స్త్రీని పట్టుకు బలాత్కారం చేస్తున్నారు. అరవకుండా ఆమెనోటి నదిమిపడుతున్నారు. అలా అదిమి పెడుతున్న సమయంలోనే వీలుచేసుకొని అరచినట్టుంది.

"ఎవర్రా అది?" గట్టిగా కేకపెట్టాడు రాజశేఖరం.

వాళ్ళు ముగ్గురూ ఒక్కసారిగా రాజశేఖరం మీది కొచ్చారు. సరిగ్గా అదే సమయంలో ఆమె యింకా గట్టిగా కేకలు పెట్టింది. రోడ్‌న పోతున్న ఆర్టీసీబస్సు ఆగింది. జనం దిగారు.

దుండగులు మళ్ళీ కనిపించకుండా కాలికి బుద్ధిచెప్పారు.

జనం సమీపించేసరికి ఆమె దుస్తులు సరిచేసుకొంది.

జరగబోయిన ఘోరం తెలుసుకున్నారు.

రాజశేఖరాన్నిచూసి ఒకతను "పాపం ఆడకూతురు, కాస్త ఆమెకు సాయంగా వెళ్ళి యింట్లో దిగబెట్టి రండి!" అన్నాడు.

లైటు వెల్తుర్లో అప్పటికే ఆమె ముఖం చూసిన రాజశేఖరం నిర్ఘాంతపోయాడు.

ఆమె తన మానస చోరిణి! అమృత వర్షిణి! తన ప్రేయసి! ఇలా అనుకోని విధంగా, యిలాంటి హేయమైన పరిస్థితిలో తనకెదురు పడ్తుందనుకోలేదు.

బస్ వెళ్ళిపోయింది.

దారిన పోతున్న ఆటోని చేయెత్తి పిలవబోయాడు రాజ

శేఖరం.

"ప్లీజ్, ఆటో వద్దు! మీ స్కూటర్‌పైనే వెళ్దాం!" అన్నదామె.

రాజశేఖరం విచిత్రంగా చూశాడామె వంక.

ఆమె కళ్ళు అవమానంతోను, లజ్జాభారంతోను వాలి పోయాయి.

అతను మాట్లాడకపోవడం చూసి ఆమె తలెత్తి అన్నది.

"నన్ను క్షమించండి!"

"ఎందుకు?"

"ఆ రోజు మిమ్మల్ని పార్కు దగ్గర అవమానకరంగా మాట్లాడాను."

"అది సహజం! నేనే ఏదో మనసు దాచుకోలేక మీతో ఏదేదో చెప్పాను. ముక్కు మొఖం ఎరగని మొగాడితో మీరు అంతకన్న యింకేం అనగలరు?"

"అర్థం చేసుకోగలిగారు. కాని, యీ నాడు మీరు ముక్కు, మొఖం తెలియనివారు కాదు. నా జీవితాన్ని కాపాడిన మహానుభావులు!" చేయెత్తి నమస్కరించింది.

రాజశేఖరం మనస్సు ఆనందనాట్యం చేసింది.

'ఈమె తనని అర్థం చేసుకుంది. తనని ఓ మనిషిగా ఆమెకోసం తపనపడ్డవాడిగా గుర్తించింది. తనకి అంత కన్న ఏం కావాలి?'

"ఈ సమయంలో మనం ఇలా మాట్లాడుతూ కూచుంటే ఆ దుండగులు మళ్ళీ వచ్చినా రావచ్చును."

"అవునవును. నన్ను ముందు మా యింట్లో దిగబెట్టండి. అన్ని సంగతులు రేపు వివరంగా పార్కులో మాట్లాడుకుందాం" అన్నదామె.

3

"ఇప్పుడు చెప్పండి. మీ గురించి వినాలని వున్నా' నిన్న సమయం కాదని యిప్పటివరకు ఓపిక పట్టి ఆగాను" అన్నాడు రాజశేఖరం.

పార్కులో ఎదురుబొదురుగా కూచున్నా రిద్దరు.

"నా పేరు అమృత" అన్నదామె.

"వెరీ స్వీట్ నేమ్!"

"నేను టీచరుగా పనిచేస్తున్నాను. నాన్న లేరు. అమ్మ నేను యిద్దరమే! నా జీవితం మా యిద్దరి పోషణకూ సరి పోతోంది. అమ్మ ఎన్నాళ్ళుగానో నా పెళ్ళి చెయ్యాలని తొందరపెడుతోంది. నేను పెళ్ళి చేసుకుని పోతే అమ్మ నెవరు చూస్తారు? నాతోపాటు నా తల్లినికూడా వుండనిచ్చే వరుడు దొరికాకనే చేసుకుందామని పెళ్ళి వాయిదావేశాను.

నేను ఉద్యోగం చేస్తున్నానని మా బంధువులు నన్ను దాదాపు వెలివేసినట్టు వదిలేశారు. నేనుకూడా ఎవర్ని లెక్క చేసే మనిషిని కాదు. మా బ్రతుకేదో మాది! మా నాన్నగారు సంపాదించింది ఏదీ లేదు. వుంటే అది మా అమ్మగారికి ఆధారంగా వుండేది. నేను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయినా, ఆమె చివరి రోజులు హాయిగా వెళ్ళిపోయేవి."

"మీ నాన్నగారు ఏం చేస్తుండేవారు?"

"తహశీల్దారు."

"అరె, తహశీల్దారు చేస్తూ ఆయన ఏమీ మిగుల్చుకో లేదంటే చాలా ఆశ్చర్యంగా వుందే!"

"మీకే కాదు, యిది చాలామందికి ఆశ్చర్యం కలిగించే విషయమే! ఆయన చాలా స్ట్రిక్టు! జీతం మించి ఒక్క పైసాకీ ఆశించేవారు కాదు. ఉన్నన్నాళ్ళు దర్జాగానే గడి పారు" ఆమె కళ్ళు ఏదో విషాదాన్ని మోసుకొస్తున్నాయి.

ఆమె నా పరిస్థితిలో చూడలేకపోతున్నాడు తను.

"మీ మనసు. మీ ఆత్మాభిమానం, మీ పట్టుదల, మీ అమ్మగారి పట్ల మీకున్న ప్రేమాభిమానాలు నన్ను ముగ్ధుడ్ని చేశాయి. నాకూ మా అమ్మ తప్ప మరెవ్వరూ లేరు. మీరు మరోలా అనుకోక పోతే మిమ్మల్ని ఓ మాట అడగాలని వుంది."

ఆమె కళ్ళు టపటప కొట్టుకున్నాయి.

"మరేం లేదు. మీ కిష్టమైతే మిమ్మల్ని పెళ్ళి చేసు కుంటాను."

ఆమె నిర్ఘాంతపోయినట్టు చూసింది.

"మీరు....మీరంటున్నది నిజమా?"

"నిజంగా. మీరంటే నాకు ఎంతో యిష్టం!"

"బాగా ఆలోచించుకునే చెపుతున్నారా? మీరెక్కడ, నేనెక్కడ? మీ అంతస్తు హోదాలకి సరితూగగలదాన్నా?"

"అమృతా. ఆ మాటలేం వద్దు. అంతస్తు, ఆస్తి ముఖ్యంకాదు, నువు నాకు ముఖ్యం! నేను ఎంతోమంది ఆడవాళ్ళని చూశాను. ఒకరూ నన్ను ఆకర్షించలేక పోయారు. నాకు ఆత్మీయులు కాలేకపోయారు. నిన్ను చూశాక నాకు కావలసిందేమిటో తెలిసొచ్చింది. నువు నాదాని వయితే నా కన్న అదృష్టవంతుడు లేడని కలలు కన్నాను. ఆ కల నిజం చేసుకోవాలనుకుంటున్నాను."

"మా అమ్మగారు మీకు భారంగా, బాధ్యతగా...."

ఆమె నోటికి చేతి నడ్డుపెట్టి, "మాకు కట్టుకుపోయేంత ఆస్తి వుంది. జూనియర్ యింజనీరుగా ఉద్యోగముంది. పదిమందిని పోషించగల స్తోమత వుంది. మీ అమ్మగారు, అందునా నాకు అత్తగారయ్యాక ఆమె నాకు భారమెలా

అవుతారు?'' నవ్వుతూ అన్నాడు.

ఆశ్చర్యంగా అతడ్నే చూస్తూండిపోయింది అమృత.

4

పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది. తల్లి శాంతమ్మ ఎంతగా పోరినా పదిమందిలో ఘనంగా ఆర్భాటంగా చేసే పెళ్ళి తన కిష్టం లేదన్నాడు రాజశేఖరం!

నిరాడంబరంగా రిజిష్టర్ మేరేజ్ చేసుకున్నారు.

ఆ రాత్రి తమ యింటిని, ఆస్తిపాస్తుల్ని వరసగా అమృతకి చూపిస్తూ ఆమె మురిసిపోతుంటే, అప్యాయంగా ఆర్తిగా ఆమెనే చూస్తున్నాడు రాజశేఖరం.

అమృతకి తనెంతటి అదృష్టవంతురాలో తెలిసివచ్చింది.

"ఈ స్వర్గం నేనాశించనది. అసలు నన్నర్థం చేసుకుని ఆదరించగల భర్త దొరికితే చాలనుకునేదాన్ని, అమ్మని కష్టపెట్టని వ్యక్తి దొరికినా చాలనుకునేదాన్ని. ఇప్పుడు నాకు ఆ కోరికతోబాటు అంతస్తు, ఐశ్వర్యం, అంతకు మించిన మంచి మనసున్న, నన్ను నన్నుగా యిష్టపడ్డ మీరు భర్తగా లభించారు. నాకు యింతకన్న కావలసిందేముంది?'' భర్త హృదయంమీద వాలిపోతూ అన్నది అమృత.

పరవశంగా ఆమెని మీదికి లాక్కున్నాడు.

"మరి ఆ రాత్రి నేను ఎక్కడ్నుంచి వస్తున్నానో నని కనీసం మాట మాత్రంగానైనా అడగలేదేం మీరు?'' అన్నది భర్త గుండెలమీద వేళ్ళతో మురిపెంగా నిమురుతూ.

"ఇప్పుడవన్నీ ఎందుకు అమృతా? నీ గతం గురించి నా కనవసరం! అయినా ఆ రాత్రే మనల్ని యిలా కలిపి ఒకటిగా చెయటానికి పునాది వేసింది. అంతవరకే!''

లైటు తీసేశాడు రాజశేఖరం.

అతని బాహువుల్లో గువ్వలా ఒదిగిపోయింది అమృత.

5

"నేను చెప్పిన ప్రకారం అంతా పకడ్బందీగా జరగాలి. ఏ తేడా పాడా లొచ్చినా నిన్ని లోకం నించి పైకి పంపే యాల్సి వుంటుంది" అన్నాడతను.

అమృత తలూపింది.

"ముందు ముసల్దాని సంగతి చూడు. రెండుమూడు రోజుల్లో దాని పని ముగిసిపోతే మన తర్వాతి కార్యక్రమం వెంటనే అమల్లో పెట్టడానికి వీలవుతుంది" మళ్ళీ అన్నాడతను.

"అలాగే. నువు రావటం ఎవరైనా చూస్తే మొదటికే మోసం వస్తుంది. గుడికి వెళ్తున్నానంటే మా అత్తకూడా వస్తానన్నది. ఇంతలో పక్కింటావిడ వస్తే, ఆమెతో కబుర్లలోపడి నన్ను వెళ్ళి రమ్మన్నది."

"అత్త!...." పగలబడి నవ్వాడతను.

ఒకరిద్దరు భక్తులు వెనుతిరిగి చూశారు.

"అదుగో, అందరూ యిటే చూస్తున్నారు. నువ్వెళ్ళు, నే చూసుకుంటాను."

"ఏమో, సంసారంలో పడి అసలు సంగతే మరచి పోతావేమోనని నా భయం!"

అమృత కోపంగా చూసిందతని వంక.

అతను తేలిగ్గా నవ్వేసి "ఊరికే తమాషాకన్నాను. నీకు మాత్రం నీ జాగ్రత్త తెలీదా? మరేంలేదు. నిజంగా పెళ్ళాం లాగా అతనికి వశమైపోతే, రేపు నిన్నొసడూ పెళ్ళి చేసు కోడు" అన్నాడు.

"ఆ విషయాలు నీ కనవసరం. ఎంతవరకో అంత

వరకే! నీవన్న పని నేను పూర్తి చేస్తాను. నీ మాట నిల బెట్టుకో! ఈ ప్రయత్నంలో నేను సర్వనాశనమైపోయినా, ప్రాణం పోయినా నేను లెక్కచేయను."

"నీ సంగతి నాకు తెలీదా? నిన్ను పదే పదే హెచ్చరించాల్సిన పని లేదనుకో! బై ....వస్తా. పొట్లాం జాగ్రత్త! చాలా ఘాటైన విషం." మరోసారి గుసగుసగా చెప్పి వెళ్ళిపోయాడతను.

దూరంగా వున్న చిన్నకారు అతను ఎక్కగానే సర్రున దూసుకుపోయింది.

అమృత భారంగా నిట్టూర్చి గుడిలోపలకు వెళ్ళింది.

6

"నాకు ప్రత్యేకం పాలు నువ్వు తేవాలా? నే తెచ్చుకుంటాగదమ్మ!"

కోడలు మేడదిగి కిందకు వచ్చి తనకు పాలు తేవటం చాలా సంతోషం కలిగించింది శాంతమ్మకు.

"ఫర్వాలేదు అత్తయ్యా! ఆ మాత్రానికేనా?"

"మీ అమ్మగారు నిద్రపోయిందా?"

"ఇంకా లేదత్తయ్యా! వంటిల్లు సర్దుతోంది."

"అదేమిటో, ఓ కొత్తనిగాని, అనవసర సంకోచంగాని ఏమీలేవు మీ అమ్మగార్కి. ఇంట్లో మనిషికన్న ఎక్కువగా ఏ చైంకి ఏది కావాలో అమర్చిపెడుతుంది."

అమృత నవ్వి వూరుకుంది.

"అన్నట్టు చూడమ్మా, అల్మరాలో మందు బిళ్ళలున్నాయి కదా! ఓ టాబ్లెట్టు యిచ్చిపోమ్మా!"

"అలాగే అత్తయ్యా!"

అమృత టాబ్లెట్టు వెతికి పైకితీసింది.

"అన్నట్టు నువ్వు రోజూ పాలు తీసుకోవాలమ్మా!

మీకు అంటే అబ్బాయికి. నీకు పాలు వేరే పెట్టించావా?''

అమృత తలూపింది.

''ఏదో నీ కడుపున రెండు కాయలు కాస్తే, వాళ్ళతో కృష్ణా రామా అంటూ కాలం గడిపెయ్యాలనుకుంటున్నాను తల్లీ! మావాడు యిన్నాళ్ళకు పెళ్ళిమాట తలపెట్టాడు. ఆలస్యమయినా బంగారంలాంటి నిన్ను యింటికి తెచ్చుకున్నాడు.''

అమృత టాబ్లెట్లు యిచ్చింది.

''మంచినీళ్ళు కావాలమ్మా!''

''అలాగేనండి!'' వెనుతిరిగింది అమృత.

చీరకొంగు గ్లాసుకు తగిలింది. గ్లాసు భళ్ళున కిందపడి పగిలిపోయింది. పాలన్నీ నేలపాలయిపోయాయి.

''అరరెరె....'' శాంతమ్మ బాధగా ముఖం పెట్టింది.

''ఫరవాలేదత్తయ్యా! మీకు మళ్ళీ తెస్తాను.''

అమృత వంటింటి వైపు వెళ్ళింది.

మంచినీళ్ళ జగ్‌తోను, మరోగ్లాసు పాలతోను లోపలి కడుగువేస్తున్న అమృత గుమ్మం దగ్గరే నిల్చుండిపోయింది.

శాంతమ్మ నిలువెల్లా కోపంతో వణికిపోతోంది.

ఎదురుగా చూసిన దృశ్యం అమృతని నిర్ఘాంతపోయేలా చేసింది.

కింద పారబోసిన పాలను తాగినట్టుంది ఓ పిల్లి-చచ్చి పడివుంది.

''ఏమిటిది? పాలలో ఏం కలిపావు, ఎందుకు కలిపావు?'' చాలా గంభీరంగా వినవచ్చింది శాంతమ్మ కంఠం.

''ఏమోనత్తయ్యా, నాకేం తెలీదు'' దుఃఖం వచ్చేసింది అమృతకు.

"ఇది నీకు తెలీకుండా యెలా జరిగింది? పాలలో విషం కలిసింది. ఎవరు కలిపారు? నువ్వు, మీ అమ్మ తప్ప ఎవరున్నారు యింట్లో? పోనీ మీ అమ్మ కలిపిందా?"

"అలా ఎన్నటికీ కలపదు అత్తయ్యా! అదెలా జరిగిందో అర్థం కాకుండా వుంది."

శాంతమ్మ కోపం తగ్గలేదు.

అమృతకి ఏదో చటుక్కున తట్టింది.

"అత్తయ్యా! ఇవిగో యీ పాలు మీకోసం మళ్ళీ తెచ్చాను. చూడండి ఇప్పుడే తాగుతున్నాను" అని అమృత పాలగ్లాసు ఎత్తి గటగటా పాలన్నీ తాగేసింది.

వద్దని వారించబోయిన శాంతమ్మ మాటలు గొంతులోనే ఆగిపోయాయి.

శాంతమ్మ అమృతవంకే చూస్తూండిపోయింది.

అయిదు నిమిషాలు .... పది నిమిషాలు....గడిచినా అమృత చెక్కుచెదరలేదు.

"అత్తయ్యా! నిజంగా నేనే యీ పాలలో విషం కలిపి వుంటే యిప్పుడు తాగిన పాలలో కూడా కలిపివుండేదాన్నే కదా! అయినా మీరంటే నాకు ద్వేషమా, శత్రుత్వమా? ఎందుకు విషం కలుపుతాను అత్తయ్యా? మీరు నా తల్లికన్న ఎక్కువ. అలాంటి మీకు ద్రోహం చేస్తానా?" అమృత కళ్ళు వర్షిస్తున్నాయి.

శాంతమ్మ ఆలోచనలో పడిపోయింది.

కోడలు కాపరానికొచ్చిన మొదలు ఆమె ప్రవర్తనలో యెక్కడా తప్పుపట్టాల్సిన పని లేకుండా యెంతో ఒద్దికగా వినయంగా ప్రవర్తిస్తోంది. ఇంటెడుచాకిరీ తల్లి సాయంతో నెత్తిన వేసుకు చేస్తోంది. పనిమనిషి అవసరం లేకుండానే అన్ని పనులూ చక్కబెట్టుకొస్తోంది. అలాంటి కోడలు ఈ

రోజు ఎందుకిలా చేస్తుంది?

అయినా, ఆమెకి తానంటే ఆరోప్రాణం! వేళకి ఏం కావాలో అవన్నీ స్వయంగా తనే అమర్చిపెడుతోంది. తనని యెంతో ప్రేమగా, ఆత్మీయంగా చూసుకుంటోంది.

అలాంటి కోడల్ని ఈ దుర్ఘటనతో అనుమానించడమా? ఆ పిల్లి ఎందుకు చచ్చిందో? నిజంగా కోడలికి తనని చంపాలనే దుర్బుద్ధే వుండివుంటే రెండోసారి పాలలో ఎందుకు విషం కలపదు? తన ప్రయోగం రెండోసారి అమలపరచి వుండేది!

శాంతమ్మ అమృత కళ్ళలోకి చూసింది.

నిష్కపటమైన నిర్మలమైన ఆ కళ్ళలో కుటిలత్వంగాని, ద్రోహ చింతగాని మచ్చుకైనా కనిపించలేదు.

7

"ముసలిదాన్ని చంపటానికి ఎందుకింత తాత్సారం చేస్తున్నావో అర్థంకాదు. నీ ఉద్దేశ్య మేమిటో బోధపడకుండా వుంది" అతని స్వరం తీవ్రంగా వుంది.

అమృత మాట్లాడలేదు.

మధ్యాహ్న సమయం. అత్తగారు తన గదిలో నిద్ర పోతోంది. రాజశేఖరం ఆఫీసుకి వెళ్ళిపోయాడు. ఇతను చూడబోతే యిప్పుడొచ్చి ఆర్భాటం చేస్తున్నాడు. అత్తగారు ఏ క్షణంలోనయినా రావచ్చును.

గుమ్మం దగ్గిర అమృత తల్లి నించుని లోపలికి బయటకి కాపలా కాస్తోంది.

"విషం కలపమని యిచ్చాను. ఏం చేశావు?"

"కలిపాను. కాని పాలు తాగకముందే కిందపడి గ్లాసు పగిలిపోయింది."

"అబద్ధం! నువ్వు కలపలేదు. మీ అమ్మ కలిపితే నువ్వే

కావాలని గ్లాసు కిందకి తోసి గ్లాసు పగలేశావు."

"మా అమ్మా?"

"అదే, మీ అమ్మ స్థానంలో చలామణి అవుతున్న యీ ముసల్ది. నీ కాపలాదారు; ప్రస్తుతం నీ తల్లి!"

"ఓహ్, ఆ పని ఈ ముసల్ది చేసిందా? నాకు చెప్పవచ్చు కదా! నేను సమయం చూసి కలపాలనుకున్నాను కాని యింతలో యీ ముసలిది తొందరపడిందన్న మాట! ఇంత జరిగినట్లు నాకు తెలీదు."

"నీ మీద నమ్మకం లేకనే యీ ముసలిదాన్ని నీ మీద నియోగించాను. నీ చర్యల్ని ప్రతిక్షణం గమనిస్తోంది. నీకు మొగుడు, అత్తగారు అనే బంధాలు రోజు రోజుకీ ఎక్కువవుతున్నట్లు అనుమానించి నాతో చెప్పింది. నువ్వు వచ్చిన పనేమిటి? చేస్తున్న దేమిటి? మొగుడితో సంసారం చెయ్యటానికా నిన్ని యింట్లో ప్రవేశపెట్టింది?"

"లేదు, లేదు. అనుమానం రాకుండా వీలుని బట్టి మన పథకాన్ని అమలు పెట్టాలని చూస్తున్నాను, అంతే!"

"సరే మరో రెండురోజులు చూస్తాను. ఈ లోపల ముసలిదాన్ని పైకి పంపెయ్యాలి. ఆ తర్వాత ఇంకా ముఖ్యమయిన కార్యక్రమం వుంది—అమలు జరపాలి."

అమృత తల్లిగా చలామణి అవుతున్న ముసల్ది సైగ చేసింది, శాంతమ్మ వస్తున్నట్టు.

అమృత గమనించలేదు.

అంతసేపు దొడ్డి తలుపుదగ్గిర ఆగంతకుడితో మాట్లాడుతున్న అమృత అకస్మాత్తుగా అక్కడికొచ్చిన శాంతమ్మని చూసి నిర్ఘాంతపోయింది.

అతను అప్పుడే తలుపు తీసుకుని బయటపడి రోడ్డెక్కేశాడు.

శాంతమ్మ ఎరుపెక్కిన కళ్ళతో అమృతనే చూస్తోంది.

8

"అమ్మా, శాంతమ్మగారు ఎంత పిలిచినా లేవటంలేదు. నాకేదో అనుమానంగా వుంది" అన్నది అమృత తల్లి— అమృత, రాజశేఖరం సినిమానించి తిరిగొస్తూనే యెదురు వెళ్ళి.

అమృత కోపంగా, అనుమానంగా ఆమె వంక చూసింది.

రాజశేఖరం రెండంగల్లో తల్లి గది చేరుకున్నాడు.

అమృత అదిరే గుండెల్ని చిక్కబట్టుకొని అతన్ని అనుసరించింది.

గదిలో మంచంమీద వెల్లకిలా పడుకుని వుంది, శాంతమ్మ. ఆమె పడుకున్న తీరులోనే ఏదో అసహజత్వం కనిపిస్తోంది.

దగ్గరికి వెళ్ళి చేయి పట్టుకుని చూసి తృళ్ళిపడ్డాడు రాజశేఖరం. చల్లగా తగిలింది.

ఆమెల్లో చలనం లేదు. చనిపోయి రెండు గంటలైనా అయివుంటుంది.

"అమ్మా!" చిన్నపిల్లాడిలా బావురుమన్నాడు.

అమృత ధారాపాతంగా కారుతున్న కన్నీటిని లెక్క చెయ్యకుండా, "ఏమిటిది? ఎలా జరిగింది?" అన్నది తల్లి నుద్దేశించి.

"మీరు సినిమాకు వెళ్ళాక ఓ గంట యిద్దరము హాల్లో మాట్లాడుకుంటూ కూచున్నాం. తల నొప్పిగా వుందని చెప్పి, కాస్త అమృతాంజనం పట్టించుకుని, కాసేపు విశ్రాంతి తీసుకుంటానని తమ గదిలోకి వెళ్ళారు. ఓ గంట

తర్వాత చూస్తే నిద్రపోతున్నారు.

"మీరు వచ్చేముందు గదిలోకి వెళ్ళి లేపాను, ఫోం చేద్దామని రమ్మని పిలవటానికి. పలకలేదు. బాగా నిద్ర పట్టేసి వుంటుంది, లేపడమెందుకని ఊరుకున్నాను. అయితే, యింత జరిగిందని వూహించలేక పోయాను" అమృత తల్లి పైట చెంగు నోట్లో కుక్కుకుని సన్నగా రోదిస్తూ చెప్పింది.

రాజశేఖరం అమృతని దగ్గరకు తీసుకుని ఆమె గుండెల్లో తల దాచుకుని, "నాకు అమ్మ ఆరో ప్రాణం. ఆమె లేదనే నిజాన్ని భరించలేకపోతున్నాను. నా మనసు మొద్దుబారిపోయింది అమృతా!" ఏడ్చేస్తున్నాడు.

అమృత అవిరళధారగా వర్షిస్తున్న కన్నీటిని తుడుచుకొని అతని వీపుపై చేతులు వేసి వెన్ను నిమిరింది ఆప్యాయంగా.

అతను ఆమె దగ్గిర ఉపశమనం పొందాడు.

"నాన్న పోయారు, యిప్పుడు అమ్మ పోయింది. నేను వంటరివాడ్ని. నువ్వే నాకిక సర్వస్వం!" మగవాడ్నని మరచిపోయి బేలగా మాట్లాడ్తున్న భర్తలో పసివాడి మనస్తత్వం గోచరిస్తోంది అమృతకి.

విషయం తెలిసిన చుట్టుప్రక్కలవాళ్లు లోపలికి వస్తున్నారు.

రాజశేఖరం నించి దూరంగా జరిగింది అమృత.

ఆమెకు యిదంతా అపసవ్యంగా కనిపిస్తోంది. తన అత్తగారిది సహజమరణం కాదు. చంపేశారు. అనుమానంలేదు. అది తామిద్దరు సినిమాకి వెళ్ళినప్పుడే జరిగింది. అయితే ఎవరు? ఈ ముసల్ది, అతను కలిపి చేసి వుండాలిపని.

ఆమెకళ్లు పరిశీలనగా గదిని చూశాయి. మంచంపక్కనే కాలిపోయిన సిగరెట్టు పీకలు ఆమె అనుమానాన్ని నివృత్తి చేశాయి. రాజశేఖరం సిగరెట్లు కాల్చడు. ఆ సిగరెట్స్... అవును, అతను కాల్చేవే! అతనే....యీ ముసల్ది, అతను కలిసి శాంతమ్మగార్ని చంపేసి వుంటారు.

భర్తకి కనిపించకుండా సిగరెట్టు పీకలు యేరి పారేసింది. అప్పటికే చుట్టుపక్కలవాళ్ళు లోనికి వచ్చేశారు.

జరగవలసిన కర్మకాండకు ఏర్పాట్లు మొదలయ్యాయి.

9

"నువ్వా?"

"ఏం ఆశ్చర్యపోతున్నావ్! నీ మనస్తత్వం నాకు పూర్తిగా బోధపడింది. మీ అమ్మ, నాన్న, తమ్ముడు ఒకే సారి పరలోకానికి అతిధులుగా వెళ్ళిపోతారు జాగ్రత్త! నేను నీకు చెప్పినదేమిటి? నువు చేస్తున్నదేమిటి?"

"నీ కార్యక్రమం అమలు పరుస్తున్నావుగా! యేది మానావు?" కోపంగా చూసింది అమృతఅతని వంక.

అతను కోరగా నవ్వాడు.

"నువు అవకాశం, సమయం....అంటూ అనవసరంగా టైం వేస్ట్ చేస్తున్నావు. అందుకే నేను, యీ ముసలిది కలిసి మీరు సినిమాకు పోయిన రాత్రి ముసలిదాన్ని స్వర్గానికి పంపేశాం. పెద్దగా కష్టపెట్టలేదు. ఊపిరాడకుండా చేసి తేలిగ్గా చంపేశాం."

మళ్ళీ నవ్వాడతను.

"ఇక అసలు టార్గెట్-నీ మొగుడు! వాణ్ని త్వరలో పంపిస్తే యింక మాపని పూర్తయినట్టే! ఆ తర్వాత నువ్వు యీ ఆస్తి నాకు అప్పగించి వెళ్ళిపోతావు. మీ అమ్మ, నాన్న, తమ్ముడితో కలిసి హాయిగా వుంటావు.

ప్రతిఫలంగా నీక్కూడా కొంత ముట్టచెబుతానులే! ఈ లోపల నగ, నట్రా దాచెయ్యాలని ప్రయత్నించకు. ఈ ముసలిదానికి అంతా లెక్కే! వేటకుక్క లాంటిది."

"ఛీ, పాపిష్టివాడా! డబ్బుకి నీచానికి దిగజారే మనిషిని కాదు నేను. నాకీ పాపిష్టి డబ్బు వద్దు. నా కుటుంబం క్షేమంగా వుండాలి. మా అమ్మ నాన్న తమ్ముడు క్షేమం గానే వున్నారుకదా!"

"ఆహా! హాయిగా తింటున్నారు. వాళ్ళని బంధించి పెట్టానేగాని వాళ్ళు హాయిగా బతికెయ్యటానికి అన్ని యేర్పాట్లు చేశాను. రాజకీయ ఖైదీల్లాగా హాయిగా వేళకు అన్నీ అమర్చుకుంటున్నారు. నా మనుషులు మీ వాళ్ళని చాలా మర్యాదగా చూస్తున్నారు కూడా.

'నీ మర్యాద మండినట్టేవుంది' కసిగా అనుకుంది అమృత.

"నా కార్యక్రమం విను! త్వరగా, అంటే—ఒకటి రెండు రోజుల్లో మీ ఆయనను ఏక్సిడెంట్లో చంపెయ్యబోతున్నాం."

అమృత గుండె ఒక్కక్షణం ఆగినట్టయింది.

"బహుశా మీ ఆయన ఇవ్వాళో, రేపో తానుపోతున్న స్వంతకారులోనే బ్రేకులు ఫెయిలయి ఏక్సిడెంటుకు గురై చస్తాడు. కాకుంటే స్కూటర్ యే లారీకో గుద్దుకొని చస్తాడు."

క్రూరంగా నవ్వుతున్నాడు అతను.

అమృత గుండెవేగం పెరిగింది. వీడు....వీడు అన్నంత పనీ చేస్తాడు. ఇప్పుడెలా? ఎలా?

"ఏమిటి ఆలోచనలో పడ్డావు?"

"ఏంలేదు, ఏంలేదు...."

"ఓకే! నే వస్తాను. నీకు, మీ వాళ్ళకు త్వరలోనే సెలవు ఇచ్చేస్తాను—మా కోరిక తీరిన వెంటనే!"

అతను వెళ్ళిపోయాడు.

లోపలికి వచ్చి పడగ్గదిలో తలుపులు వేసుకుని బోర్లా పడుకుని వెక్కి వెక్కి ఏడ్చింది అమృత.

తనిప్పుడేం చెయ్యాలి?

ఆమె మస్తిష్కంలో మెరుపులాంటి ఆలోచనవచ్చింది.

అవును....యీ విపత్కర పరిస్థితిలో తనని ఆదుకోగలవాడు ఆయనొక్కడే!

అయితే, తనకు ఆయన ఇంటి అడ్రసు తెలీదే!

ఆ, టెలిఫోన్ డైరెక్టరీలో దొరకవచ్చు.

ఆమె మెట్లుదిగి హాల్లోకి వచ్చింది. టెలిఫోన్ డైరెక్టరీ తీసుకుంటుండగా ఫోన్ మోగింది.

ఫోన్ ఎత్తి "హల్లో" అంది.

"హలో అమృతా! నేను రాజశేఖరాన్ని. అమ్మపోయిన విచారంలో ఆఫీసు పనికూడా చెయ్య బుద్ధికావటంలేదు. సాయంత్రం అలా ఎక్కడికయినా వెళదాం. తయారుగా వుండు."

"ఈరోజు వద్దులెండి."

"ఏం?"

"కొంచెం నీరసంగా వుంది."

"ఓకే, నీ ఇష్టం అయితే నేను సాయంత్రం కాసేపు యే పార్కులోనో గడిపివస్తాను, మనసు బాగోలేదు."

"అలాగే, మీ యిష్టం."

ఫోన్ పెట్టేశాడు రాజశేఖరం.

డైరెక్టరీ తన గదిలోకి తెచ్చుకుని పేజీలు తిరగేసింది. ఒక అడ్రసు చిన్న కాగితంమీద నోట్ చేసుకుంది.

అయిదు నిమిషాల్లో తయారయి బయటకి వచ్చింది.

ఎదురుగా తన తల్లి స్థానంలో వున్న మనిషి!

"ఎక్కడికమ్మా?"

'దీనికన్నీ కావాలి. పాపిష్టిది!' తిట్టుకుంది అమృత.

"మావారు ఇప్పుడే ఫోన్ చేసి మేట్నీ సినిమాకి వెళ్దాం రమ్మన్నారు. హాలుదగ్గర వుంటానన్నారు, వెళ్తున్నాను."

"నన్ను రమ్మంటారా సాయం!"

"ఎందుకు? ఆటోలో వెళ్ళగలను!"

10

కాలింగ్ బెల్ మోగింది.

"ఎవరు కావాలమ్మా?" బిందు అడిగింది, తలుపుతీసి.

"డిటెక్టివ్ కిరణ్‌గారి ఇల్లు ఇదేనాండి?"

"అవును. కాని, ఆయన ప్రస్తుతం ఊళ్ళోలేరు!"

"అయ్యో, ఎలాగండి? ఆయనతో చాలా ముఖ్యమైన పని వుంది నాకు. చాలా అర్జంటు. ఎప్పుడొస్తారండి?"

"రెండు మూడు రోజులు పట్టొచ్చు. నాగపూర్ వెళ్ళారు ఏదో కేసు పరిశోధనలో."

అమృత నిస్సత్తువగా గోడకి చేరబడిపోయింది.

బిందు జాలిపడి, "లోపలికి రామ్మా, మాట్లాడు కుందాం. నేను మిసెస్ కిరణ్‌ని. లాయర్ని" అన్నది.

అమృతలో మళ్ళీ జీవం వచ్చింది.

లోపలికి అడుగుపెట్టింది.

బిందు ఆమెని డ్రాయింగు రూంలోకి తీసుకువెళ్ళింది.

ఫ్రిజ్ తెరిచి, ఫ్రూట్ జ్యూస్ కలిపి తెచ్చి "తీసుకోమ్మా, చూడగా ఒత్తిమనిషిలా లేవు" అన్నది బిందు ఆదరంగా నవ్వుతూ.

ఆ ఆదరణకు అమృత కళ్ళు జలపూరితమయ్యాయి,

"మీరు ఒక్క చూపులోనే నా పరిస్థితిని అర్థం చేసుకున్నారు."

"లాయర్ని కదా! వృత్తి అలవాటు."

అమృత రిలాక్సయింది.

"ఇప్పుడు చెప్పమ్మా! నీకేం సహాయం కావాలి? ఇక్కడికి వచ్చేవాళ్ళు ఎంతో తల మునకలయ్యే కష్టంలో వుంటేనేగాని రారని మాకు తెలుసు. డిటెక్టివ్ కిరణ్ లేరని సంకోచించకు. నాకు చెపితే చేతనైన సాయంచేస్తాను" అన్నది బిందు.

"మీ దగ్గర నేను ఏమీ దాచుకోను. మొదట్నించీ అన్ని సంగతులు చెపుతాను, వినండి...."

అమృత గొంతు సవరించుకుని చెప్పటం మొదలెట్టింది.

"నేను, మా తమ్ముడు, అమ్మ, నాన్న—నలుగురం కుటుంబ సభ్యులం మేం. మా నాన్నగారు తహశీల్దారుగా చేసి రిటయిరయ్యారు. ఆయన జీవితకాలంలో సంపాదించినదంటూ ఏం లేదు. మంచిపేరు తప్ప. కుటుంబభారం నేనే వహించాను. నేను గ్రాడ్యుయేట్ చేసివున్నాను అప్పటికే. తర్వాత బి.యిడి. చేసి టీచరుగా జాబ్ సంపాదించాను యీ వూళ్ళోనే.

ఓరోజు నేను కాలేజి నించి తిరిగొచ్చేసరికి యింట్లో అమ్మ, తమ్ముడు నాన్న—ఎవరూ లేరు.

నాకు ఆశ్చర్యమనిపించింది. తలుపులు తీసుకుని లోపలకు వెళ్ళాను. కిటికీ పక్కగా ఏదో కాగితం పడి వుంది. తీసి చూశాను. దానిలో యిలా వుంది.

'మిస్ అమృతా! మీవాళ్ళు ఏమయ్యారోనని బెంగపడకు. మా అతిథులుగా క్షేమంగా వున్నారు. నేను వాళ్ళకి ఏ విధమైన హానీ చెయ్యను. నీవలన కావలసిన పనొకటి వున్నది

మాకు! అది కాగానే నిన్ను, మీ వాళ్ళని ఏ హానీ చెయ్యకుండా వదలి వెళ్ళిపోతాం. నీకు అంను కిష్టమైతే గాంధీ నగర్ పార్కుకి వెంటనే బయల్దేరిరా! ఈ విషయం పోలీసులకి తెలియచేసి మమ్మల్ని పట్టించాలని ప్రయత్నిస్తే మీవాళ్ళు ప్రాణాలతో బయిటపడరు, జాగ్రత్త!'' అని వుంది.

దిక్కుతోచని నేను వెంటనే గాంధినగర్ పార్కుకి వెళ్ళాను. కాసేపటికి అక్కడికో వ్యక్తి వచ్చాడు. వాడి పేరు యిప్పటికీ నాకు తెలీదు. వాడే మా వాళ్ళని దాచి పెట్టినవాడు. వాడ్ని 'ఎక్స్' అని వ్యవహరిద్దాం.

నన్ను పేరు పెట్టి పలకరించాడు. నేనేం చెయ్యాల్సిందీ చెప్పాడు:

'లక్షాధికారి రాజశేఖరం బ్రహ్మచారి. నీ అందాన్ని ఎర జూపి అతన్ని నీవెంట తిప్పుకునేలా చెయ్యి. నిన్ను పెళ్ళాడే విధంగా అతన్ని నీ మార్గంలోకి రప్పించు. నిన్ను పెళ్ళి చేసుకున్నాక తక్కిన కార్యక్రమం మేం చెపుతాం' అన్నాడు.

'ఏమిటది?' అనడిగాను నేను.

'ఇప్పుడు చెప్పను' అన్నాడు.

'ఓ ముక్కూ మొహం తెలీని వాడ్ని పెళ్ళి చేసుకుని, నా జీవితాన్ని నాశనం చేసుకోనా?' అనడిగాను.

'అది నిజం పెళ్ళి కాదు. అతను పెళ్ళి చేసుకున్నా నీ భర్తకాదు. పెళ్ళయిన కొద్ది రోజుల్లోనే చస్తాడు. నువ్వు మీ వాళ్ళని కల్సుకుని హాయిగా వుండాలంటే మేం చెప్పినట్టు చెయ్యి. దీనికి వ్యతిరేకంగా జరిగితే మీవాళ్ళు నీకు దక్కరు' అన్నాడతను.

నాకు గత్యంతరం కనిపించలేదు. అతను చెప్పిన దాని

కళ్లా పిచ్చిదానిలా తలూపాను. రాజశేఖరంగారు రోజూ పార్కుకి వస్తూండటం అలవాటుట. రోజూ నన్ను పార్కుకి వెళ్ళేలా ఏర్పాటు చేశారు.

ఓరోజు రాజశేఖరంగారు వచ్చారు. కావాలని ఆయన ముందు కూచుని నావైపు ఆకర్షించుకున్నాను.

ఆ తర్వాత మరో రోజు రాత్రి రాజశేఖరంగారు ఎవరో ఫ్రెండు యింటినించి ఆలస్యంగా వస్తున్న సమయంలో 'ఎక్స్' నన్ను రంగంలో ప్రవేశపెట్టాడు. నన్ను మరో యిద్దరితో కలసి అత్యాచారం చేస్తున్నట్టు 'సీన్' సృష్టించి రాజశేఖరాన్ని స్పాట్‌కి రప్పించాడు.

తర్వాత రాజశేఖరంగారు నన్ను మా యింటి దగ్గిర దిగబెట్టారు. మర్నాడు పార్కులో ఆయన్ని కలిసి నా గురించి కొన్ని అబద్ధాలు చెప్పాను. తల్లి తప్ప ఎవరూ లేరని, నన్ను పెళ్ళి చేసుకునే వ్యక్తి నా తల్లినికూడా పోషించాలని చెప్పాను. అప్పటికే 'ఎక్స్' నన్ను అనుసరించి గమనించటానికని ఓ ముసలిదాన్ని మా యింట్లో ప్రవేశపెట్టాడు. దాన్నే నా తల్లిగా రాజశేఖరంగారికి పరిచయం చేశాను.

పెళ్ళి జరిగిపోయింది. ఆ ముసల్ది నా తల్లిగా రాజశేఖరం గారింట్లో నాతో అడుగుపెట్టింది'' అంటూ అటు తర్వాత జరిగిన విషయాలు, శాంతమ్మగారి మరణం వివరంగా చెప్పింది అమృత.

"ఆ తర్వాత 'ఎక్స్' మళ్ళీ యీ రోజు వచ్చాడు మా యింటికి. రాజశేఖరంగార్ని ఆక్సిడెంట్లో చంపబోతున్నట్టు, త్వరలో నేను యీ ఆస్తిపాస్తుల్ని వాడి చేతి కప్పగించి, మా వాళ్ళతో హాయిగా వుండవచ్చునని చెప్పాడు.

నిజంగానే వాడు మావార్ని చంపేస్తాడు. ఆ ఆలోచనే

నాకు భరించరానిదిగా వుంది. ఆయన్ని పెళ్ళి చేసుకోక ముందు, నావాళ్ళ కోసం సాహసం చేసి 'ఎక్స్' చెప్పి నట్టల్లా ప్రవర్తించాను. ఆయనతో పెళ్ళయ్యాక ఆయన 'నావారు' అన్న భావన నాలో రాగానే నాకు ఆప్తులయ్యారు. మా అనురాగ చిహ్నంగా నేనిప్పుడు వారి బిడ్డను నా కడుపున మోస్తున్నాను.

ఇంత అనుబంధం మామధ్య ఏర్పడ్డాక వారికేదైనా అయితే నేను బతికి వుండటం కల్ల! ఆయన లేని జీవితం వూహించుకోవటానికే భయంగా వుంది నాకు! అందుకే యీ కష్ట సమయంలో డిటెక్టివ్ కిరణ్‌గారు తప్ప నన్ను ఆదుకునే వారు లేరని వార్ని ఆశ్రయించాలని వచ్చాను."

అంటూ ముగించింది అమృత.

బిందు ఆమె చెప్పినదంతా పొల్లుపోకుండా విన్నది.

"మీవారితో యీ 'ఎక్స్' విషయం ఎందుకు చెప్పలేదు?"

"వారు నన్ను అపార్థం చేసుకుంటారని సంకోచించాను. 'ఎక్స్'కి తెలిస్తే మావాళ్ళని చంపేస్తాడని భయపడ్డాను. అందుకే యీ విషాన్ని నాలో నేనే జీర్ణించుకున్నాను. ఇప్పుడు వార్ని రక్షించుకోవటానికి మీ యింటికొచ్చాను. నన్ను మీరే రక్షించాలి. మావార్ని ఆపదనుంచి కాపాడాలి. నా పసుపు కుంకుమ నిలబెట్టాలి" రెండు చేతులూ జోడించింది అమృత.

" 'ఎక్స్' స్థావరం మీకు తెలుసా?" అడిగింది బిందు.

"తెలియదు."

"అతని ఫోన్ నంబరు?"

"అదీ తెలీదు. అతను నాకు ఎన్నడూ ఫోన్ చెయ్యమన లేదు. స్వయంగా తనే వచ్చేవాడు ఏ విషయమన్నా

చెప్పాల్సి వస్తే?''

''ఆల్‌రైట్. మీరు సమయం మించిపోకుండానే నా దగ్గరకు వచ్చారు. నేను మీకు నా శాయశక్తులా సహాయ పడతాను. మీ మనసులో చెలరేగుతున్న సంక్షోభం అర్థం చేసుకోగలను. పెళ్ళనేది నూరేళ్ళ పంట! ఒకసారి ముడి పడ్డాక ఆ బంధం, అనుబంధం విడదీయరానిది. మన వివాహబంధంలో వున్న అందమే అది!

''ఇప్పుడు నేను చెప్పినట్లు చెయ్యండి. ముందు మామూలుగా మీరు మీ భర్తతో అన్ని విషయాలు వివరంగా చెప్పెయ్యండి. ఏక్సిడెంట్ జరగబోతున్న విషయం ఆయనకి తెలియటం చాలా ముఖ్యం! అయితే మీరు చెప్పే విషయాలకి ఆయన అప్‌సెట్ కాకుండా చూడండి. ఆ ముసల్ది వినకూడదు. విన్నదంటే మన ప్లాన్ బెడిసి కొడ్తుంది....''

''సారీ మేడమ్. నేను నా నోటితో వారికి ఏమీ చెప్ప లేను. దయచేసి నా విషయం అంతా ఆయన మనసుకు నొప్పి కలక్కుండా చెప్పగల భారం మీదే! అందుకు మీరే సమర్థులు!''

బిందు కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయింది.

''ఆల్‌రైట్! మీ గత చరిత్ర నేనే మీ వారికి వివరంగా చెప్పి మీ భారం దించుతాను. అయితే అది యిప్పుడు కాదు. 'ఎక్స్' విషయం తేల్చాలి ముందు. మళ్ళీ 'ఎక్స్' మీ దగ్గ రికి వస్తానన్నాడా?''

''ఎప్పుడొస్తాడో తెలీదు. ఆయనకి అపకారం జరిగాకనే వస్తాడేమో!''

''అయితే ఓ పని చెయ్యండి. ఆ ముసల్దానికి 'ఎక్స్' స్థావరం తెలిసే వుంటుంది. దానిచేత 'ఎక్స్'కి కబురు

పెట్టండి—మీవాళ్ళని ఓసారి చూడాలనుకుంటున్నానని! వాళ్ళు సజీవంగా వున్నారో లేదో తెల్సుకోవాలనుకుంటున్నానని!

'ఎక్స్' మిమ్మల్ని తీసుకు వెళ్ళటమో లేదా మీ వాళ్ళని ఏదోక సంకేత స్థలంలో చూపించటమో చేస్తాడు. చూపించక పోతే నిజాన్ని మీవారికి చెబుతానని బెదిరించండి. దారి కొస్తాడు. మనం ట్రాప్‌చేసి 'ఎక్స్'ని పట్టుకోవటం కష్టమేం కాదు.

అయితే వాడు మీవాళ్ళ ఆచూకీ చెప్పకపోతే మీవాళ్ళ ప్రాణాలకే ప్రమాదం! వాడ్ని ఒక్కడ్నీ బంధిస్తే వాడి ప్రాణం పోయినా మీవాళ్ళ సమాచారం చెప్పడు. అందుకని ముందు జాగ్రత్తగా మీ వాళ్ళని కల్సుకోవటం ముఖ్యం. పోలీసులు సమయానికి చుట్టుముట్టి మీ వాళ్ళను రక్షించే లాగా, 'ఎక్స్'ని బంధించేలాగా నేను ఏర్పాటు చేస్తాను" అన్నది బిందు.

అమృత కృతజ్ఞతగా చూసింది బిందు వంక.

"నా నెత్తిన పాలుపోశారు. మీ మేలు జన్మ జన్మలకీ మరచిపోలేను" అన్నది అమృత.

"ఆ విషయాలు తర్వాత. మీకు 'ఎక్స్' ఏదో కబురు చెపుతాడు కదా—మిమ్మల్ని మీవాళ్ళ దగ్గరకు తీసుకు వెళ్ళటమో లేదా, తను వెంట బెట్టుకుని మీవాళ్ళను మీ దగ్గరకు తీసుకు రావటమో చేస్తాడు. ఆ విషయం—అతనేమన్నదీ- నాకు యీ నంబరుకు డయల్ చేసి చెప్పండి. అప్పటికే మీ యింటి సమీపంలో మారువేషాల్లో పోలీసులుంటారు. మీకేం హాని జరగదు. వాళ్ళు మిమ్మల్ని నీడలా వెంటాడతారు" అన్నది బిందు.

11

"రండి, మిసెస్ కిరణ్. చిరకాల దర్శనం!" సీట్లోంచి గౌరవంగా లేచి ఆహ్వానించాడు క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్. కుర్చీ ఆఫర్ చేశాడు.

బిందు కూచోకుండానే, టూకీగా అతను చెయ్యవలసిన పని గురించి చకచక చెప్పి, రాజశేఖరం యింటి అడ్రసు యిచ్చింది.

"ప్లీజ్ హరియప్ మిస్టర్ యినస్పెక్టర్! మీకు చేతి నిండా పని! ఇన్ఫ్రిమెంట్ సంతకం కావాలంటే నే చేస్తాను" అన్నది.

"అబ్బెబ్బె. మీ మాటే చాలు. నేను యిప్పుడే అందు కవసరమైన ఏర్పాట్లు చేస్తాను."

"నేను మా యింట్లో ఫోన్ దగ్గిరే మీ మెసేజ్ కోసం కాచుకునుంటాను. ఏమాత్రం నా అవసరం వచ్చినా వెంటనే ఫోన్ చెయ్యండి. నే వస్తాను."

"బ్రదర్ నాగపూర్ నించి తిరిగొచ్చారా!"

"ఇంకా లేదు" చెపుతూనే మెట్లు దిగి కారు స్టార్టుచేసి ముందుకు పోనిచ్చింది బిందు.

'ఆఫీస్ ఆఫ్‌ది ఎక్జిక్యూటివ్ ఇంజనీర్' అన్న బోర్డు వున్న బిల్డింగు ముందు కారు ఆపుచేసింది బిందు.

రాజశేఖరం గంట క్రితమే ఆఫీసునించి వెళ్ళిపోయినట్టు చెప్పారు అక్కడి వాళ్ళు.

'ఎంత పని జరిగింది? అయితే యీసరికి....' మరి ఆలోచించలేక పోయింది బిందు.

కారు స్టార్టు చేస్తూండగా ఆమెకు అమృత మాటలు గుర్తొచ్చాయి. ఆఫీసునించి అట్నుంచి అటే రాజశేఖరం గాంధీనగర్ పార్కుకి వెళ్తానని చెప్పాడంది అమృత.

సరే, ఓసారి పార్కుకి వెళ్ళొస్తే సరి—అయినా హంతకుడు రాజశేఖరాన్ని ఎప్పటికప్పుడు గమనించటానికి మనుషుల్ని పెట్టి వుంటాడు. ఆ మనుషులు రాజశేఖరం బయల్దేరటం చూసి మిస్టర్ 'ఎక్స్'కి తెలియచేసి వుంటారు. అతను రాజశేఖరాన్ని ఏక్సిడెంట్‌లో యిరికించటానికి సన్నాహాలు చేసి వుంటాడీసరికి! రాజశేఖరాన్ని సజీవంగా చూడలేదేమో తను!

గాంధీనగర్ పార్కు దగ్గిర ఫియట్ ఆపింది బిందు.

తను రాజశేఖరాన్ని ఎప్పుడూ చూడలేదు. ఇక్కడ వున్నా ఎలా గుర్తు పట్టగలదు?

ఆమెకో ఆలోచన తట్టింది. అతనికి స్కూటర్ వుందని అమృత చెప్పింది.

బిందు పార్కు చుట్టూ కలియజూసింది. ఓ పక్కగా నీలిరంగు స్కూటర్ పార్కుచేసి వుంది.

బిందు కారు దిగింది. పార్కు లోపలికి నడిచింది. అక్కడక్కడ చెదురు మదురుగా వున్నారు జనం. ఓ మూలగా గులాబి మొక్కల నడుమ కూచుని వున్న ఓ యువకుడు ఆమె దృష్టి నాకర్షించాడు.

తన ఊహ నిజమయితే అతనే రాజశేఖరం!

దగ్గరగా వెళ్ళి "మీరేనా రాజశేఖరం?" అనడిగింది.

అతను దిగ్గున తలెత్తి ఆశ్చర్యంగా చూశాడామెని. "అవును. మీరు....మిమ్మల్ని ఎప్పుడూ చూసిన గుర్తు లేదు."

బిందు వెంటనే, "నా పేరు బిందు—లాయర్. అన్ని విషయాలు మీతో వివరంగా యింటి దగ్గిర చెపుతాను. మీ భార్య అమృత గురించి మీతో మాట్లాడాలి" అన్నది.

రాజశేఖరం లేచి ఆమె ననుసరించాడు.

బిందు స్కూటర్‌వంక వెళ్ళబోతున్న రాజశేఖరాన్ని ఆపి, "నా కార్లో వెళదాం రండి. స్కూటర్ని లాక్‌చేసి రండి, నేను తర్వాత తెప్పిస్తాను" అన్నది.

రాజశేఖరం ఆమె చెప్పినట్టే చేశాడు.

ఫియట్ ఒక్క గెంతుతో ముందుకి పరుగెత్తింది.

మెయిన్‌రోడ్‌కి వచ్చాక దేవాలయం వీధి మలుపు తిరుగుతోండగా ఎదురుగా విపరీతమైన స్పీడ్‌తో భూతంలా ఓ లారీ దూసుకొచ్చింది.

బిందు ఓ క్షణం — ఒక్క క్షణమే—తడబడింది. వెంటనే చిన్న జర్క్‌తో కారుని ఆపి, ఒక్కసారిగా వెనక్కి—పక్కసందులోకి తప్పించింది. లారీ వేగంగా దూసుకుపోయింది.

బిందుకి అర్థమైపోయింది: ఎవరో తమని వెంబడిస్తున్నారు. అంతేకాదు, తమమీద హత్యాప్రయత్నం మొదలయింది. రాజశేఖరం తనతో రావటం 'ఎక్స్' మనుషులు చూశారు. తననికూడా అతనితోబాటు మట్టుబెట్టడానికి సిద్ధమయ్యారు. అదృష్టవశాత్తు పెద్ద గండం గడిచింది.

రాజశేఖరం ఊపిరి పీల్చుకుని బిందు వంక, ఆమె నైపుణ్యతకు ప్రశంసా పూర్వకంగా చూశాడు. అతనికి అంతా అయోమయంగా వుంది.

బిందు వదనంలో ఏ భావమూ ప్రస్ఫుటం కాలేదతనికి.

బిందు తమ యింటికి సందు గొందుల వెంట ఫియట్‌ని పోనిచ్చింది.

"రండి" ఆహ్వానించింది రాజశేఖరాన్ని. అతనామెను అనుసరించాడు. అతన్ని డ్రాయింగ్ రూంలోకి తీసుకు వెళ్ళింది. రాజశేఖరం సస్పెన్స్ భరించలేకపోతున్నాడు.

"మీరు అమృత గురించి వినాలనుకుంటున్నారు కదూ!

చెపుతా, వినండి....” అంటూ అమృత చెప్పిన విషయా లను కన్విన్సివ్‌గ్‌గా చెప్పటం మొదలెట్టింది బిందు.

12

ఎంతసేపటికీ అమృతనించి ఫోన్ రాకపోవటంతో బిందు మనసు కీడు శంకించింది. అమృతకేమయినా అయితే.... తన పథకం బెడిసికొట్టలేదు కదా?

మిస్టర్ 'ఎక్స్' అమృతకి హాని చెయ్యడు. రాజశేఖరం ఆస్తిపాస్తులు అమృతపరం కావాలి. అమృతనించి వాటిని 'ఎక్స్' వశపరచుకోవాలి—అది చాలాకాలం పడుతుంది. అంతదాకా అమృత ఒంటిమీద యీగ కూడా వాలదు.

కాకపోతే, అమృత తన సహాయం కోరినట్టు తెలిసినా, అమృత తల్లిదండ్రుల్ని చూస్తానని 'ఎక్స్'కి పంపిన కబురు అతనికి అనుమానాస్పదంగా తోచినా, ఆమె తల్లి తండ్రులు, తమ్ముడు 'ఎక్స్' చేతిలో హతమయిపోవటం ఖాయం!

ఫోన్ మోగింది.

ఆత్రంగా తీసింది బిందు.

శ్రీనివాస్ మాట్లాడుతున్నాడు.

"హలో, మిసెస్ బిందు కిరణ్, అన్నీ సవ్యంగా జరి గాయి మిస్టర్ 'ఎక్స్'ని అతని అనుచరులతోపాటు బంధిం చాం. మీరు యిచ్చిన గైడ్‌లైన్స్ చాలా వుపకరించాయి. అమృతతోపాటు 'ఎక్స్' స్థావరానికి బయల్దేరుతుండగా మా కానిస్టేబిల్స్ మఫ్టీలో ఆమెని అనుసరించి వెళ్ళారు.

ఆమెను 'ఎక్స్' స్థావరంవద్ద అతని మనుషులు లోపలికి తీసుకువెళ్ళటం చూసి వెంటనే నాకు మెసేజ్ పంపారు. నేను అన్ని వైపులనుండీ 'మిస్టర్ ఎక్స్' స్థావరాన్ని చుట్టు ముట్టాను. రెడ్ హేండెడ్‌గా దొరికిపోయాడు. అక్కడే

అమృత తల్లిని, తండ్రిని, తమ్ముణ్ణి దాచిపుంచాడు.

ఇంకా కొంతమంది అనుచరులు బయట ఉండిపోయారట. వాళ్ళని కూడా బంధించే ఏర్పాటుచేశాను. వాళ్ళు రాజశేఖరం మీద హత్యాప్రయత్నంకోసం 'స్పేర్' చెయ్యబడ్డ అనుచరులు. రాజశేఖరం విషయం తెలిసిందా?.... ఆహా, క్షేమమే కదా! ఇక్కడ అమృత ఒకటే ఏడుస్తోంది. అతని గురించి!....సరే. యిప్పుడే చెపుతాను. తక్కిన వివరాలన్నీ ముఖస్థంగా మాట్లాడుదాం....ఆ. కంగ్రాట్స్ నాకు దేనికి? నేనే మీకు చెప్పాలి. థాంక్యూ, థాంక్యూ!"

బిందు ఫోన్ పెట్టేసి, రిలాక్సింగ్‌గా ఊపిరి విడిచింది.

రాజశేఖరం ఆమెవంక కృతజ్ఞత నిండిన కళ్ళతో చూస్తున్నాడు. □

ఇంటిపట్టున వుండని మగడు

ఒక బిక్షువు తలుపు తట్టాడు. తలుపు తెరచిన ఇంటావిడ కోపంతో గట్టిగా యిలా అంది:

"వెళ్ళు, వెళ్ళు. వెళ్ళకుంటే నా భర్తను పిలుస్తాను!"

"నీ భర్త యింట్లో లేడు."

"నీ కెలా తెలుసు?"

"నీలా గట్టిగా అరిచేదాన్ని చేసుకొన్నవాడు యింట్లో ఉంటాడా?" అని వెళ్ళిపోయా డా బిక్షువు.

—బాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

జొన్నలగడ్డ రామలక్ష్మి

మంచిరోజులు



"ఉత్తరాలేమైనా వచ్చాయా?" అన్నాడు గోపాలం.

"చాలా మంచి ఉత్తరమండీ" అంది భార్య.

అతనింకా ఏదో అడిగేలోగానే "మీ ఆకాశప్రేమ నవలను సినిమా తీస్తామంటూ ఓ నిర్మాత ఉత్తరం రాశాడండీ"

అందామె.

గోపాలం ఆతృతగా అది అడిగితీసుకుని చదివి తనలో తానే చాలాసేపు మురిసిపోయాడు, "ఇన్నాళ్ళకు ఫిలిం నిర్మాతలు మంచి నవలలకోసం చూడ్డం ప్రారంభించారు. ఇది తెలుగుసినిమా చరిత్రనే మార్చివేసే రోజు" అంటూ ఉత్తరం మరోసారి చదివాడు.

కొత్తగా సినిమా తీయాలనుకుంటున్న వీర్రాజనే ఓ నిర్మాత మద్రాసు నుంచి ఆ ఉత్తరం రాశాడు. ఆయనకు ఆకాశప్రేమ నవల నచ్చింది. పదివేలిచ్చి హక్కులు కొంటాట్ట. అది ఇంతవరకూ ఎవరికైనా మాటిచ్చారా అని ఆత్రపడుతూ ఆయన రాసిన ఉత్తరమది.

"అడిగేవాళ్ళే లేరు—మాటివ్వడానికి!" అన్నాడు గోపాలం.

"జవాబేమని రాస్తారండీ" అంది భార్య.

"ఒప్పుకుంటూ రాసేస్తాను."

"వెంటనే ఒప్పుకుంటే లోకువేమోనండీ" అందామె.

"ఒప్పుకోకపోతే ఆ నిర్మాత మరో కథ చూసుకుంటాడు. సినిమాకి కథ అంటే కో అంటే కోటిమంది రచయితలు క్యూలో నిలబడే యీ రోజుల్లో మనని ఎవరో వచ్చి కథ అడిగితే వెంటనే ఒప్పుకుని తీరాల్సిందే!"

"పోనీ పదిహేను వేలిమ్మని అడగండీ!" అంది భార్య.

"పత్రికలు వందల్లో ఇస్తున్నాయి. ఈయన వెయ్యి రూపాయలిస్తానన్నా సంతోషంగా యిచ్చి వుండేవాణ్ణి. ఎందుకొచ్చిన బేరాలులెద్దూ—మనకు చేతకానప్పుడు?" అన్నాడు గోపాలం.

భార్యాభర్తలిద్దరూ తర్జన భర్జనలు చేశాక ఉత్తరం రాశాడు గోపాలం. ఆ నవల హక్కులు యింకా యెవరికీ

యివ్వలేదనీ, పదివేలకు యీ నిర్మాకివ్వడానికి సిద్ధంగా వున్నాననీ అతడు రాశాడు.

ఉత్తరం రాశాక జవాబుకోసం భార్యాభర్త లిద్దరూ రోజూ ఎదురుచూడసాగారు.

2

"ఉత్తరాలేమైనా ఉన్నాయా?" అన్నాడు గోపాలం.

"చాలామంచి ఉత్తరమండీ!" అంది భార్య.

"ఎవరు రాశారు? నిర్మాలగారా?"

"కాదండీ—ఎవరో పబ్లిషర్!"

"ఇలా తీసుకురా ఆ ఉత్తరాన్ని!"

భార్య గోపాలానికా ఉత్తరం అందించింది.

పబ్లిషర్ గోపాలం కథలు, నవలలు పత్రికల్లో చదువుతున్నాడట. ఇలాంటి రచయిత లేడని ఆయనకు తోచిందిట. మొత్తం గోపాలం రచనలన్నింటినీ ఆయన విడిగా సంపుటాలుగా ప్రచురించాలనుకుంటున్నాడట. కథల సంపుటాలకు డిమాండు అంతగాలేదు కాబట్టి ముందుగా నవలలను సంపుటాలుగా తీసుకువస్తాడట. అంతవరకూ ఎవరైనా గోపాలం రచనలను ప్రచురించి వుంటే—అదే పారితోషికం తామూ ఇస్తామని రాశాడు.

"ఇంతవరకూ ఒక్క రచన కూడా మనది విడిగా ప్రచురణ కాలేదే? ధరలు తెలుసుకోవడం యెలా?" అన్నాడు గోపాలం.

"దానికేముందండీ-నవలకు వెయ్యిరూపాయలు చొప్పున అడగండీ" అంది భార్య.

"వెర్రిదానా—తెలుగులో అంతిచ్చి నవలలు వేసే పబ్లిషర్సు చాలా తక్కువ. మనమలా రాశామంటే పబ్లిషర్ బెదిరిపోతాడు" అన్నాడు గోపాలం.

"అయితే ఎంత కడుగుతారు?"

"విజయవాడలో పేజీకి పదిపైసలు లెక్కన యిచ్చి నవలలు రాయిస్తున్నారుట. ఇలాంటి పరిస్థితుల్లో మనం చేయగలిగినదేముంది?" అన్నాడు గోపాలం.

"బాగుందండీ మీరు పేరున్న రచయితలు. అన్నీ పాఠకులు మెచ్చిన రచనలు. వీటికి కాస్త ఎక్కువే అవుతుంది."

"అదే నేనూ అంటున్నాను. పారితోషికం వచ్చిన రచనలే గదా ఇవి! కనీసం సంపుటాలుగానైనా పడివుంటాయి. ఎంతో కొంత ఆయనకు తోచింది ఇమ్మని రాస్తాను" అన్నాడు గోపాలం.

"అలా రాస్తే లోకువగా వుంటుంది. నవలకు అయిదు వందలు అడగండి. ఇష్టమైతే వేస్తాడు. లేదా కనీసం బేరమాడతాడు" అంది భార్య.

గోపాలం దీనికి అయిష్టంగానే అంగీకరించాడు. ప్రచురించబడిన నవలలు చాలా వున్నాయతనివి. అందువల్ల వచ్చే లాభం తక్కువేమీ వుండదు.

ఉత్తరం రాసిన మర్నాటి నుంచీ భార్యాభర్తలిద్దరూ జవాబుకోసం ఆతృతగా ఎదురుచూడసాగారు.

3

"ఉత్తరాలేమైనా వచ్చాయా?" గోపాలం.

"చాలా మంచి ఉత్తరముందీ!" అతడ భార్య.

"పబ్లిషరా, నిర్మాతా?"

"ఎడిటరు!"

"ఎడిటరా, ఏ పత్రిక?"

ఇంతవరకూ అతడికి ఏ పత్రిక ఎడిటర్నుంచీ ఉత్తరాలు రాలేదు. అందువల్ల చాలా థ్రిల్లింగ్‌గా వుంది.

"కొత్తపత్రిక!" అంది అతడి భార్య.

గోపాలం కొత్త పత్రికలు వస్తున్నట్లు ప్రకటనలు చూడడమేగానీ ఎవరూ తన కు త్తరాలు వ్రాయడం ఎరుగడు. విరివిగా తన రచనలు పత్రికల్లో కనబడుతున్నా సాహితీ లోకాన్ని తనపేరు ఆకర్షించలేదని అతడు బాధపడు తూంటాడు. ఇన్నాళ్ళ కిన్నాళ్ళకు ఓ కొత్త పత్రిక నుంచి అతడికి ఉత్తరం వచ్చింది.

పత్రిక పేరు ధృవతార. సంపాదకుడు ప్రసాదరావు. తన పత్రిక మంచి సాహిత్యానికే ప్రతిబింబంగా ఉండా లన్నది ఆయన ఆశయం. ఆయన ఆశయాలకు గోపాలం కథలు న్యాయం చేకూర్చేవిగా ఉన్నాయి. కొత్తపత్రికకు గోపాలం నుంచి ఓ మంచి రచనను ఆహ్వానిస్తున్నాడు. రచనకు తగినంత పారితోషికం కూడా వుంటుంది. ఎంతో వ్రాయలేదు.

"ఎంతిస్తారో?" అంది భార్య.

"ఎంతివ్వడం సంగతటుంచు. మనం రాసి పంపడమే కానీ యింతవరకూ మన్ని రాసిపంపమన్నవాళ్ళు లేరు. ఇది చాలా శుభదినం!"

"మీరు చాలా గొప్పవారై పోతారండీ!" అంది భార్య.

"వెర్రిదానా—రచయితలు గొప్పవాళ్ళు కావడం అసం భవం!" అన్నాడు గోపాలం ఓ పెద్దవేదాంతిలా.

"ఎందుకుకారు?" అంటూ ఆమె కొన్ని పేర్లు చెప్పింది.

గోపాలం ఇంకా వేదాంతి ముఖం మార్చకుండానే— "వాళ్ళంతా రచయితలుకారు స్వయం ప్రచారకులు. రచ యితలుగా గొప్పవాళ్ళం కాలేమని తెలిసి స్వయంప్రచారం ప్రారంభించుకుని గొప్పవాళ్ళై పోయారు" అన్నాడు.

"అది సరేలెండి-ఈ ఉత్తరానికి మీరేమని జవాబిస్తారు?"

అంది భార్య విషయం మారిపోకుండా కాపాడుతూ.

"జవాబుగా కథ పంపిస్తాను."

"అలా వెంటనే పంపేస్తే అది తిరిగొచ్చిన కథేమోనని అనుమానపడతారండీ" అంది భార్య.

"అయినా అభిమానంగా అడిగిన వాళ్ళకు తిరిగొచ్చిన కథ పంపుతానేమిటి? కొత్త కథ రాస్తాను" అన్నాడు గోపాలం.

"బాగుంది. తిరిగొచ్చిన కథలు పాతపత్రికలు వేసుకోక కొత్తపత్రికలూ వేసుకోక ఏమైపోవాలంటారు?" భార్య నిలదీసింది.

"కొత్తపత్రికలు తిరిగొచ్చిన కథలు వేయడం కోసమని పెట్టరు. ఈ సంపాదకుడు మనపేరు తెలుసుకుని మరీ ఉత్తరం రాశాడు. కథ బాగుందంటే తర్వాత ఏ సీరియలైనా అడిగినా అడగొచ్చు. మన రచనల్నే వేసుకోవడం ప్రారంభించవచ్చు. ఈ రోజుల్లో ప్రచారంతో యెంత గొప్పవాళ్ళయినా కావచ్చు. ఒక పత్రిక మనని చేరదీసిందంటే చూస్తూండగా తారాపథం చేరుకోవచ్చు" అన్నాడు గోపాలం.

"అయితే మీ యిష్టం వచ్చినట్లు చేయండి" అంది భార్య.

గోపాలం రెండురోజులు కష్టపడి తను మంచిదనుకున్న ఓ కథ రాసి పోస్టుచేశాడు. తర్వాత ఎడిటర్నించి ఉత్తరం కోసం ఎదురు చూడసాగాడు.

4

తన జీవితానికో గొప్పమలుపు రానున్నదని గోపాలానికి అనుమానం వచ్చింది. సినీ నిర్మాతలు, పుస్తకాల ప్రచురణకర్తలు, పత్రికా సంపాదకులు పెద్ద పెద్ద కబ్బాలలో

నిలబడివుంటే తన యిల్లు రేషన్‌షాపు అని కొందరు పొర బడినట్లు అతను కలగన్నాడు.

ఎన్నో ఏళ్ళుగా కృషి చేస్తూంటే యిప్పటికి గుర్తింపు వచ్చిందని గోపాలం సంతోషపడితే గొప్పవాడికి గుర్తింపు రాకేమవుతుందని భార్య అంది.

తాము రాసిన ఉత్తరాలకు జవాబులకోసం భార్యా భర్తలిద్దరూ రోజూ ఎదురు చూస్తూనే వున్నారు.

ఒకరోజున గోపాలం వచ్చి "ఉత్తరాలున్నాయా?" అని రోజూలాగే నిర్లిప్తంగా కుర్చీలో కూర్చునిపోయాడు.

"ఒకటి కాదు రెండు కాదు మూడు" అంది భార్య.

"మూడా—అయితే వాళ్ళు ముగ్గురే రాశారా?"

వాళ్ళు ముగ్గురు అంటే ఆ యింట్లో గోడలకు కూడా తెలుసు.

"అవును...."

"మంచిగా రాశారా?"

"మీరే చదవండి!"

గోపాలం భార్య అతడికి ఉత్తరాల నందించింది.

మొదటి ఉత్తరం సినీ నిర్మాతది. ఆయనకు ఆర్థికమైన యిబ్బందు లొచ్చాయట. చాలా చిక్కుల్లో వున్నాడట. కథకు అయిదువేల కంటే యివ్వలేడట. సినిమాలు హిట్టయి లాభాలు వస్తే ఆ తర్వాత ఏమైనా ప్రయత్నించ గలడట. ఆకాశప్రేమ కథ బాగా నచ్చిందట. కానీ ప్రస్తుత మున్న డబ్బు యిబ్బందులవల్ల అయిదువేలకు ఏ కథ దొరికితే ఆ కథే సినిమాగా తీస్తాడట.

"అంతా మీ రిచ్చిన లోకువ. మీ రీ ఉత్తరానికి ఒప్పు కుని జవాబు వ్రాయండి. రెండువేలే యిస్తామని యింకో వుత్తరం రాస్తాడు—" అంది భార్య.

"ఎవరైనా మన కథని సినిమాగా తీసేదాకా మనకు పేరెలాగొస్తుంది? అస లయిదువేలు మాత్రం మనకు తేలికగా ఉన్నాయా?" అన్నాడు గోపాలం.

రెండో వుత్తరం పబ్లిషర్ వ్రాశాడు.

నవలకు యాభై మించి ఇవ్వలేడుట. "అసలు మీరు కూడా అంతే అడిగారనుకుంటాము. పొరపాటున ఓ సున్నా ఎక్కువేసి వుంటారు. ఈ రోజుల్లో ఒకసారి ప్రచురించిన నవలలకి అంతకంటే ఎవరిస్తారు?" అని కూడా రాశాడు. ఇష్టమైతే వెంటనే ఉత్తరం వ్రాయమనీ ఎగ్రిమెంటు ఫారం పంపుతామనీ రాశాడు.

"నవలకు యాభై రూపాయాలా? వంకాయలు కూడా యింత కంటే చవగ్గా వస్తాయి—" అంది గోపాలం భార్య.

"నవలను తూకంవేసి అమ్మితే పావు కేజీ వంకాయలు కూడా రావు. ఈ బేరమే బాగుంది. పాతిక కేజీలు వస్తాయి—" అన్నాడు గోపాలం.

"మీరిలాగే ఆలోచించండి—రేపట్నుంచి కూరలవాడు మీ నవలలు కేజీల లెక్కన కొనడం ప్రారంభిస్తాడు—" అంది గోపాలం భార్య.

"రచనకు ఎంతో కొంత డబ్బివ్వాలి కానీ కూరగాయల వాడికైనా సరే అమ్మేస్తాను...." అన్నాడు గోపాలం.

మరో ఉత్తరం ఎడిటరు రాశాడు.

కొత్త పత్రిక నిలదొక్కుకోడానికి కొంత కాలం పడుతుందట. సంవత్సర చందా అడగను కానీ పత్రిక కాపీని దాని వెలకు వీపీపీగా పంపుతానని రాశాడు. ఆ విధంగా పుస్తకాన్ని రచయితలకైనా అమ్మవచ్చు ననుకున్నాడో ఏమో! వెల రెండు రూపాయలట. నాలుగైదు నెలలపాటు

పత్రికకు సహకరించిన రచయితల కందరకూ—ఆ పై నుంచి పారితోషికం పంపుతాడట. కథ తనకు నచ్చిందని రాశాడు.

"నా అనుమానం ఈ పత్రికలో నాలుగు కథలూ రెండువేల జోకులూ వుంటాయని!" అంది గోపాలం భార్య.

"రెండువేల జోకులే!" అన్నాడు గోపాలం.

"జోకులు కాకపోతే సామెతలు. మొత్తంమీద పత్రికలో రచయితల సంఖ్య రెండువేలకు తక్కువ వుండదు. అంద రికీ వీపీపీలు వెడతాయి. ఆరంభంలో రెండువేలు సర్క్యులేషన్ గ్యారంటీ—...." అంది గోపాలం భార్య.

"వెర్రిదానా—రెండువేల జోకులంటే మాటలు కాదు. వందల్లో జోకులు రాసి సంకలనాలుగా వేసి—పదికీ పది హేనుకీ అమ్ముకుంటున్న రోజులివి...."

"ఏమో లెండి—యింతకీ మీ రేం చేస్తారు?" అంది భార్య.

"ఏం చేస్తాను? మన కథలు వరుసగా వేసుకునే మాస పత్రిక దొరికితే అంతకంటే కావలసిందేముంది? పదేళ్ళలో యాభై కథలూ, ఆరు నవల్లూ రాశాను. ఇలాంటి పత్రి కలు నాలుగుంటే ఈ పనికి ఏడాది చాలు...."

"మరి డబ్బు?"

"పేరొస్తే డబ్బు దానంతటదే వస్తుంది...."

"మీ యిష్టం వచ్చినట్లు చేయండి....రేపు బజారుకెళ్ళి పేపరమ్మేవాడిలా కేకలు వేస్తూ మీ కథ లూరికే పంచి పెట్టుకు రండి....మధ్య నా కేమిటి? మీ రచయితలు మిమ్మల్ని మీరే చౌక చేసుకుంటున్నారు...." అందామె

విసుగ్గా.

తన యిష్టప్రకారమే గోపాలం ఆ ముగ్గురికీ ఉత్తరాలు రాసిపారేశాడు. అన్నింటికీ మించి అతడు సినీ నిర్మాత ఉత్తరంకోసం ఎదురుచూస్తున్నాడు.

నెల రోజులు గడిచినా యెక్కణ్నించీ ఉత్తరాలు లేవు. గోపాలానికి మతిపోయినట్లయింది.

ఈ మధ్య కాలంలో నాలుగు పత్రికల నుంచి అతడి కథలు తిరిగివచ్చాయి. ఓ నవల తిరిగివచ్చింది.

సింహాసనం మీద కూర్చోబెట్టి దింపేసినట్లయిందతనికి.

తను గొప్పవాడు కాబోయి ఆగిపోయానని గ్రహించాడు.

అతను చేసిన మంచిపనల్లా యివేమీ యెవరికీ చెప్పుకోలేదు. మధ్యలో బెడిసికొడితే నవ్వులపాలు కావల్సొస్తుందన్న భయంకొద్దీ అతను జాగ్రత్త తీసుకున్నాడు.

ఒకరోజున అతడి స్నేహితుడు రామనాథం—"నీ నవల ఆకాశశ్రేపు సినిమాగా తీస్తున్నారటగా—సితారలో చూశాను—" అన్నాడు.

గోపాలం ఆశ్చర్యానికి అంతులేదు.

"స్వజనబంధు సంస్థ నీ రచనలన్నీ సంపుటాలుగా వెలువరిస్తుందిటగా—ఆంధ్రజ్యోతి డెయిలీలో చూశాను-" అన్నాడు రామనాథం.

గోపాలం గుండె ఆగినట్లయింది.

"ప్రముఖ రచయిత గోపాలం రచన ముళ్ళకు ముళ్ళు మా ప్రారంభ సంచికలో చదవండి అంటూ ధృవతార అనే పత్రిక వ్రాయడం—జ్యోతి మంత్లీలో కాబోలు

చూశాను—" అన్నాడు రామనాథం.

గోపాలానికి ఏం మాట్లాడాలో తెలియలేదు.

ఇవన్నీ తన కెందుకు తెలియలేదు? తన కుత్తరాలు రాయకుండానే వీళ్ళంతా అప్పుడే ప్రకటనలు ఇచ్చేస్తున్నారా? ఇందులో ఏమీ మోసం వుండదు గదా!

"ఏమిటలా ఆశ్చర్యపోతున్నావు? ఇవేమీ నీకు తెలియవా? నీకు తెలియకుండా యెలా జరుగుతాయి? పార్టీ యివ్వాల్సొస్తుందని అంతా దాటవేస్తున్నట్లున్నావు—" అన్నాడు రామనాథం.

"అదేం కాదు....కానీ...." అన్నాడు గోపాలం.

"ఊఁ చెప్పు .... రచయితవు కదా—ఆలోచించకుండానే అబద్ధాలు చెప్పగలవు?" అన్నాడు రామనాథం.

"ఒక నిర్మాతా, ఒక పబ్లిషరూ, ఒక ఎడిటరూ నా కుత్తరాలు రాశారు. వాళ్ళకు నేను జవాబులు రాశాను. వారి నుంచి నేనేమీ వినలేదు. కానీ నువ్విలా చెబుతున్నావు...." అన్నాడు గోపాలం.

రామనాథం క్షణం ఆలోచించి—"నువ్వు చెప్పేది నిజమా?" అన్నాడు.

"నీతో అబద్ధ మెందుకు చెబుతాను?" అన్నాడు గోపాలం.

"చెప్పకూడదని ఏముందిలే కానీ—నా కొకటి అని పిస్తోంది—" అన్నాడు రామనాథం గంభీరంగా.

"త్వరగా చెప్పు!" ఆత్రుతగా అన్నాడు గోపాలం.

"నువ్వు వాళ్ళకు రాసిన ఉత్తరాలలో ఏదో పొరపాటుండి వుండాలి. ఉదాహరణకు....సినీ నిర్మాతకు నువ్వు జవాబులో ఎక్కడో ఒక్క ముక్క—నా నవలకు సినిమా హక్కులు మీవే—అని ధ్వనించేలా రాశావనుకో—అది

ఆధారంగా తీసుకుని నీకు డబ్బివ్వకుండానే ఆ నవలను స్వంతం చేసేసుకుంటాడు. కోర్టులచుట్టూ తిరిగితే పని జరుగుతుందనుకో—కానీ మనం బక్క ప్రాణులం కదా. ఏం పడతాంలే అని ఊరుకుంటాం—" అని ఆగాడు రామనాదం.

గోపాలం గుండె గుభేలుమంది. అంటే అయిదువేలూ పోయాయన్నమాటే! వచ్చినట్లేవచ్చి ఆ డబ్బు పోయిందా! ఇది తెలిస్తే తన భార్య తట్టుకోగలదా? అయినా తను ఉత్తరంలో అలాంటి పొరపాటు చేశాడా? తనకు లా అంత బాగా తెలియదు. చేశాడేమో?

"ఏమో—అలాంటి పొరపాటు జరిగిందేమో! నాకు లా అంత బాగా తెలియదు. నువ్వేమైనా సాయం చేయగలవా?" అన్నాడు గోపాలం నిస్సహాయంగా స్నేహితుడి వంక చూస్తూ.

"నాకు లా కాస్త తెలుసు. ఆ ఉత్తరాలు చూపించగలవా?" రామనాథం సాలోచనగా అడిగాడు.

"అన్నింటికీ కాపీలు తీశాను. అది ఒకందుకు మంచిదే—మా ఇంటికొస్తావా—చూపిస్తాను...."అన్నాడు గోపాలం.

మిత్రులిద్దరూ గోపాలం యిల్లు చేరారు. గోపాలం హడావుడిగా ఉత్తరాలన్నీ రామనాథానికి చూపించాడు.

రామనాథం కరస్పాండెన్స్ ఫైలంతా చూసి—"వీని మాకు పదిహేనువేలు తక్కువ అడగనని నాకు చెప్పిన గుర్తు....ఇప్పు డింతలా దిగజారి పోయా వేమిటీ?" అన్నాడు.

గోపాలం సిగ్గుతో తల వంచుకున్నాడు.

అతడికి తెలుగుదేశంలో పేరు పొందిన రచయిత(త్రు)

లంటే అసూయ. వారి రచనలు నెల నెలా పుస్తకాలుగా వస్తూంటే, అన్ని పత్రికలలోనూ కనబడుతూంటే తనూ వారి స్థాయికి ఎదగాలని ఆశిస్తూ తన మిత్ర బృందంతో ఎన్నో అబద్ధాలు చెప్పాడు.

"అయిదువేలకీ, పదివేలకీ నా నవల ఇవ్వను. చాలా మంది అడుగుతున్నారు. పదిహేనువేలైనా ఇస్తేగానీ అవ మానంగా ఉంటుంది. పదిహేను లక్షలు పెట్టి సినిమా తీసేవాడు—రచయితకో పదిహేను వేలైనా ఇవ్వలేడా? రచయితల పేరు పెంచడానికి, గౌరవం నిలపడానికి—ఇది నా ఉడతా భక్తి!"

"రెండువేలైనా యిస్తే గానీ నా పుస్తకాలు ప్రచురణ కర్తలకి యివ్వనన్నాను. నా విలువ తెలిసినవారే నా పుస్త కాలు వేస్తారు. అయిదొందలకి ఒప్పుకున్నానంటే అరవై మంది పబ్లిషర్సు కాసుక్కూర్చున్నారు...."

"కొత్త పత్రికల్లో నా కథలెందుకొస్తాయి? ముందుగా డబ్బు పంపితేనే కథ పంపుతానంటాను....అలా చేసే పత్రికలు ఏవీ తెలుగులో...."

ఇవి గోపాలం మిత్ర బృందానికి చెప్పే అబద్ధాలు.

అవన్నీ యీ రోజు రామనాథం ముందు బయట పడ్డాయి.

రామనాథం ఫైలు మూసి లేచి నిలబడి—"అరే భాయీ—వున్నమాట చెబితేనే నీ పరువు కలకాలం నిల బడుతుంది. నీ మాటలు నమ్మదగ్గవిగా తోచక స్నేహితు లంతా కలిసి నిన్నో ఆట ఆడించాం. నీ ఉత్తరాలూ, కథా అన్నీ మా దగ్గిరున్నాయి...." అన్నాడు.

గోపాలం షాక్ తిన్నాడు.

"కొంపదీసి, సితార, ఆంధ్రజ్యోతి డెయిలీ, జ్యోతి

మంత్లి చూసేవు గనుక. ఎంత శోధించినా వాటిలో ఏమీ కనబడదు. నిన్ను నువ్వు శోధించుకో—అది నీకు చాలా మేలు చేస్తుంది!" అన్నాడు రామనాథం.

"ఎంత ఘోరం? మీరు నన్ను చాలా క్రూరంగా హింసించారు...." అన్నాడు గోపాలం ఇంచుమించు ఏడుపు గొంతుకతో.

"ఏం చేయమంటావు? పారితోషికాల గురించీ, ఇతర విషయాల గురించీ ఏ యిద్దరు రచయితల మాటలూ ఒక్కలా వుండడం లేదు. స్నేహితుడివి కదా నువ్వయినా నిజం చెబుతావనుకుని ఆశించాం. నీ మాటల్లోని నిజా నిజాల్ని పరీక్షించాం. అది నీకు హింసగా అనిపిస్తే అందుకు కారణం —నీలో నిజాయితీ లేకపోవడం.... అంతే!"

రామనాథం అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

గోపాలం దిగులుగా లోనికి వెళ్ళి—"మనకింక మంచి ఉత్తరాలు లేవు. కానీ మంచిరోజులు ఈ నాటినుంచే ప్రారంభమవుతాయి—" అన్నాడు భార్యతో. □

దొంగే మేలు

"దొంగ అని తెలిసివుండీ యెందుకు పెళ్ళాడావు?" లాయర్ ప్రశ్న.

"రెండు సంబంధాలు వొచ్చినవి; ఒకరు లాయరు; రెండోవారు దొంగ. లాయర్ కన్న దొంగ నయమని తెలుసు కనుక!" ఆమె జవాబు.

ఎన్.ఆర్.నంది

దేహదహనం



అర్థరాత్రి. నగరం నిద్రపోతోంది.

ఊరికి ఒక చివరగావున్న మంగళవారప్పేట, రాత్రి తొమ్మిది కాగానే చిన్నపిల్లవాడిలా ముసుగుతన్ని చిరు కునుకు తీస్తుంది. ఆ పేటలో చాలాభాగం కూలిజనం.

అయినా అక్కడక్కడ పెద్దవాళ్ళూ, ధనవంతులు లేక పోలేదు. అయితే నిద్రమాత్రం అందరికీ తొమ్మిది పది ప్రాంతాల మధ్యలోనే వచ్చేస్తోంది.

ఆవాళ ఆదివారం. ఉదయం కాగానే ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళిపోవాలి. కాబట్టి అంతా పెందరాళే ముసుగులు బిగించారు. వాతావరణం కాస్త చల్లగా వుండటంవల్ల అందరూ తలుపులు వేసుకుని మరీ నిద్రపోతున్నారు.

ఉన్నట్టుండి ఒకమూల పెద్దగోల ప్రారంభమయింది. చుట్టుప్రక్కల యిళ్ళవాళ్ళు పడుతూలేస్తూ వీధిలోకి వచ్చేశారు. ఆడవాళ్ళూ, పిల్లలూ, ముసలాళ్ళూ భయంతో ఒకవేపుకి ఒరిగిపోతే, సాహసమున్నవాళ్ళు ముందుకి ఉరికారు.

ఒక ఆసామి యిల్లు తగలడిపోతోంది.

పక్కనేవున్న చెరువులోనించి నీళ్ళు బిందెలతో తోడి ఆర్పడానికి ప్రయత్నం సాగించారు. మరి కొందరు ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేసేందుకు పరుగెత్తారు. ఈ మధ్యలో మంటలు చుట్టుపక్కలకు ప్రాకకుండా వుండేందుకు, యువకులు చేతికి అందినవాటితో మంటల్ని అదుపులోకి తీసుకురా ప్రయత్నం చేస్తున్నారు.

ఫైర్ ఇంజన్లు వచ్చేసరికి చుట్టూ నాలుగైదు యిళ్ళు నేలమట్టమైపోయాయి. వాళ్లు గోచీలు బిగించి, కాస్సేపు డ్రిల్లూగట్రాచేసి, విజిల్సూ విన్యాసాలుచేసి మోటర్ స్టార్టు చేసేలోపున మరో పదిళ్ళు పరశురామప్రీతి అయ్యాయి.

జనసష్టంలేదు. ఆస్తినష్టం అంచనా వేయబడుతోంది.

2

అలవాటు ప్రకారం మంగళవారప్పేట ప్రజలు సోమవారం రాత్రి కూడా తొమ్మిది గంటలకే నిద్రపోయారు. క్రితం రాత్రి జరిగిన గృహదహనం విషయం కాసేపు కొందరు చర్చించుకుని, ఇల్లుకాలిన అభాగ్యులమీద కొంత సానుభూతి కనబరచి—మామూలుగానే నిద్రలుపోయారు.

నిన్నరాత్రి యిల్లుకాలిన అభాగ్యులకి ఈవాళ నిలువ నీడలేదు. కొందరు దయాపరులు యిచ్చిన అరుగులమీద, మునిసిపాలిటీవారు అనవాయితీ ప్రకారం చూపించిన ఆశ్రమాలలోనూ నిద్రపోయారు. కాని ఒకళ్ళిద్దరికి మాత్రం కొంత ఉడుకుమోత్తనం రాకపోలేదు. తాము యిళ్ళు కాలిపోయి, నానాబాధలూ పడుతూ వుంటే, మిగతా పేటజనం యావత్తూ నిమ్మకు నీరెత్తినట్టు నిద్రపోవడం వాళ్ళకు కన్నుకుట్టినట్టనిపించి బాధపడింది. వాళ్ళకి కూడా అలాంటి శాస్తి, జరిగితే తప్ప, లేనిచో వాళ్ళకి అర్థంకాదని—వాళ్ళు లోలోపల కసెక్కిపోయారు.

ఇంతలోనే, పేటలో మరోవేపునించి కోలాహలం వినిపించింది. పడుకున్న జనం కంగారు కంగారుగా లేచేసరికి, పేట చివరి వీధిలో పెద్ద పెద్ద మంటలు కనిపించాయి.

జనం ఆ వీధికి ఎగబడ్డారు.

మళ్ళా నిన్నటి మాదిరిగానే ఏడ్పులు, పెడబొబ్బలు, గోల, సాహసవంతుల సాహసాలూ, ఫైరింజన్ స్టాఫ్ పెరేడ్, యీ మధ్యలో పది యిళ్ళు అగ్నిపాలు కావటం—

కాని జననష్టం లేదు. ఆస్థి నష్టం తెలీదు.

అంచనా వేయబడుతోంది.

ఇది యిలా వుండగా బుధవారం ఉదయం తెలుగు దిన పత్రికల్లో యీ క్రింది పతాక శీర్షికతో ప్రచురింపబడింది—

"మంగళవారప్పేటంతా మంగళవారం కూడా గృహ దహనం!

—దాదాపు పాతిక యిళ్ళవరకూ దగ్ధం, జననష్టం లేదు. నిరాశ్రయులైన ప్రజలకు ప్రభుత్వం, ప్రతిపక్షం వారుకూడా చేతనైనంత సహాయం—

ఇటీవల రెండుదినాలుగా మంగళవారప్పేటలో యిళ్ళు కాలడం ఒక పరిపాటి అయి, ఈ మూడవరోజు మంగళ వారం రాత్రి కూడా పూరిళ్లూ, పెద్ద అంగళ్ళు కూడా కాలి పోయినవి. ఇటువంటి ఘోరం రోజూ సరిగ్గా అర్ధరాత్రి జరగడమే విచిత్రంగా వుంది.

నిన్న రాత్రి కాలిపోయిన యిళ్ళల్లో, గౌరవనీయులగు మంత్రిగారి రెండవ అల్లుడుగారి,మూడవబావమరది కొడుకు, కో—ఆపరేటివ్ బంగళా వుండటం కూడా ఒక విషయం. మంత్రిగారి బంధువుల యిల్లు కాలిపోయిన కారణంగా, ఒక విచారణ కమిటికూడా వేయబడింది. దీనికి ప్రతిపక్షం వారు అభ్యంతరం చెప్పి, పాల్‌చౌక్‌లో నిన్న మీటింగ్ పెట్టినపుడు, గలాభా జరిగి పోలీసువారు చర్య తీసుకున్న కారణంగా ముగ్గురు మరణించారు! ముప్ఫైమంది గాయ పడ్డారు."

పత్రికలో పడ్డ వార్తకి రాజకీయ నాయకులు చాలా అందంగా రియాక్టయి విధానసభలో భరతనాట్యాలు మొదలు పెట్టడం మన కిక్కడ అప్రస్తుతం; కాని పోలీసు శాఖ వారికి మాత్రం మంచి పని పడింది.

రోజూ యిలా అర్ధరాత్రపుడు యిళ్ళు కాలడం వారికొక

అభేద్యమయిన సమస్యగా వుండటంవల్ల, ఆవాళనించి మంగళవారప్పేటలో సాయంకాలం ఆరునించి, ఉదయం ఆరువరకూ మంచి బందోబస్తు చేయాలని నిశ్చయించి, సాయంకాలం అయిదింటికే రెండు పోలీస్ వేన్‌లను పంపించారు. మొత్తం నలభై మంది పోలీసు జవాన్లు వీధి కొాకరు కాపలాకాసారు.

ఇంత బందోబస్తు చూసి విస్తుపోయిన ఆ పేట ప్రజలు రాత్రి పదవగానే మామూలుగానే నిద్రపోయారు. ఈవాళ యిక భయముండదని అందరూ అనుకున్నారు. బహుశః యిక యెప్పుడూ యిలాంటి అఘాయిత్యం జరగదని నిశ్చింతగా నిద్రపోయారు.

సరిగ్గా రాత్రి పన్నెండింటికి మంగళవారప్పేట మధ్య వీధిలో జగ్గన్నగారి కొంప భగ్గుమంది.

మనుష్యులంతా లేచారు.

అంతా మామూలు తంతే.

అయితే, యింత పోలీసుకాపలా వుండి కూడా ఇలాంటి అఘాయిత్యం జరగడం డిఎస్పీగారికి వళ్ళు మండి, ఆ సర్కిల్‌కి వుండే ఇన్‌స్పెక్టర్ని తక్షణం బదిలీ చేసేసి, మరొక ఇన్‌స్పెక్టర్ని తీసుకొని అక్కడ పోస్ట్‌చేశాడు.

ఈ ఇన్‌స్పెక్టర్ మహా అఖండుడని ప్రతీతి. ప్రజలు తాగితే ఏం అనడుగాని, రాజకీయ నాయకులు తాగితే వెంటనే పట్టేసి, పొట్టలోది కక్కించి, కెమికల్ ఎగ్జామినేషన్‌కి పంపించి. తాగాడని ఋజువుచేసి, వాళ్ళ బ్రతుకుల్ని వీధిలోకి లాగేవాడు.

అలాంటి అఖండుడి చేతిలో యిలాంటిది పెడితే— ఒక క్షణంలో అసలు మూలం తెలిసిపోతుందని డిఎస్పి

గారి అభిప్రాయం.

ఈ కొత్త ఇన్స్పెక్టర్‌గారి పేరు పులిరాజు. ఆయన కేసుని చేతిలోకి తీసుకోగానే విచారణ మొదలుపెట్టాడు.

మొత్తం ఈ నాలుగు దినాల్లో ఎనభై యిళ్ళవరకూ నేలమట్టమయ్యాయి.

సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటలకే గృహదహన కాండ మొదలవుతోంది.

ఆ సమయంలో ఆ చుట్టుపక్కల నరసంచారం వుండదు. ఆ యిళ్ళల్లో కూడా కిరోసిన్ దీపాలుగాని, ఆర్పకుండా వుంచేసిన నిప్పురవ్వలుగాని వుండటంలేదు.

అయితే, మరెలా ఇది జరుగుతోంది?

పులిరాజు మళ్ళీ పగలు పేటనంతనీ గాలించాడు. అసలు ఎవరూ పొయ్యిలే వెలిగించవద్దని ఆర్డరు చేయాలనుకున్నాడు. కాని తిళ్ళులేక ఛస్తారని, భోజనాలు వండేశాక నిప్పులు ఆర్పెయ్యాలనిన్నీ, కిరసనాయిల్ దీపాలూ గట్రా రాత్రుళ్ళు వెలిగించి వుంచకూడదనిన్నీ, రాత్రి ఆరునించి ప్రొద్దుట ఆరింటివరకూ కర్ఫ్యూ విధించి వుంటుంది గాబట్టి, ప్రజలెవరూ బయట తిరగకూడదనిన్నీ ఫర్మానా జారీచేశాడు.

ఆవాళ సాయంకాలం ఆరింటికే పులిరాజు మంగళవారప్పేటకు వచ్చేశాడు. తనే స్వయంగా వీధులన్నీ తిరిగి చూశాడు. అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదు.

ఎందుకైనా మంచిదని ఫైర్ ఇంజనులను కూడా రెండింటిని అందుబాటులోనే వుంచుకున్నాడు. జవాన్లందరికీ మెలకువగా వుండమని, తను కాలినడకనే వీధుల్లో మెల్లగా తిరుగుతున్నాడు.

సరిగ్గా పన్నెండు అయింది. పులిరాజు అందరికీ హెచ్చరికలు చేశాడు. తను మెల్లగా జగన్నాథ రెడ్డిగారి వీధిలో పచార్లు ప్రారంభించాడు.

పన్నెండు గంటల ఒక నిమిషం అయింది.

జగన్నాథ రెడ్డిగారి బంగళా పైభాగాన దీపం వెలిగింది. అది ఎలక్ట్రిక్ లైటో కిరోసిన్ దీపమో తెలీలేదు. వెలుతురు చుట్టూ వ్యాగుతున్నట్టు అనిపించింది.

పులిరాజు పైకి చూసి, విజిల్‌వేసి ఆ దీపం వేసిన మనిషిని పిలవడానికని ఒక అడుగు ముందుకు వేసేసరికి, రెడ్డిగారి బంగళా గేటుముందు, ఒక పెద్ద తారాజువ్వలాంటి వస్తువు దేదీప్యమానంగా వెలిగి, శబ్దం లేకుండా బంగళా మీదికి ఒక లిప్తలోకెళ్ళి పడింది.

అంతే!

వెంటనే బంగళా ఒక్క క్షణంలో భగ్గుమంది.

3

"అదేవిటో సరిగా చెప్పలేను" అన్నాడు పులిరాజు— డి.ఎస్.పి. దగ్గర తను రాత్రి చూసిన విచిత్రాన్ని అభి వర్ణించి చెబుతూ.

డి.ఎస్.పి. కి ఇది అభూత కల్పనలా అనిపించింది. తనను తాను రక్షించుకునేందుకు పులిరాజు విచిత్రమైన యిలాంటి కథ అల్లుకొచ్చాడేమో అనుకున్నాడు.

"అదేవిటో వూహించి చెప్పగలవా?"

"చెప్పలేను సార్!"

"తారాజువ్వ ఎవరన్నా విడిచిపెట్టారంటావా?"

"లేదు సార్! అది తారాజువ్వలా లేదు. నా ఎదురు గానే నేలమీది నుంచి ఆకాశంలోకి ఎగిరింది. శబ్దం లేదు. అదీగాక ఆ చుట్టుపక్కల మేము తప్ప మరొకరెవరూ

లేరు."

పులిరాజు శాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

కాసేపు డి.ఎస్.పి. తీవ్రంగా ఆలోచించాడు. తదుపరి ఏమనుకున్నాడో జీప్ తీసుకుని మంగళవారప్పేట బయలు దేరాడు.

రాత్రి కాలిపోయిన రెడ్డిగారి ఇంటి దగ్గరకు వెళ్ళాడు. బంగళా పూర్తిగా కాలిపోయింది. కాని జననష్టం ప్రస్తుతానికి ఏం లేదు.

డి.ఎస్.పి. తీవ్రంగా ఆలోచించాడు. రోజూ యిలా యిండ్లు కాలడంలో వెనక ఒక పెద్ద గూడుపుఠాణీ వుందేమో! నిజానికి ఈ గృహదహనాలు ఇక్కడ జరగడం మరోచోట ఏదైనా పెద్ద ఎత్తు వేసేందుకు జరిగే ప్రణాళికేమో!

కాని, మంగళవారప్పేట అంతా గాలించి వెదికినా, ఎవరూ కోటీశ్వరులు గానీ, శ్రీమంతులుగానీ లేరు. చుట్టు పక్కల పెద్ద ఫ్యాక్టరీలు గట్రాలేవు. వున్న రెండు గిడ్డంగులు ఇన్‌ష్యూర్ చేయబడినవి కావు. అందువల్ల ఈ గృహదహనాలు డబ్బుకి ఆశించి జరుగుతున్నది కాదేమో అనుకున్నాడు డి.ఎస్.పి.

పులిరాజు వచ్చాడు.

"ఆ తారాజువ్వలాంటి వస్తువు—ఇదిగో, ఈ గేటు దగ్గరనుంచే ఎగిరింది సార్" అన్నాడు.

డి.ఎస్.పి. వంగి చూశాడు.

ఎంతో జాగ్రత్తగా చూస్తే ఒక అరంగుళం వ్యాసంలో గుండ్రని నల్లగా కాలిన మచ్చ కనిపించింది. బహుశః ఆ తారాజువ్వలాంటిది ఒక గోళీకాయలాంటిదేమో? అది అక్కడ ముందునించే వుందో, లేక ఎవరన్నా కావాలని

వెలిగించి పారేశారో! అలా కాలి ఎగిరి బంగళామీద పడిన గోళం, ఆ అగ్నిలో మసైపోయి వుండొచ్చు. అందువల్ల ఆ గోళం దొరుకుతుందనే ఆశ వుండదు.

అసలు ఇన్‌స్పెక్టర్ చెప్పినది నిజమో, కాదో!

రోజూ, ఈ పేటలో, సరిగ్గా రాత్రి పన్నెండు, పన్నెండుంబావు లోపునే గృహదహనాలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈవాళకూడా జరిగితే. రాత్రి పన్నెండింటికే జరగాలి. ఈ రాత్రి పేటలో అంతా జాగ్రత్తగా వుంటే, ఆ ఎగిరి వస్తున్న దేమిటో ఇట్టే తెలిపోవచ్చు.

డి. ఎస్. పి. పోలీసువారికి ప్రత్యేకమైన ఆర్డర్లు పంపించాడు. పగలుకూడా పేటలో పోలీసు కాపలా పెట్టాడు.

చీకటి పడేకొద్దీ పోలీసువారికి కూడా భయం పట్టుకుంది. ఇల్లు కాలడమంటే భయంలేదు; కాని—అదేదో తారాజువ్వ అంటూ వుంటే, వాళ్ళకి వళ్ళు కంపర మెత్తిపోతోంది. అయినా ఉద్యోగ ధర్మంగా నిలబడక తప్పలేదు.

డి. ఎస్. పి. స్వయంగా రాత్రి నిలబడ్డాడు. వీధికి డజనుమంది చొప్పున పోలీసు జవాన్లను నిలబెట్టి-ఎక్కడ వాళ్ళకి తారాజువ్వలాంటి వస్తువు కనిపించినా వెంటనే విజిల్స్ వేయమని చెప్పాడు.

అందరూ ఆత్రంగా కాపాలాకాసారు. పన్నెండు గంటలు సమీపించే కొద్దీ వాళ్ళల్లో భయం ప్రారంభ మయింది.

మంగళవారప్పేట రెండవ వీధిలో వెంకటాచలంగారి యింటిముందు ఒక జవాన్ నిలబడి వున్నాడు. పన్నెండు గంటలు కొట్టగానే, ఎందుకో ఆ ఇంటిముందే తారాజువ్వ కనిపిస్తుందని అతనికి అనిపించింది. నిన్నటి తారాజువ్వ

సరిగ్గా గేటుముందరే కనిపించిందట. అందువల్ల అక్కడ వుండటం ప్రమాదమని, పన్నెండు కొట్టగానే గేటుకి ఇరవై అడుగుల దూరంలోవున్న ఒక పొదమాటున నిలబడ్డాడు.

చుట్టూ పిచ్చిచూపులు చూశాడు. మనిషిలాంటి వాడెవడన్నా అటువేపు వస్తున్నాడేమోనని పరికించి చూశాడు. ఒక ప్రాణికూడా కదులుతున్నట్టులేదు.

సరిగ్గా పన్నెండూ అయిదు నిమిషాలు అయింది. జవాన్ పొదలమాటునుంచి దెయ్యంలా చూస్తూవున్నాడు. ఏం కనిపించలేదు. అంతలో వీధి చివర్లో శబ్దమైంది. మెల్లగా జవాన్ పొదలచాటునించి వచ్చి చూశాడు. డి.ఎస్.పి. రావడం చూసి చప్పున గేటు దగ్గర వచ్చి నిలబడ్డాడు.

అతను ఇలా నిలబడటం, నేలమీదినించి ఒక తారాజువ్వలాంటిది ఆకాశంలోకి ఎగరటం ఒకేసారి జరిగాయి. కాని ఆ తారాజువ్వ నిలువుగా పైకి ఎగరకుండా ఏటవాలుగా ఎగరటంవల్ల, జవాన్‌కి తగిలి అతని గుండెల్ని చీల్చుకుంటూ పోయింది. కాని అది ఎంతో ఎత్తు ఎగరకుండానే కింద పడిపోయింది.

జవాన్ పెద్ద కేకవేసి నేల కూలిపోయాడు. ఒక్క క్షణంలో అతని శరీరమంతా కాలిపోయి వికృతంగా తయారై పోయింది.

డి.ఎస్.పి. ఇదంతా స్వయంగా చూసి నిలువెల్లా వణికిపోయాడు. కాని ఉద్యోగ ధర్మం తప్పదు. జవాన్‌ని హాస్పిటల్‌కి చేర్పించమని చెప్పి, దూరంగా పడిపోయిన తారాజువ్వవేపు పరుగుతీశాడు.

తారాజువ్వలాంటి వస్తువు ఒక అగ్నిగోళం లాంటిది. రెండంగుళాల వ్యాసంగల గోళం. అది ఇంకా ఎర్రగా

కాలుతూనే వుంది. వెంటనే ఫైర్ ఇంజన్లను పిలిచి ఆ గోళంమీద నీళ్ళు కుమ్మరించాడు.

అయిదు నిమిషాలకు ఆ గోళం చల్లబడింది. దానిని డి.ఎస్.పి. ఎత్తి చూశారు. ఆశ్చర్యంగా వుంది. బంగారు ఛాయలో తేలికగా వుంది. దానిని అతి జాగ్రత్తగా రుమాలుతో పడతపెట్టి లేబొరేటరీకి పంపించాడు.

4

"ఈ లోహమేదో చాలా విచిత్రంగా వుంది" అన్నాడు డాక్టర్ జ్ఞానానందం గోళాన్ని బాగా పరీక్ష చేశాక। డి.ఎస్.పి. గోళంవేపు చూశాడు.

"ఇది వేడిచేస్తే వేడెక్కడంలేదు. మంచులో పెడితే చల్లబడటం లేదు. దాని ఉష్ణోగ్రత యిప్పుడు 30 డిగ్రీలు సెంటీగ్రేడ్."

"ఇదిక్కడికి ఎలా వచ్చిందంటారు?"

"చెప్పలేను."

"పోనీ లోహం భూలోనికి సంబంధించినదేనంటారా?"

"కావచ్చు, కాకపోవచ్చు. దీన్ని ఎలాక్ట్రాన్ మైక్రోస్కోప్‌లో చూస్తే కొత్తలోహంలా కనిపించింది."

"సరిగ్గా రాత్రి పన్నెండింటికి తారాజువ్వలా పైకి ఎగరటంతో ఏదన్నా అర్థముందంటారా?"

"వుండొచ్చు. నాకొక అనుమానం కలుగుతోంది. ఇదీ టైమ్ బాంబ్‌లా కొన్ని గంటల తర్వాత కాలి ఆకాశంలోకి ఎగరనన్నావచ్చు; లేదా సరిగ్గా పన్నెండు గంటలకు భూ

భ్రమణంవల్ల ఆ విధంగా కాలి పగురుతూ వుండనన్నా వచ్చు. మొదటిది నిజమైతే—దీని వెనక మనిషి ప్రమేయం తప్పకుండా వుండాలి. రెండోది నిజమైతే ప్రకృతివల్ల అది జరుగుతూ వుండాలి.

మనిషే అయితే—ఇలా గృహదహనాలు చేయడంలో వచ్చే లాభాలు, ధ్యేయాలు గురించి ఆలోచించాలి. మనిషి దొరికితే అతను గొప్ప శాస్త్రజ్ఞుడే అయివుండాలి. ప్రకృతి వల్ల అది జరిగితే కారణాలు అన్వేషించడానికి ప్రభుత్వమే పూనుకోవాలి'' అని ముగించాడు.

డి.ఎస్.సి. ప్రభుత్వానికి వివరాలు రాస్తూ, పెద్ద రిపోర్ట్ తయారుచేశారు.

కాని ఆవేళ రాత్రికూడా మంగళవారప్పేటలో ఇళ్ళు తగలబడ్డాయి—విచిత్రమైన తారాజువ్వ వలననే.

ఆవాళ మాత్రమే కాదు. ఆ ఎనిమిది దినాలు అలానే తగలబడ్డాయి.

మంగళవారప్పేట ప్రజలంతా—పేట ఖాళీచేసి వెళ్ళిపోయారు.

పత్రికలు-పోలీసుశాఖనీ, అధికారులనీ దుమ్మెత్తనారంభించాయి. ఊరు వూరంతా గగ్గోలెత్తిపోయింది ప్రజలు ప్రాణాలరచేత పెట్టుకుని బ్రతకనారంభించారు.

డాక్టర్ జ్ఞానానంద యీ ఎనిమిది దినాలు దొరికిన గోళాలతో నిర్విరామంగా పరిశోధనలు జరిపాడు.

గోళాల్లో ఉపయోగించిన లోహం భాస్వరమే! కాని అందులో మరొక లోహాన్నిదేన్నో జతచేసి తమాషాగా గోళంగా తయారుచేశారు. అది అయస్కాంతాన్ని ఆకర్షిస్తోంది. అర్ధరాత్రి భగ్గున కాలుతోంది. అందువల్ల అది

ఆ ప్రాంతాల్లో యెక్కడ వుందో కనిపెట్ట గలిగితే, దాన్ని యెవరు అక్కడ పడేస్తున్నారో యిట్టే తెలుసుకోవచ్చుగా?

డాక్టర్ జ్ఞానానంద మంగళవారప్పేట వీధి వీధినా కాల్వల్లో కొన్ని అయస్కాంతపు ముక్కల్ని పడేసి అన్నిటినీ తీగలతో కలిపాడు. తీగల్లో తక్కువ విద్యుత్తును ప్రవహింపజేసి మెయిన్ వైర్లను తన లేబరేటరీలో డిటెక్టర్‌కి బిగించాడు.

అగ్నిగోళం నేలమీద వేసిన వెంటనే మండిపోదు. అది నేలమీద పడినవెంటనే కాల్వల్లో వున్న అయస్కాంతాలకు కొంత ఆకర్షణ ఏర్పడుతుంది. దాని ఆకర్షణశక్తికి మించిన ఆకర్షణ దానికి తగలడంతో, డాక్టర్ పరిశోధన గృహంలో వున్న డిటెక్టర్ ముల్లు మైనస్‌కి తిరుగుతుంది. అది ఏ ప్రాంతంలో వున్న అయస్కాంతానికి తగిలిందో లెక్కకట్టి చూస్తే, ఆ ప్రాంతాల్లో-అది పడేసిన వ్యక్తి ఇట్టే దొరికిపోతాడు.

ఇదీ జ్ఞానానంద ఉచ్చు. దీనికి తగినట్టు పోలీసులను చుట్టూ చెట్లలోనూ ఆక్కడా దాక్కొనమని చెప్పాడు. అందరి దగ్గరా వైర్లెస్ సెట్లున్నాయి. యెవరి సెట్లోనైతే సిగ్నల్ వినిపిస్తుందో, ఆ సమయంలో ఆ వీధిలో యెవరున్నా అరెస్టుచేసి తీసుకరావలసిందని ఆర్డర్లు జారీ చేశాడు.

5

మధ్యాహ్నం సరిగ్గా పన్నెండయింది.

మఫ్టీలోవున్న పోలీసులు చెట్లమీదా, ఇళ్ళ సందుల్లోనూ దాక్కొని వున్నారు. ఎవరికి వారే జాగ్రత్తగా చూస్తున్నారు.

వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. కాలిపోయిన యిళ్ళు అక్కడక్కడ భయంకరంగా కనిపిస్తున్నాయి.

సరిగ్గా పన్నెండు గంటలకు 'అడుసుమిల్లివారి వీధి'లో నించి పోలీస్ జవాన్ వస్తున్నాడు. అతను గబగబ మెయిన్ రోడ్డువేపు నడుస్తున్నాడు.

ఆ వీధిలోనే చెట్టుమీద కూచున్న ఇన్‌స్పెక్టర్-జవాన్ యిప్పుడెందుకు వస్తున్నాడా అని ఆశ్చర్యపోయాడు. ఏదన్నా అర్జెంటు మెసేజ్ తెస్తున్నాడేమో అన్న అనుమానంతో కిందికిదిగి కేకవెయ్యబోయాడు.

అంతలో అతని జేబులోవున్న వైర్లెస్ రియాక్టర్ 'సిగ్నల్' యిచ్చింది. ఇన్‌స్పెక్టర్ వెంటనే ట్యూన్ చేశాడు.

అవతల నుంచి డాక్టర్ జ్ఞానానంద గొంతుక వినిపించింది.

"ఎవరు మాట్లాడేది?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"డాక్టర్ జ్ఞానానందం....మీ చుట్టుపక్కల యెవరన్నా మనుషులు కనిపించారా?"

"ఎస్ డాక్టర్, ఒక పోలీస్‌జవాన్,"

"అరెస్ట్ చెయ్యండి అతన్ని."

ఇన్‌స్పెక్టర్ పోలీస్ జవాన్ యెదురుగా నడిచి వెళ్ళాడు. దగ్గరకు రాగానే అతనిమీద పడి చేతులు వెనక్కు విరిచి, హేండ్‌కఫ్స్ తగిలించాడు.

అతని జేబులు తడిమిచూస్తే నల్లని ఆకారంలో ఒక గోళం కనిపించింది.

జవాన్ వేషంలోవున్న మనిషిని డాక్టర్ జ్ఞానానంద, డి.ఎస్.పి. ఎంత అడిగినా ఏం చెప్పలేదు.

అతను బాగా చదువుకున్నవాడని అతని ముఖం చూస్తేనే తెలుస్తోంది. అందువల్ల అతన్ని దండించి ప్రయోజనం లేదని, మాటలలోనే కూపీ లాగబోయాడు! అతనేం సమాధానం చెప్పలేదు. సరిగ్గా రాత్రి పదకొండు అవుతూ వుండగా అతను మొట్టమొదటిసారిగా నోరు విప్పాడు!

"ఇంక టైం ఎంతో లేదు. చెప్తాను వినండి" అన్నాడు.

అందరూ సావధానంగా వింటున్నారు.

"నా పేరుతో మీకేం పనిలేదు. చెప్పడంవల్ల ప్రయోజనం కూడా లేదు. నేనే ఈ యిళ్ళనన్నింటిని దహనం చేశాను. ఎందుకు చేశానో చెప్పలేను. కాని ఏదో ఒక వెధవపని చేసి సంతోషించాలనే మనస్తత్వంతో యిలాంటి అఘాయిత్యాలకు పూనుకున్నాను.

నేనొక శాస్త్రజ్ఞుణ్ణి. రెండేళ్ళ క్రితం ఒక విచిత్రమైన లోహాన్ని కనిపెట్టాను.

ఆ లోహం గుణాలేమిటో, దాని ఉపయోగాలు ఏమిటో తెలియకుండానే అది నా లేబరేటరీలోనే మాయమైపోయేది. ప్రొద్దుటంతా కష్టపడి సాయంకాలానికి చీమ తలకాయంత లోహాన్ని తయారుచేస్తే, అది ఉదయానికల్లా మాయమైపోయేది.

నాకు ఆశ్చర్యమేసింది. అక్కడ అంతా వెతికితే కాస్త కాలినట్టు నల్లగా అగుపించేది. అందువల్ల ఒకనాటి రాత్రి అది ఏమవుతుందో అని మెలుకువగా వున్నాను.

సరిగ్గా పన్నెండు అయేసరికి టేబిల్‌మీద శోధననాళికలో పెట్టిన లోహం కాస్త ఎత్తుకి ఎగిరినట్టు, అది దేదీప్యమానంగా వెలిగినట్టు గుర్తించాను. దగ్గరగా వెళ్ళి చూసేసరికి అది నిజంగానే కాలిపోయింది. కాని కాలిన లోహం

మాత్రం పైకి ఎగిరిపోయేది.

నేను మర్నాడు కూడా అది తయారుచేసి, రాత్రంతా మెలకువగా వుండి చూశాను. మళ్ళీ రాత్రి పన్నెండు గంటలకు అది కాలిపోయి, ఆకాశంలోకి ఎగిరిపోయింది.

నాకొక మంచి భావం కలిగింది. దీనిని పెద్దమొత్తాల్లో తయారుచేసి, మందుగుండు సామగ్రిలో ఉపయోగిస్తే దేశరక్షణకు పనికివస్తుందని అనుకున్నాను. కాని, తయారు చేయడానికి నా దగ్గర డబ్బులేదు.

నా పరిశోధన వివరాలు, దానిని వినియోగించే పద్ధతి— అంతా ప్రభుత్వానికి తెలియపరచాలనుకున్నాను. కాని సరాసరి ప్రభుత్వం దగ్గరకే పోవడానికి భయం వేసింది. స్థానిక ఎం.ఎల్ ఏ.గారి దగ్గరకు వెళ్ళి విషయాలు వివరంగా చెప్పాను.

ఆయన నా పరిశోధనలు మెచ్చుకోనూలేదు. తిరస్కరించనూలేదు. ఒక ప్రతిపాదన మాత్రం చేశాడు.

ఆ ప్రయోగం కాపీరైట్ తనకి అమ్మేయ్యమన్నాడు. అందుకు నేను ఒప్పుకోలేదు. తర్వాత కొంత డబ్బు ఆశ చూపించాడు. దానికీ నేను సమ్మతించకపోవడంతో నన్ను బెదిరించాడు.

నేనాయన బెదిరింపులకు జడిసిపోలేదు. తిన్నగా ప్రభుత్వానికే ప్రయోగ వివరాలు చెబుతానన్నాను. దాంతో ఆయన రెచ్చిపోయి నా యింటికి ఒకనాడు కొందరు రౌడీలతో వచ్చి బెదిరించాడు.

అంతవరకూ నిశ్శబ్దంగా వింటున్న డి. ఎస్. పి. అన్నాడు:

"ఆ ప్రయోగాల రహస్యం ఆయనకు తెలియదు కదా - ఒకవేళ మీ దగ్గర నుంచి ఎమ్మెల్యేగారు ఆ ప్రయోగాన్ని

కొనేస్తే ఆయనకొచ్చే లాభమేమిటి?"

అతను చిరునవ్వు నవ్వాడు.

"అది ముమ్ముందు మిలటరీకి ఎంత ఉపయోగపడుతుందో ఆయనకు తెలుసు. ఆ రహస్యం నా దగ్గర్నుంచి కొనేసి, దానిని ప్రభుత్వానికి ఏకమొత్తంగా కొన్ని కోట్లకు అమ్ముకొని, ఒక ఫ్యాక్టరీ తన అధీనంలోనే కట్టించుకోవాలని అతని భావం.

ఆ భావం కనిపెట్టి నేను తిరస్కరించడంతో ఆవేళ రాత్రి నా ప్రయోగశాలమీద పడి నా ప్రయోగాల నన్నింటినీ దగ్ధంచేసి, నన్ను కాళ్ళూచేతులు కట్టి పారేసి, ఇంటికి నిప్పంటించి పారిపోయాడు. ఈ చర్యలో ఆ ఊరి పెద్ద లందరికీ కొద్దో గొప్పో ప్రమేయం వుండనే వుంది.

ఇల్లు కాలిపోతోంది. నేను బలవంతంమీద చేతులకూ కాళ్ళకూ కట్టిన కట్లు విప్పుకొని బయటపడ్డాను. నా లేబరేటరీ అంతా దగ్ధమై, భస్మీపటలమైపోయింది. పిచ్చెత్తినట్టు యేడ్చాను.

మర్నాడు వూళ్ళోకి వెళ్ళి ఎమ్మెల్యేగారు చేసిన క్రూర కృత్యాన్ని వీధి వీధినా చెప్పి ఏడ్చాను.

కాని నా గోడు ఎవరూ వినిపించుకోలేదు సరిగదా, పిచ్చివాడిగా జమకట్టి రాళ్ళు రువ్వి బాదారు. ఆ ఎమ్మెల్యే గారు ఆ వూరికి ఓ మహారాజులాంటివాడు. అతను యెంత చెబితే ప్రజలు అంత. అతని మీద ఈగను కూడా వాల నివ్వరట.

నాకు నిజంగానే పిచ్చెత్తింది. పారిపోయాను. దూరంగా పారిపోయాను. మరో వూళ్ళో ఒక కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. ఇది ఐదేళ్ళ క్రితం జరిగిన విషయం.

ఈ ఐదేళ్ళూ మళ్ళీ నా ప్రయోగాలు జరిపాను. మళ్ళీ

కొత్తలోహాన్ని కనుక్కోగలిగాను. లోహాన్ని కనుక్కొన్నాక నాలో ప్రతీకారవాంఛ బయలుదేరింది.

నన్ను సర్వనాశనం చేసిన ఆ ఎమ్మెల్యేమీదా, వాడి మాటను శిలాక్షరంగా భావించి నన్ను పిచ్చివాడిగా జమ చేసిన ప్రజలమీదా కసి తీర్చుకోవాలనుకున్నాను.

ప్రయివేట్లు చెప్పి. జీతండబ్బు జాగ్రత్తగా వుంచి, చాలా డబ్బు కూడబెట్టాను. నా అదృష్టవశాత్తు రెండు లక్షల లాటరీ కూడా వచ్చింది. ఈ డబ్బు అంతటితో పెద్ద మొత్తంగా ప్రయోగాలు మొదలుపెట్టి, రోజూ ఒక వంద గ్రాముల లోహాన్ని తయారుచేయ మొదలుపెట్టాను.

ఈ లోహం రాత్రి పన్నెండు గంటలకల్లా ఆకాశంలోకి ఎగుర్తూ భగ్గున మండిపోతుంది. నా సర్వస్వాన్ని నాశనం చేసిన ఆ రాక్షసుడిమీదా—అతనిమీద వివరాలు చెప్పినా చర్య తీసుకోని ప్రజలమీద కసి తీర్చుకోవాలనిపించింది. ఆ మధ్యాహ్నమే వెళ్ళి ఒక ఇంటిముందు లోహాన్ని పారేశాను. సరిగ్గా రాత్రి పన్నెండు గంటలకు అది పైకి ఎగిరి ఇళ్ళని కాల్చేసింది.

నా పథకం పారిందనుకున్నాను. అలానే రోజూ మధ్యాహ్నం వెళ్ళి ఒక యింటిముందు లోహపుగుండుని పారేసేవాడిని. ఈవాళ పగలు కూడా మఫ్టిలో పోలీసులు ఉన్నారని తెలిసింది. పోలీసు వేషం వేసుకుని బయలుదేరాను.

నా కసి చల్లారింది. ఆ రాక్షసుడి ఇల్లు కూడా మొన్న కాలిపోయింది. నేను గృహదహనాలు చేసి ప్రజల్ని ఏడిపించానేగాని, జనహాని మాత్రం చెయ్యలేదు. ఇప్పుడు నాకే శిక్ష మీరు విధించినా సరే," అని ముగించి, కుప్పలా కూలిపోయాడు!

(పదహారేళ్ళనాటి 'అపన' కథ)

పునాది ఎముకలు

ఇమంది రామారావు

"వద్దని చెప్తే మీరు విన్నారా? ఈ రోజుల్లో ఆడపిల్లకి పెళ్ళిచేయడం, అరడజను ఉద్యోగాలు సంపాదించడం తేలికయిందేమో గాని, ఇల్లు కట్టడం అంటే మాటలా! సిమెంట్ దొరకడమంటే మాటలా! యజ్ఞం.... యజ్ఞం చేసినంత పనండీ!" హేమ నొచ్చుకుంది.

హరీష్ చిన్నగా నవ్వాడు.

హరీష్ పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోటయి త్వరలో మద్రాసు వెళ్ళబోతున్నాడు.

ముందు ముందు విశాఖపట్నం బాగా డెవలప్‌మెంట్ అవ్వాలపిన ఏరియా కదా అని ఓ పది సెంట్ల స్థలం మధుర వాడ దగ్గర కొని, చిన్న ప్లాట్స్‌లా కట్టి, అద్దెకివ్వాలని నిర్ణయించుకున్నాడు. నిర్మాణదశ ప్రారంభమయినా ఇప్పటి వరకు సిమెంట్ దొరకలేదు. అందుకే శ్రీమతి సాధింపు.

కూలీలు పునాదులు తవ్వుతున్నారు.

'కెవ్వు' మని కేక వేసి హేమ వెనక్కి పడిపోయింది. పలుగు పక్కన పడింది.

హరీష్ కంగారుగా లేచాడు. దగ్గరికెళ్ళి చూస్తే పునాదికి తవ్వుతున్న గోతిలో పెల్విక్ బోన్‌తో మరికొన్ని బోన్సు కనిపించాయి.

"హేమా!" మొహంమీద, వాటర్ బేగ్‌లో నీళ్ళుతీసి చల్లాడు.

కూలీలంతా గుమికూడారు.

హేమ కళ్ళుతెరిచి చూసింది. "ఏవండీ!" అంది భయంగా.

"లే-లే- భయపడ్డావా....అది పెల్విక్‌బోన్" అన్నాడు తేలిగ్గా.

హేమ మొహం చెమట్లు నింపుకుంది. కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి. ఆమె ఆలోచనలు ఎక్కడెక్కడో పరుగు తీస్తున్నాయి.

"ఏవిటి హేమా! ఎందుకంత కంగారు? నువ్వు అనవ సరమయిన విషయాల్ని గురించి ఎక్కువగా ఆలోచిస్తావు. లే-లే" చెట్టుదగ్గరికి నడిపించాడు రెక్క పట్టుకొని.

"వదలండీ! నాకేదో అనుమానంగా వుంది" అంది పైటతో, మొహం తుడుచుకొంటూ.

"ఎందుకూ భయం? అసలు యిక్కడికి నిన్నెవరు రమ్మన్నారు యింట్లో పిల్లలకి కారియర్ పంపించకుండా" మందలింపుగా కోప్పడ్డాడు.

"చాల్లెండి! ముందు ఎముకలు, శవాలు యిక్కడ ఎలా పుట్టాయో ఆలోచించండి. యిది స్మశానం కాదుకదా" అంది. ఎంత చూడకూడదనుకున్నా అటుకేసి చూడకుండా వుండలేకపోతుంది.

హరీష్ "చూడు హేమా! ఎవరో చనిపోయినపుడు ఈ స్థలంమీద భ్రాంతి తీరక, యిక్కడే కప్పెట్టమని వుంటారు. మనిషి శవం కుళ్ళితే, ఎముకలు బయటపడక ఏం చేస్తాయి? ఆ మాటకొస్తే, మనం వుంటున్న ఇల్లు తవ్విచూస్తే, అక్కడకూడా ఎముకలు గ్యారంటీగా దొరుకుతాయి. వీటిని మనం పట్టించుకోగూడదు!" అన్నాడు.

"మనింట్లో వుంటే వుండనివ్వండి. మనకు ఇంతవరకు ఏ విధమైన కీడు జరుగలేదు. ఇవి ఏ దరిద్రుడి ఎముకలో-ఐనా, ఆయనకీ, స్థలం అమ్మినాయనకి పిల్లలుగాని, బంధువులు గాని లేరని మీరేగా చెప్పారు?" ఫ్లాష్‌లా మెరిసిన ఆలోచనని అడిగేసింది.

"అవునూ!" అంటూ తల గోక్కున్నాడు.

హరీష్‌కి ఆలోచనలు మొదలయ్యాయి. ఈ స్థలం గోవిందయ్య దగ్గర పదివేలకు కొన్నాడు. ఆయనకి పిల్లలు గాని. దగ్గర బంధువులుగాని లేరు. ఆయన చనిపోయినపుడు చావుల మసీదు దగ్గరే దహనం చేశారు. మరీ మనిషి ఎవరు చెప్మా! బయటికి ఏం చెప్పకుండా ఆలోచించసాగాడు.

2

"వెల్ మిస్టర్ హరీష్! ఇది 'పెల్విక్ బోన్', స్త్రీకి సంబంధించింది. ఈ అమ్మాయి వయసు 27 సంవత్సరాలు వుండొచ్చు. నెంబర్ త్రీ — ఈ అమ్మాయి చనిపోలేదు చంపబడింది!" అన్నాడు డాక్టర్ వివేకానందం పునాదిలో దొరికిన ఎముకలను క్షుణ్ణంగా పరీక్షించిన తర్వాత.

హరీష్ కళ్ళు షాక్ రిసీవ్ చేసుకున్నై.

"అంతే కాదు. బహుశా ఆమె చంపబడి ఎయిటీ ఆర్ ఎయిటీ ఒన్ దేస్ కావచ్చు. నెంబర్ ఫైవ్ — తుపాకీ గుండుతో చంపబడింది. నెంబర్ సిక్స్ — ఆ గుండు స్వయం తయారీది అయివుంటుంది. నెంబర్ సెవన్ — ఆ గుండు క్రిందనుండి దూసుకుపోయి వుండాలి. నెంబర్ ఎయిట్ — ఆమెకీ మధ్యస్థంగా పోలియో వచ్చి వుండాలి" అన్నాడు చిరునవ్వు మొహంనిండా చోటు చేసుకున్న డాక్టరు వివేకానందం.

డాక్టరు వివేకానందం వయసు డెబ్బై సంవత్సరాలు పైబడొచ్చు. తలంతా నెరిసిపోయింది. ఒక్క వెంట్రుక కూడా ఊడిపోలేదు. మనిషి ఎపుడూ ఆనందంగా వుంటాడు. తన జీవితంలో పెళ్ళి, సంసారం పట్ల వ్యామోహం, చూపించకుండా రోగులకి సేవచేయడం ద్వారా, గడిపేశాడు.

వివేకానందంతో హరీష్‌కి లక్కీగా పరిచయమయింది. మానసికమయిన వ్యాధుల్ని వివేకానందం హాండిల్ చేయడంలో ఎంతో నైపుణ్యం చూపిస్తారన్న పేరుంది. అనుకోకుండా హేమని ఒకసారి డాక్టరుగారి దగ్గరకు తీసుకురావలసి వచ్చింది. హేమ చిలిపితనం, నిర్మొహమాటం, చీటికి మాటికీ డాడీ అని పిలవడం కట్టిపడేశాయి. మంచయినా,

చెడయినా డాక్టర్ వివేకానందంని సంప్రదించనిదే ఏ పనీ చేయడు హరీష్.

హరీష్ మొహంలోకి చూసి "యింకేవైనా ఇన్‌ఫర్మేషను కావాలా?" అడిగాడు.

హరీష్ కళ్ళు దేన్నో చూస్తున్నాయి.

"అమ్మాయి బావుందా!" అన్నాడు డాక్టరుగారు.

"ఊఁ!" ఆలోచనల్లో నుండి ఊడిపడ్డాడు హరీష్.

"ఈ విషయాలన్నీ మీరెలా చెప్పగలిగారు!" అనుమానం బయటపెట్టాడు.

"బౌటాఫ్ ఎక్స్‌పీరియన్స్!" అన్నాడు సన్నగా నవ్వి.

"ఈమె చనిపోయి, సరిగ్గా 81 రోజులయ్యాయా?" మరొక్కసారి అనుమానంగా అన్నాడు.

మౌనంగా తలూపేడు డాక్టరుగారు.

"ఈమె చంపబడిందా!" మళ్ళీ అనుమానంగా ప్రశ్నించాడు.

హరీష్‌కేసి నవ్వుతూ చూసి, "చూడు డియర్ హరీష్! దీనికి ఆధారం ఏమయి వుంటుందన్నది చెప్పాను. బీయింగె డాక్టర్ అండ్ వెల్‌విషర్ టుది సొసైటీ నా డ్యూటీ నేను చేశాను. బీయింగె రెస్పాన్సిబుల్ పర్సన్ నువు ఇన్వెస్టిగేట్ చేసి ముద్దాయిని ప్రభుత్వానికి పట్టివ్వు!" అన్నారు.

"ఓ.కె. సార్!" అన్నాడు అప్రయత్నంగా.

"విష్‌యూ ఆల్‌ది బెస్ట్" అంటూ కరచాలనం చేసి పంపించారు డాక్టరుగారు.

3

డాక్టరుగారు చెప్పిన పాయింట్స్‌ని మరోసారి చదువుకొన్నాడు సీరియస్‌గా ఆలోచిస్తూ.

"ఏవిటండోయ్ యింత సీరియస్సు!" జోకేసినట్టు

నవ్వింది.

హరీష్ పట్టించుకోలేదు.

"అక్కడే మండుతుంది నాకు. జోక్‌ని ఎంజాయ్ చేయని మనుషులంటే మంట."

హేమ కళ్ళు ఎర్రబారాయి. బొత్తిగా పసిపిల్ల మన స్తత్వం. జీవితంలో అతి సున్నితంగా పెరిగింది. చిన్న బాధ కలిగితే చలించిపోతోంది. నవ్వొస్తే ఎందరున్నా ఆపుకోకుండా కిలకిలా నవ్వేస్తుంది. హరీష్ మాట్లాడక పోయినా, సీరియస్ మెంటయిన్ చేసినా, చాలా కోపం!

"హేమా! నా డ్యూటీ గురించి నీకు తెలీదూ!" అన్నాడు గోముగా తల నిమురుతూ.

"ఊఁ ఎందుకు తెలీదు? మరి నాగురించి మాత్రం మీకు తెలీదూ?" ఎదురుప్రశ్న వేసింది.

"అసలు....డాక్టరుగారు ఏం చెప్పారంటే" అంటూ టాపిక్ మార్చడానికి ప్రయత్నం చేశాడు.

"ఏం చెప్పేరు మా డాడీ!" ఇంట్రస్టింగా ముందుకు వంగింది.

"వద్దు! భయపడతావు!"

"చెప్పండి. నేను తులసిదళం నవల ఒక్కరాత్రి ఫినిష్ చేశాను. అంతకంటేనా?"

"చదవడం వేరు? ఊహించుకోవడం వేరు!"

"చెప్పండీ!" మొండికేసింది హేమ. చెప్పాడు. హేమ భయపడుతుందనుకున్నాడు. కాని గలగలా నవ్వింది. ఆమె నవ్వుతుంటే ఎన్నో అందాలు బయటపడతాయి.

"ఎందుకు హేమా ఆ నవ్వు!" పాత ఈనాడు దిన పత్రికలు చూస్తూ అడిగాడు.

"లేకపోతే ఏమిటండీ ఈ ముసలాయన ఆలోచనలు.

ఇదంతా పట్టి రాంగ్—మీరు నిశ్చింతగా డ్యూటీ చేసు కోండి. అసలు మీకు తెలుసో, తెలీదో. యిలాంటి విషయాలు పట్టించుకున్నట్టు కనిపిస్తూనే, పట్టించుకోకుండా వుండాలండీ'' అంది తారకమంత్రం చెవిలో చెప్పినట్టు చెప్పి.

''నిజంగానా?'' అమాయకంగా అడిగాడు హరీష్.

''ఆఁ!'' అంది గర్వంగా.

''పో ముందు.... ఒకటిస్తే!'' అంటూ నెత్తిమీద చిలిపిగా మొట్టాడు.

తుర్రుమంది హేమ.

హరీష్ కళ్ళు మెరిశాయి. పేపరును మరోసారి చదివేడు. ఆ కటింగ్ భద్రపరిచాడు.

4

తగరపు వలస — విశాఖపట్టణానికి సమీపంలోనే వుంటుంది.

సత్యనారాయణ స్వామి టెంపిల్ క్రింద ''వానపాలు అంటే ఎవరు?'' అని ఎంక్వైరీ చేశాడు హరీష్. చాలా మంది తెలీదన్నారు. ఒకబ్బాయి కొండకి అవతలి పక్కకి దారి చూపించాడు.

ఎవరో ఒకాయన బక్కగా వున్నాడు. దగ్గుతున్నాడు. రోగాన పడినట్టుంది.

''ఈ యిల్లేనండీ!'' అంటూ కుర్రాడు చూపించి వెళ్ళిపోయాడు.

ఆయన హరీష్‌కేసి అనుమానంగా చూశాడు.

''ఎవరండీ మీరు?'' లేచి నిలబడ్డాడు. దగ్గు కంట్రోల్ చేసుకుందామన్నా చేయలేకపోతున్నాడు.

''వానపాలు అంటే ఎవరు?'' హరీష్ గంభీరంగా అడిగాడు.

"నేనే.... నేనే బాబూ. ఏం బాబూ!" తడబడ్డాడు.

"నువు తుపాకీ గుళ్ళు తయారుచేస్తావా?"

వానపాలు మాట్లాడలేదు. సంకోచించాడు సమాధానం చెప్పడానికి. పోలీసు దుస్తుల్ని చూసేసరికి సగం ప్రాణం ఎగిరిపోయింది.

"నేను.... నేను చేయను బాబూ! యింతకు ముందు సరఫరా చేసేవాడ్ని."

"యిపుడు చేయడం లేదా!"

"లేదు బాబూ. దొరికిపోయాను కదండీ. మానేశానండీ. ఈ విషయం ఈనాడు పేపర్లోకూడా పడింది కదండీ."

"ఏ విషయం? నువు సరఫరా చేయడం మానేసిన విషయమా!"

"నేను దొరికిపోయిన విషయమండీ!" తలదించుకున్నాడు సిగ్గుతో.

"తుపాకీ గుళ్ళు తయారీ ఎక్కడ?"

వానపాలు సమాధానం చెప్పలేదు. ఉరిమి చూశాడు హరిష్.

"ఈ విషయం నా నోటినుండి చెప్పించాలని కాకపోతే, ఏవిటండీ. నాయన పేరు భావనా ఋషిగారని. ఈ హోల్ దేశం మొత్తానికి తెలుసండీ!" అన్నాడు అమాయకంగా.

"ఎక్కడుంటాడు!"

"గుడివాడ కెళ్ళే దారిలోనండీ."

"ఏం చేస్తుంటాడు వృత్తిరీత్యా!"

"ఏమీ చేయడండీ.... కళ్ళు మూసుకొని తపస్సు చేస్తాడండీ!"

వానపాలు చెప్పిన సమాధానంకి నవ్వొచ్చింది. వానపాలు యింటిని సోదా చేశాడు. ఎక్కడా మందుగుండు సామాను

గానీ, తూటాలు వున్నట్టుగాని ఛాయలు లేవు.

"ఆయన నీకు బాగా తెలుసా?"

"తెలుసుగానీ, చెడిపోయిందండీ వ్యవహారం!" అన్నాడు.

హరీష్ ఎడ్రసు నోట్ చేసుకున్నాడు.

5

భావనాఋషి శక్తి పూజలో కూర్చున్నారు.

అరగంటవరకూ లేవరు. ఆయన చేతిలో త్రిశూలం వుంది. మనిషికి యాభయ్ సంవత్సరాలు వుంటాయి.

హాలు తమాషాగా అలంకరించబడి వుంది. దేవతల విగ్రహాలు ఒకప్రక్క, నగ్నంగా వున్న సుందరీమణుల ఆయిల్ పెయింటింగ్స్ మరోప్రక్క, కత్తులు, ఆయుధ సామగ్రి మరోప్రక్క. తుపాకీ, రివాల్వర్‌లు, పిడి చాకులు యింకో పక్క వున్నాయి. చూడ్డానికి అదో చిన్నసైజు దేవాలయంలో వస్తుప్రదర్శనశాలలా అనిపించింది.

హరీష్ కళ్ళు ఒకచోట నిలిచాయి.

అక్కడే చూపుల్ని కేంద్రీకరించాడు. ఋషిగారు ధ్యాన ముద్రలో నుండి లేచారు. హరీష్ నమస్కారం చేశాడు. పట్టించుకోకుండా బయటికి నడిచాడు భావనాఋషి—భావనా ఋషి దగ్గరకి చాలామంది పోలీసు ఆఫీసర్లు, డాక్టర్లు, లాయర్లు వస్తుంటారు భక్తిమార్గం కోసం. విని కానుకలు ఇతోధికంగా ఇచ్చి వెళుతుంటారు. ఆ బాపతు అనుకున్నారు ఋషిగారు.

బయటికి నడిచాడు.

కొండ ప్రాంతం చూడ్డానికి చాలా అందంగా వుంది.

చలి యింకా తగ్గలేదు. గనుక గోరువెచ్చని ఎండలో కూర్చున్నారు ఋషి.

"ఎవరు నాయనా తమరు!" తీయగా వుంది గొంతు.

"నేను, విశాఖపట్నం నుండి వచ్చానండీ. మీ గురించి విన్నాను!" అన్నాడు గౌరవంగా హరీష్.

ఋషిగారు పొడుగాటి గడ్డం గర్వంగా సవరించు కున్నారు.

"చెప్పండి బాబూ! ఏవిటి—ఏం చేయాలి మీకోసం!" అన్నాడు.

"నాలుగు నెలల క్రితం ఈ ఆశ్రమంలో ఒకమ్మాయి వుండేది కదూ స్వామిజీ!" అన్నాడు హరీష్ క్లూ లాగ డాని కుపక్రమిస్తూ.

"ఎవరు?"

"ఒక పోలియో వచ్చిన...." అంటూ ఆగిపోయాడు.

"ఊఁ. ఉండేది. చెప్పండి"—అంటూ తలూపేడు.

"ఆ అమ్మాయి యిప్పుడు లేదా స్వామీ!"

"లేదు....వారి కన్నవారింటికి వెళ్ళిపోయింది!" గంభీ రంగా చెప్పేడు.

ఆమెని గుర్తు చేసేసరికి, ఋషిగారి మొహంలో రంగులు మారాయి.

"వారిల్లు ఎక్కడుందండీ!"

కొడిసేపు సమాధానం చెప్పలేదు.

"ఏమో—ఆ వివరాలు తెలీవు. ఆమె పేరు సూర్యకళ. ఆశ్రమంలో నీడ చూపించమంది. చూపించాను. నా కన్న బిడ్డలా చూసుకున్నాను. ఆమెకు, ఐహిక ప్రపంచాను భూతులుమీద ఆశ కలిగింది. వెళ్ళిపోయింది. ఎంతకాలం బంధిస్తే వుంటుంది స్వేచ్ఛకోరే రామచిలుక చెప్పండీ!"

ప్రేమగా అన్నాడు.

"స్వామిజీ! మీరు ఎగ్జిబిషను లాంటిది ప్రతి సంవత్సరం నిర్వహిస్తుంటారా!" అర్థం కానట్లు అడిగాడు. నవ్వాడు ఋషి.

"లేదు బాబూ! నాకు జంతువుల్ని వేటాడ్డం, మల్ల యుద్ధాలు, ముష్టియుద్ధాలు చేయడం అలవాటు. అయితే యివన్నీ భ్రమలనీ, జీవితకాలం క్షణికమన్న సత్యం తెలుసుకున్న తర్వాత సర్వం త్యజించి, ఆ తల్లి ఆరాధనలో వుండిపోయాను!" అన్నాడు కళ్ళు మూసుకొని.

"స్వామిజీ! మీరు తుపాకీ గుళ్ళు తయారుచేసేవారా! యిప్పుడు కాదు—ఆ రోజుల్లో?" అన్నాడు హరీష్ ఠక్కున.

కోపం రంగరించిన మొహంగా మారిపోయింది ఋషి గారికి.

క్రింద పోలీస్ వేన్ ఆగింది.

స్టాఫ్ చాలామంది వస్తున్నారు. భావనా ఋషి కళ్ళు చక్రాల్లా తిరిగాయి.

"ఏం బాబూ! ఏమిటి మీ అన్వేషణ—నన్ను అపార్థం చేసుకున్నారు మీరు! పోలీసు బందోబస్తుతో వచ్చారు?" అన్నాడు నవ్వి.

"లేదు. అర్థం చేసుకున్నాను. మీ గురించి తెలుసుకొని మరీ వచ్చాను. ఆ యింట్లోవున్న ఫోటోయేనా సూర్య కళది—"

"కాదు!" తడబడ్డాడు. పోలీసుజనం తరలి వస్తున్నారు.

"ఆ అమ్మాయి పోలియో అమ్మాయి కాదా!"

"అవును! కాని 'సూర్యకళ' వేరు!"

"షటప్!" అంటూ చెంప చెళ్ళమనిపించాడు. స్వామీజీ

తూలి వెనక్కిపడ్డాడు. పోలీసులు చుట్టుముట్టారు. సెల్యూట్ చేశారు హరీష్‌కి.

"పాపి! అన్యాయం. ఘోరం! నువ్వు అనుభవిస్తావ్" అంటూ చటుక్కున లేచి తలపడబోయి ఆగిపోయాడు స్వామిజీ.

"చెప్పు! ఈ ఫోటోలోవున్న అమ్మాయికి ఇరవై యేడు సంవత్సరాలు కదూ?"

"అవును!"

"ఈ అమ్మాయిని చంపింది సరిగ్గా 81 రోజుల క్రితం కదూ?"

"అవును....కాదు.మీరు పొరబడుతున్నారు."

"తుపాకీతో కాల్చి చంపేవ్. నువ్వు తయారుచేసిన తుపాకీ 'గుండు'తో అవునా?"

"లేదు!" అన్నాడు అసహనంగా చూస్తూ. మరొకటి తగిలింది నెత్తిమీద.

"అమ్మా! శక్తీ!" అంటూ బిగ్గరగా అరిచాడు.

"నోర్ముయ్యిరా రాస్కెల్. శక్తిట శక్తి! నీలాంటి రాస్కెల్స్‌కి లొంగదురా ఆ శక్తి. నీలాంటి వెధవల్ని శిక్షిస్తుంది!" అంటూ మొహంమీద తన్నాడు. ముక్కు చిట్లింది. నెత్తురు కారుతోంది.

'భావనాఋషి మెట్టుమీద పోలీసులున్నారట' జనంలో సంచలనం. పరుగులుతీసి మరీ వస్తున్నారు.

'ఋషి'గారు ఎంతో గౌరవంగా ఇంతకాలం నెగ్గుకొంటూ వచ్చారు. ఇంతమంది ముందు అవమానంపాలు అవుతాడని కలలోనూ ఊహించలేదు.

"నన్ను బలవంతంగా చంపకండి! నేను ఆమెను

చంపాలని చంపలేదు. అప్రయత్నంగా ఆమె చనిపోయింది. తుపాకీని శుభ్రపరుస్తుండగా ట్రిగర్‌మీద వ్రేళ్ళుంచాను. ఏదో పరధ్యానంలో వుండి ట్రిగర్ నొక్కాను. అప్పటికే 'సూర్యకళ' నేలమీద గిలగిల కొట్టుకొంటూ వుంది. కాసే పటికి చనిపోయింది!'' అన్నాడు.

"మరి పోలీసులకి చెప్పచ్చుగా!"

"నా దగ్గర తుపాకీ లైసెన్సులేదు!'' అన్నాడు.

"మోసం చేయడానికి లైసెన్సుందా!'' అని అడిగాడు హరీష్.

"అలా గడ్డిపెట్టండి బాబూ! దేవుళ్ళపేరు చెప్పుకొని జనాల్ని తెగదోచుకుంటున్నారండీ యీ ఋషులు, స్వామి జీలు. అసలు సూర్యకళమీద యీ గాడిదకి మనసుండేది బాబూ. సూర్యకళ వయస్సులోవున్న అమ్మాయి. ఈ వెధవనెందుకు యిష్టపడుతుంది. తర్వాత సూర్యకళ కని పించలేదు. 'ఏవయ్యింది' అని ఎవరయినా అడిగితే పుట్టిం టికి వెళ్ళిందని చెబుతాడు బాబూ! చాలా మోసగాడు'' అంది ఒకావిడ.

"అవునండీ. వీడ్ని చూసి చాలామంది కన్నెపిల్లలు భయపడి, మగాళ్ళతో చెప్పేరు. ఏం చేయగలం చెప్పండి ఒక్కరం సాహసించలేం. ఇలా వున్నాడుగాని బాబూ! చాలా పౌరుషమండి. అసలు ఒంటరిగా మెట్టెక్కాలంటే భయం బాబూ!'' ఒక ముసలాడు చెప్పేడు.

"ఇంత రాద్ధాంతం ఎందుకు! నేనే చంపానని ఒప్పు కొంటున్నానుగా!'' చిరాగ్గా అన్నాడు ఋషి.

"నోర్మూయ్. చంపేసని అప్పుడే ఒప్పుకోవచ్చుగా. ఆ శవాన్ని విశాఖపట్నం సమీపంలో మధురవాడ దగ్గర పాతి

పెట్టావు. నీ ఖర్మకాలి ఆ స్థలం నాది అయ్యింది. నీ నిజ స్వరూపం బయటపడింది?" అన్నాడు చేతికి సంకెళ్ళు తగిలించమని సైగచేస్తూ.

ఆశ్రమాన్ని మొత్తం స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

6

"థ్యాంక్యూ వెరీమచ్ డాక్టర్‌గారూ!" అన్నాడు హరీష్.

"థాంక్యూడేడ్. నీ కూతురు యిప్పుడు ఫ్రెష్‌గా వుంది. లేకపోతే : కీ నీ ట్రీట్‌మెంట్ అవసరం అయ్యుండేది!" అంటూ నాలుక్కొరుకుకొంది.

"గుడ్. వెరీగుడ్!" అంటూ ప్రేమగా చూశాడు డా. వివేకానందం.

"డాక్టరుగారూ! ఈ పరిశోధనలో నేను సఫలీకృతమయ్యానంటే అందుక్కారణం మీరు. మీరు చెప్పిన ఆధారాలు. ప్లీజ్....దయజేసి ఇవన్నీ ఎలా ఊహించగలిగారో చెప్పండి!" అన్నాడు.

"అవును డాడీ! మీరు భూతవైద్యులు కూడానా!" కళ్లు మిటకరిస్తూ అడిగింది హేమ చిలిపిగా.

"నో మై డియర్ డాటర్! ఐయామ్ ఆల్వేజ్ ఎ డాక్టర్!"

"మరి ఎలా కనిపెట్టేశారు?" హేమ.

"సిక్స్త్‌సెన్స్‌లాంటిదేమయినా...." నసిగాడు హరీష్.

"నో, నో—మైడియర్! వినండి. నెంబర్ వన్ 'పెల్విక్‌బోన్' స్త్రీది. డాక్టర్లం గనుక, చూడగానే గమనించగలం—నెంబరు టు—'బోన్' గట్టిదనంనిబట్టి ఆమె వయసు నిర్ణయించగలిగేను. నెంబరు త్రీ—ఆమె థ్రాట్

భాగం గాయబడింది. గాయమయిన ప్రదేశంబట్టి, ఆమె చనిపోలేదు చంపబడింది అని చెప్పగలిగాను.

నెంబర్ ఫోర్ ఆమె—ఆమె బోన్‌మీద వున్న 'స్కిన్ ఫైబర్'ని బట్టి, చంపబడి '81 డేస్' అయిందని చెప్ప గలిగాను. ఫయివ్-'థ్రాట్' దగ్గర తుపాకీ గుండు చేసిన 'గాయం' తాలూకు సిమ్‌టమ్స్ కనిపించాయి.

సో ఇట్ మస్ట్ బి ఎ బుల్లెట్. సిక్స్—మాన్యుఫేక్చర్స్ కంపెనీ మేడ్ అయినట్లయితే బోన్ని మరింత కరుచుకు పోయేది. బోన్ చిట్లలేదు. సెవెన్, 'థ్రాట్'కి తగలటం వలన క్రిందనుండి 'షూట్' చేసివుంటారని ఊహించొచ్చు. ఎయిట్—లెగ్స్ తాలూకు రెండు పెల్విక్ 'బోన్స్'లోనూ వెయిట్ వ్యత్యాసం వుంది. గనుక దేర్ మస్ట్‌బి సమ్‌థింగ్ లైక్ పోలియో" అన్నాడు చిరునవ్వు నవ్వి.

డా. వివేకానందం మొహంలో వింతకాంతి, ఎంతో అనుభవము—

"కంగ్రాట్యులేషన్స్ డాడీ!" అంటూ ఎగిరి గంతేసింది హేమ.

"చూడు బాబూ! మనిషి జీవితం చాలా విలువైనది. ఆ జీవిత భాగంలో 'కాలం విలువ' యింకా విలువైనది. ఈ సమయాన్ని వృథాపరచకుండా ఆలోచించేందుకు కేటా యిస్తే మానవుడు మహనీయుడవుతాడు సమాజానికి. భావితరానికి ఆదర్శమూర్తవుతాడు!" అన్నాడు సన్నగా నవ్వుతూ.

"చూశావా! మీ 'డాడీ' ఏమంటున్నారో!" అన్నాడు హరీష్.

"చాల్లెండి గొప్ప. ఏవిటి డాడీ. నేనేం కష్టపడేశానా!" అంటూ సిగ్గుతో ముడుచుకుపోయింది హేమ. □

సీరియల్



(గత సంచిక తరువాయి)

చైతన్య ఏమీ లేదన్నట్లు సైగచేశాడు.

"ఏమైంది నీకు? డాక్టర్ని పిలిపించనా?"

అతను వద్దు అన్నట్లు సైగచేశాడు.

అరుణతార అతన్ని భయంగా చూస్తూ వుండిపోయింది. ఆమెకు ఏమీ తోచడంలేదు. క్షణాలు గడిచేకొద్దీ అతని

శరీరం విచిత్రంగా మారిపోతోంది. ఎరుపురంగు తిరిగింది. చేతి పిడికిళ్ళు బిగుసుకు పోతున్నాయి. పెదవులు కదులుతున్నాయి. ఏదో మాట్లాడబోతున్నట్లు అనిపించింది. కాని గొంతులోనుంచి శబ్దం రావడంలేదు.

ఆమె ఏదో ప్రమాదాన్ని శంకించి కలవర పడింది. ఫోన్‌చేసి రిసెప్షనిస్ట్‌కి పరిస్థితి తెలియజేసింది.

కాసేపటికి మేనేజర్, డాక్టర్‌ని వెంటబెట్టుకుని వచ్చాడు.

డాక్టర్ అతన్ని పరీక్షించి, "మైగాడ్!" అన్నాడు ఆశ్చర్యం వెలిబుచ్చుతూ.

అరుణతార హడలిపోయింది.

"డాక్టర్ ఏం జరిగింది?" ఆందోళనాపూరిత స్వరంతో అడిగింది.

"నాడి నిముషానికి 300 సార్లు, గుండె వేగం నిముషానికి 300. నా సర్వీస్‌లో ఇటువంటి విచిత్రమైన కేసుని ఎప్పుడూ చూళ్ళేదు. బ్లడ్‌ప్రెషర్ చాలా హైలోవుంది. ఇదేమిటో నాకు అంతు పట్టడంలేదు. బెటర్ టూ అడ్మిట్ యిన్ జనరల్ హాస్పటల్" అన్నాడు.

అరుణతారకు ఏడుపు ముంచుకొచ్చింది.

"మేడమ్ వీరు మీకు యేమవుతారు?" ప్రశ్నించాడు మేనేజర్.

"రిలేషన్ ఏమీలేదు. నాకు స్నేహితుడు" అంది ఆమె బొంగురుపోయిన గొంతుతో.

మేనేజర్ వాళ్ళిద్దర్నీ అనుమానంగా చూశాడు.

"ఈ రూమ్ గోవిందరాయుడిగారిపేర బుక్ చేశారు. ఆయన ఎక్కడ?"

"లేరు. ఆయన వెళ్ళిపోయారు."

"ఆయన మీకే మౌతారు?"

"మా ఫాదర్."

"వీరు ఇక్కడ ఏం చేస్తుంటారు?"

"తెలీదు. ఎయిర్ పోర్టులో కనిపిస్తే డిన్నర్‌కి యిన్వయిట్ చేశాను. మాట్లాడుకుంటూ కూర్చున్నాం. ఇంతలో సడన్‌గా అప్‌సెట్ అయ్యారు" అంది ఆమె.

"సో. వీరిని అర్జెంట్‌గా హాస్పటల్లో అడ్మిట్ చెయ్యాలి. టాక్సీ పిలిపిస్తాను. పాపం మీరు లేనిపోని తలనొప్పి కొని తెచ్చుకున్నారు."

"అటువంటి దేమీ నేను అనుకోవడంలేదు. ఇతను మాకు కావలసిన వాడే. అతనికోసం శ్రమపడడానికి నేను వెనుకాడడం లేదు."

"మీరు రెడీగా వుండండి. నేను టాక్సీ తెప్పిస్తాను. కావాలంటే మీకు తోడుగా మా బాయ్‌నిగూడా పంపిస్తాను. హాస్పిటల్లో అడ్మిట్ చెయ్యడానికి సహాయంగా వుంటాడు" అన్నాడు.

ఆమె తలవూపింది.

డాక్టర్ అతనికి తెలివి వస్తుందేమోనని రెండు యింజక్షన్స్ చేశాడు. కొంతసేపు వెయిట్ చేశాడు. కాని ప్రయోజనం కనిపించలేదు.

"ఇతని శరీరానికి మందులు పని చెయ్యడంలేదు. ఏమిటో విచిత్రం...." అని గొణుక్కుని వెళ్ళిపోయాడు డాక్టర్.

23

వెండికొండ రిజర్వాయర్ వద్ద పవర్ హౌస్‌లో విద్యుత్తు వుత్పాదన ఆగిపోయిందని వైర్లెస్ మెసేజ్‌ద్వారా సమాచారం అందుకున్న ఛీఫ్ ఇంజనీర్ అశోక్‌గిరి హైదరాబాద్ నుంచి వెళ్ళాల్సిన ప్రోగ్రాం క్యాన్సిల్ చేసుకున్నాడు.

హుటాహుటిన హెలికాప్టర్‌లో రిజర్వాయర్ ప్రాంతం చేరుకున్నాడు.

వెండికొండ విమానాశ్రయంలో హెలికాప్టర్ దిగింది. సూపరింటెండింగ్ ఇంజనీర్ భార్గవ, డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసులునాయుడు చీఫ్ ఇంజనీర్ అశోక్‌గిరికి స్వాగతం చెప్పారు.

అంతా కారుల్లో పవర్‌హౌస్‌కి చేరుకున్నారు.

వెండికొండ డామ్ దిగువభాగంలో వుంది పవర్‌హౌస్. ప్రస్తుతం మూడు యూనిట్లు పనిచేస్తున్నాయి. మరిమూడు యూనిట్లు నిర్మాణదశలో వున్నాయి.

పని చేస్తున్న మూడు యూనిట్లలో రెండు యూనిట్లు పనిచెయ్యడం ఆగిపోయాయి. ఒక్కొక్క యూనిట్‌నించి రోజుకి రెండులక్షల రూపాయల విలువగల విద్యుత్తు వుత్పత్తి అవుతుంది. రెండు యూనిట్లు చెడిపోతే రోజుకు నాలుగులక్షలు నష్టం. అంతేకాకుండా పవర్ సప్లయ్ లేక ఎన్నో పరిశ్రమలు ఆగిపోతాయి. ఇళ్ళల్లో కరెంటు లేక ఎందరో బాధపడతారు.

"యూనిట్లు ఎందుకు పనిచెయ్యడంలేదు?" చీఫ్ ఇంజనీర్ స్థానిక ఇంజనీర్లని ప్రశ్నించాడు.

"వాటర్ సప్లై పడిపోయింది."

వాళ్ళ సమాధానం విని చీఫ్ యింజనీర్ ఆశ్చర్యపోయాడు.

"వాటర్ సప్లై పడిపోయిందా? విచిత్రంగా వుందే? ఇదేం ఎండాకాలం కాదుగదా? రిజర్వాయర్‌లో ఫుల్ లెవల్ వాటర్ వుందికదా?" అన్నాడాయన.

"ఎస్ సార్! కాని ఎందుకో వాటర్ రావడంలేదు," అన్నారు.

చీఫ్ యింజనీర్ అశోక్‌గిరి పవర్ హౌస్‌లో యూనిట్లు ఎగ్జామిన్ చేశాడు. రిజర్వాయర్ నుంచి పవర్‌హౌస్ లోకి అమర్చబడిన పెన్‌స్టాక్ పైప్స్‌లోనుంచి శరవేగంతో నీళ్ళు వస్తుంటాయి. ఆ నీటి వేగంలోనుంచే విద్యుత్తు వుద్భవిస్తుంది. పెన్‌స్టాక్ పైప్స్‌లోనుంచి మామూలుగా వచ్చే నీటివేగం నాలుగోవంతుకు పడిపోవడంతో విద్యుత్తు వుత్పాదన ఆగిపోయింది.

"మిస్టర్ భార్గవ! పెన్‌స్టాక్ పైప్స్‌కి రిజర్వాయరులోనే ఏవో అడ్డంపడి వుంటాయి. ఫ్లడ్ సీజన్లో నదిలో కొట్టుకుని వచ్చే చెట్లు, జంతు కళేబరాలు వగైరా కావచ్చు!" అన్నాడు అశోక్‌గిరి.

"యస్సార్!" అని తమ అభిప్రాయంగూడా అదే నన్నట్లు తలలు వూపారు యింజనీర్లు.

"ఇక్కడ ఎవరయినా గజ ఈతగాళ్ళు వుంటే వెంటనే అడ్డంపడిన వాటిని తొలగించే కార్యక్రమం మొదలు పెట్టండి. దేర్ ఈజ్ నథింగ్ రాంగ్ ఎక్సెప్ట్ దట్."

"యస్సార్! నేను ఫిషర్‌మెన్‌ని కన్సల్ట్ చేస్తాను" అన్నాడు శ్రీనివాసులునాయుడు.

నాయుడు చేపలవాళ్ళని వెతుక్కుంటూ వెళ్ళాడు. కొందరు రిజర్వాయర్ ఒడ్డునే కూర్చుని వలలు రిపేరు చేసుకుంటున్నారు.

రోడ్డుమీద జీప్ ఆపి తమ దగ్గరికి వస్తున్న ఆఫీసర్ని చూసి వాళ్ళు ఆయన చేపలకోసం వస్తున్నాడనుకున్నారు.

"చేపలు లేవు సార్! ప్రొద్దున్నే దిగుతాయి. వేటకెళ్ళి నోళ్ళు ప్రొద్దునొస్తారు" అన్నాడు ఒక యువకుడు.

నాయుడు నవ్వి "నేను చేపల కోసం రాలేదు" అన్నాడు.

మరింక దేనికి వచ్చినట్లు అని వాళ్ళు ప్రశ్నార్థకంగా నాయుడి వంక చూశారు.

"మీలో ఈత వచ్చినవాళ్ళెవరైనా వున్నారా?" అన్నాడు నాయుడు.

వాళ్ళకి ఆ ప్రశ్న నవ్వు రప్పించింది.

"ఈత రానోడు చేపలోడు ఎట్లా అవుతాడు సార్!" అన్నా డొక యువకుడు నవ్వుతూ.

"ఆ మాట నిజమే అనుకో. కాని మాకు కావాల్సింది మామూలు ఈత వచ్చినోడు కాదు. గజ ఈతగాడు కావాలి" అన్నాడు నాయుడు.

"ఎందుకు సార్?"

నాయుడు అంతా వివరంగా చెప్పాడు.

"వద్దు సార్! ఆ పని మా వల్ల కాదు" అన్నారు వాళ్ళంతా ముక్తకంఠంతో.

"ఏం?" అన్నాడు నాయుడు.

"తెలిసినోడు ఎవడూ ఇందులోకి దిగడు సార్!" అన్నాడు ఒక ముసలోడు.

"ఏం? ఇది ఏమంత లోతు? మహా అయితే ఆరొందల అడుగులు. సముద్రాల్లో ఈదేవాళ్ళు లేరా?" అన్నాడు నాయుడు.

"ఈదలేక కాదు సార్! ఇందులో మొసళ్ళని తెచ్చి పడేశారు. ఎన్నో వందలున్నాయి యిందులో. అయ్యి ఎన్నెన్ని గుడ్లుపెట్టి పిల్లల్ని చేశాయో ఎవడికి తెలుసు. మొసళ్ళని పెంచుతున్నారు డిపార్టుమెంటోళ్ళు. అది తెలిసి ఎవడు దిగుతాడు సార్!"

నాయుడు ఎంత చెప్పినా లాభంలేకపోయింది. ప్రాణాలంటే ఎవరికైనా తీపే. తెలిసి తెలిసి యెవడు రిస్కు

తీసుకుంటాడు?

చీఫ్ ఇంజనీర్ సంగతంతా విని నిట్టూర్చాడు.

"సరే. అయితే వైజాగ్ నుంచి రప్పిద్దాం" అన్నాడు చీఫ్ ఇంజనీర్.

'హమ్మయ్య' అని తేలికగా గాలి పీల్చాడు నాయుడు.

24

చీఫ్ ఇంజనీర్ అశోక్ గిరి గజ ఈతగాళ్ళు నూకరాజు, పైడితల్లికి షేక్‌హేండ్ యిచ్చి "విష్ యూ ఆల్ సక్సెస్" చెప్పాడు.

ఇద్దరూ ఒకేసారి రిజర్వాయర్లోకి దూకారు. ఆక్సిజన్ సిలెండర్స్ వీపుకి కట్టుకుని దిగారు కాబట్టి నీటిలో ఎంత సేపైనా వుండొచ్చు.

చీఫ్ ఇంజనీర్ అనుమానం నిజమే అయింది. పెన్ స్టాక్ పైప్స్‌కి పాత యినుప సామాను అడ్డుపడింది. ఎక్కడివో రేకు ముక్కలు వచ్చి పైపులకు అడ్డుగా నిలిచాయి. అందువల్ల నీరు పైపుల్లోకి యెక్కడం లేదు.

డామ్ పైన వున్న జైంట్ క్రేన్ ద్వారా పొడవాటి తాడుకి యినుప రేకులు కట్టి పైకి లాగించారు. అడ్డు తొలగించడానికి నాలుగు గంటలు పట్టింది.

సాయంకాలం ఐదు గంటలు దాటింది. ఆకాశంలో నల్లమబ్బులు క్రమ్ముకున్నాయి.

లోపల నూకరాజు, పైడితల్లికి చీకటిపడినట్లనిపించింది. ఇక పైకి వెళ్ళిపోదామని యిద్దరూ నిర్ణయించుకున్నారు.

ఇంతలో ఎర్రటి వెలుగు కనిపించింది పైడితల్లికి. అతనికి ఆశ్చర్యం వేసింది. నూకరాజుకి చూపించాడు ఆ వెలుగు.

ఫర్లాంగు దూరంలో నీటిలోనుంచి ఆ వెలుగు వస్తు

న్నది. నూకరాజుకి ఏమీ అర్థంకాలేదు. అలా చూస్తూ వుండగానే ఆకుపచ్చ వెలుగు దూసుకుని వచ్చింది.

అదేమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగింది యిద్దరికీ. నీటిలో చేపలవలె సర్రున దూసుకుంటూ ఎరుపు ఆకుపచ్చ వెలుగు వచ్చిన వైపుకి బయల్దేరారు.

లోపల నీరు స్వచ్ఛంగా వుంది. అడుగు, రెండడుగుల చేపలు మొదలు, అంగుళం పొడవున్న చేపపిల్లల గుంపులు యెన్నో కనిపిస్తున్నాయి. అవి యెన్నడూ చూడని మానవాకారాలని చూసి భయంతో పారిపోతున్నాయి.

దాదాపు పందమైళ్ళ వైశాల్యం గల రిజర్వాయర్ లోపల అంతా ఓరీ కనిపించడం లేదు వాళ్ళకి. అప్పటికే గంటల తరబడి పనిచెయ్యడం వలన అలసటగా కూడా వుంది.

రంగుల కిరణాలకు సూటిగా ప్రయాణం చేస్తున్నారు. ఆ కిరణాలు వెలుగు దగ్గరయ్యే కొద్దీ బంగారు రంగులో ధగ ధగ లాడుతున్న గోళం కనిపించింది. ఆ కిరణాలు ఆ గోళంలో నుంచే ప్రసారమవుతున్నాయి.

పైడితల్లి. నూకరాజు సంభ్రమాశ్చర్యాలతో ఆ గోళం చుట్టూ తిరగసాగారు.

అంత పెద్ద గోళం నీళ్ళ అడుగున యెందుకు వుందో? అది ఒక సబ్‌మెరీన్ యేమో? అందులో మనుష్యులు వుండి వుంటారు. అందులోకి పోవడానికి తలుపు వుండి వుంటుంది. ఆ తలుపు యెక్కడుందో తెలుసుకోవడానికి దాన్ని చేతులతో తడిమారు. నున్నగా జారిపోతున్నాయి చేతులు. తలుపు యెక్కడుందో తెలియడం లేదు.

ఇంతలో గోళం తలుపు తెరుచుకుంది. తెల్లటి దుస్తులో

వున్న ఆజానుబాహుడైన మనిషి అందులో నుంచి దిగాడు.

అతని చేతిలో పిస్టల్ నుంచి రెండు సార్లు తెల్లటి కిర ణాలు దూసుకొచ్చాయి. మరుక్షణంలో పైడితల్లి, నూక రాజులకు భూమ్మీద చెల్లాల్సిన నూకలు నీళ్ళలో చెల్లి పోయాయి.

వెండికొండ పవర్ హౌస్‌లో రెండు యూనిట్లు యధా ప్రకారం పని ప్రారంభించాయి.

చీఫ్ ఇంజనీర్ అశోక్ గిరి సంతోషించాడు. పైడితల్లి నూకరాజులకు ఘనంగా ముట్టజెప్పాలని అనుకున్నాడు.

ఆరుగంటలైంది.

ఆకాశం నుంచి చీకటి తెరలు తెరలుగా భూమిమీదకు జారుతోంది.

డామ్ పైన లైట్లు వెలిగాయి.

లోపల అడ్డు తొలగించే కార్యక్రమం పూర్తయింది. పైగా చీకటి పడింది. పైడితల్లి, నూకరాజు యింకా పైకి యెందుకు రావడం లేదు? లోపల యేం చేస్తున్నారు? అక్కడున్న అందరి బుర్రల్లోనూ అదే ఆలోచన.

చూస్తుండగానే ఏడు గంటలైంది.

అశోక్ గిరి మనసులో యేదో శంక ప్రారంభమైంది.

"మిష్టర్ భార్గవ! వీళ్ళింకా పైకి రాలేదేమిటి? ఏదైనా ప్రమాదం జరుగలేదు గదా?"

భార్గవ గుండె వేగంగా కొట్టుకుంది. శ్రీనివాసులు నాయుడు మనసులో అనుమానం పొడసూపింది. చేపల వాళ్ళు అన్నట్లు యే మొసలైనా పొట్టన పెట్టుకోలేదు గదా? అయినా యిద్దరూ ఒకేసారి ప్రమాదానికి గురికావడం సంభవమేనా?

ఎక్కడో వైజాగ్ నుంచి వచ్చారు పాపం. ఏమై

పోయారో? ఎలా తెలుస్తుంది? ఈ చీకట్లో ఎలా వెతకాలి?

ఛీఫ్ ఇంజనీర్ బుర్ర ఖరాబై పోతోంది ఆలోచనలతో.

ఛీఫ్ ఇంజనీర్ వెంటనే స్టీమ్ బోట్లు రెండు తెప్పించాడు. వాటిలో సెర్చిలైట్లు అరేంజి చేసి రిజర్వాయర్లో అంతా వెతకమని ఆదేశించాడు.

స్టీమ్‌బోట్లు బయల్దేరి సెర్చిలైట్లు వేసుకుంటూ అర్ధరాత్రి వరకూ వెతుకుతూనే వున్నాయి.

25

"వాళ్ళని మర్డర్ చెయ్యడం ఏమీ బాగాలేదు మిల్లర్!" అంది సారా టైలర్.

"మరేం చెయ్యాలంటావ్?" అన్నాడు మిల్లర్ విసుగ్గా.

"లోపలకు తీసుకుని రావాల్సింది. సంగతి యేమిటో తెలిసేది. ఎందుకొచ్చారో ఏమిటో తెలుసుకునేవాళ్ళం" అంది ఆమె.

"అటువంటి ప్రయత్నం చేస్తే వాళ్ళిద్దరూ కలిసి నన్ను మట్టు పెట్టి తర్వాత నీ పని పట్టేవాళ్ళు" అన్నాడు మిల్లర్.

"అయితే వాళ్ళు మన వునికి తెలుసుకుని వచ్చారంటావా?"

"కరెక్ట్‌గా అంతే! సరదాగా యింత లోతుకు ఎవడూ రాడు. అందులో యిది సముద్రం గూడా కాదు. కేవలం రిజర్వాయర్. ఆక్సిజన్ సిలండర్స్‌తో గూడా వచ్చారంటేనే అర్థంచేసుకోవచ్చు. ఎంతసేపైనా నీళ్ళలో వుండటానికి సిద్ధపడి వచ్చారని."

"వాళ్ళ శవాలు పైకి తేలితే యెలా? మరి కొందరు రావచ్చు" కంగారుగా అంది ఆమె.

"అదే ఆలోచిస్తున్నాను. కాని వాళ్ళ శవాలు పైకి

తేలవు. శరీరాలని నైలాన్ తాళ్ళతో కట్టేసి ఒక బండ రాయికి వ్రేలాడదీశాను. అవి అట్టడుగుకు వెళ్ళిపోయాయి. ఇక అవి పైకి తేలే ప్రశ్న లేదు. మొసళ్ళు, చేపలు తిన్న తర్వాత అస్థిపంజరాలై చెల్లా చెదురైపోతాయి. అందుకు చాలా కాలం పడుతుంది."

"వాళ్ళు పైకి వెళ్ళకపోయినా ప్రమాదమే. వెళ్ళిన వాళ్ళు రాకపోతే మరి కొందరు వీళ్ళను సెర్చి చేస్తూ రావచ్చు" అంది హైలన్.

"ఆ మాటా నిజమే!"

"ఇప్పుడేం చెయ్యాలి?"

"జాన్‌ని కన్సల్ట్ చేస్తాను" అన్నాడు మిల్లర్.

మిల్లర్ 'ట్రాన్స్మిటర్' రూమ్‌లోకి వెళ్ళాడు. అతని వెనుకే హైలర్ ప్రవేశించింది. అతను ఏరియల్ స్విచ్ నొక్కాడు. ఏరియల్ తీగ నీళ్ళను చీల్చుకుంటూ పైకి వెళ్ళింది. కొన్ని నిముషాల్లోనే అది నీళ్ళపైకి తేలింది. ఏరియల్‌కి గాలి తగలగానే ట్రాన్స్మిటర్ పనిచేయ సాగింది.

"జాన్....జాన్....మిష్టర్ జాన్."

"యస్....జాన్....స్పీకింగ్."

"మిల్లర్ .... ఐ యామ్ మిల్లర్ .... ఫ్రమ్ గోల్డెన్ లాండ్."

"గుడ్ మార్నింగ్ మిస్టర్ మిల్లర్."

"గుడ్ మార్నింగ్ జాన్."

"వాటీజ్ ద న్యూస్?"

"జాన్. ఇక్కడొక ప్రమాదం వచ్చింది."

"ఏం జరిగింది మిల్లర్? అన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయా?"

"అంతా బాగానే వుంది. కాని మన గోల్డెన్ లాండ్ రిజర్వాయర్లో వున్నట్లు ఎవరో పసిగట్టారు. ఇద్దరు లాండ్ చుట్టూ తిరుగుతుంటే కాల్చి చంపాను."

"వాట్! ఎవరు పసిగట్టాడు? హౌ ఇటీజ్ పాజబుల్! అంత లోతుకు యెలా వచ్చారు వాళ్ళు?" జాన్ ఆందోళన ప్రకటించాడు.

"వాళ్ళు ఆక్సిజన్ సిలెండర్స్‌తో సహా వచ్చారు జాన్. ఎలాగో మన వునికి తెలుసుకుని వచ్చారు. అందుకే కాల్చి చంపాను. ఎట్టి పరిస్థితులలోనూ మన గురించి యెవరికీ తెలియగూడదని బాస్ ఆజ్ఞ కదా!"

"మంచి పని చేశావు. కాని వాళ్ళు ఎలా తెలుసుకున్నారని ఆలోచిస్తున్నాను. ఒకవేళ దట్ ఇండియన్ లీక్‌చేసి వుంటాడా?" అన్నాడు జాన్.

"చైతన్య అటువంటి మనిషి కాదు జాన్. హీ ఈజ్ వెరీ సిన్సియర్. బాస్ అతన్ని పూర్తిగా నమ్మాడు."

"ఏమో మిల్లర్! ఆపుకోలేక తన క్లోజ్ ఫ్రెండ్స్‌కి చెప్పాడేమో!"

"నో....నో!" అన్నాడు మిల్లర్.

"అతన్ని వెంటనే రమ్మని మెసేజ్ యిచ్చావు గదా!"

"ఇచ్చాను జాన్. అతను యింకా రాలేదు."

"ఎందుకు రాలేదు?"

"ఏమో జాన్. అతన్నించి రెస్పాన్స్ లేదు. షెడ్యూల్ టైమ్‌కి అతను వస్తాడని నమ్ముతున్నాను."

"రెస్పాన్స్ ఎందుకు లేదు? ఒకవేళ అతనికి ఏదైనా ప్రమాదం జరగలేదు గదా!"

"అతనికి ప్రమాదమా? ఇంపాజిబుల్ జాన్. అతని దగ్గర రెడ్ స్ప్రేయర్ వుంది. దాంతో ఎంతటి ప్రమాదం

నుంచి అయినా తప్పుకోవచ్చు."

"అతన్ని వెళ్ళనియ్యకుండా వుండాల్సింది మిల్లర్. అతను ఏదైనా పొరపాటున నోరు జారితే మన పథకం పూర్తిగా పాడైపోవచ్చు."

"నీ కా భయం అక్కర్లేదు జాన్. అన్నీ సవ్యంగా జరుగుతాయి. ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటావు చెప్పు? ఇక్కడే వుంటే ప్రమాదమని జంకుగా వుంది."

"స్థావరం షిఫ్టు చెయ్యి."

"ఎక్కడికి?"

"మహాసాగర్ రిజర్వాయర్‌లోకి. అది కూడా నాలుగు వందల అడుగుల లోతు వుంది. అదీకాక యిక్కడికి అంతే దూరం ఉంటుంది. నో ప్రాబ్లెమ్" అన్నాడు జాన్.

"దట్సాల్ రైట్ జాన్. కాథరిన్ యెలా వుంది?" అన్నాడు మిల్లర్.

"ఓ....మిల్లర్! నీకు చెప్పడం మరిచాను. కాథరిన్‌కి వంట్లో బాగా లేదు. తేనెటీగలు వంటి నిండా కుట్టిపెట్టాయి. మూలుగుతూ పడుకుంది."

"కాథరిన్ వాటి జోలికి ఎందుకు వెళ్ళింది?"

"పెంపుడు ఈగలు అనుకుందేమో!" అని నవ్వాడు జాన్.

"ఓవర్ జాన్."

"ఓ.కె. మిల్లర్. స్థావరం షిఫ్టు చేసిన తర్వాత నాకు తెలియజెయ్యి. చైతన్యకు గూడా స్థావరం మహాసాగర్ రిజర్వాయర్‌లోకి మారుస్తున్నట్లు మెసేజ్ యివ్వు."

"ఓ.కె. జాన్."

"ఓ.కె. మిల్లర్."

మిల్లర్ చైతన్యకు మెసేజ్ పంపటానికి చాలా ప్రై

చేశాడు. ట్రాన్స్మిటర్ పవర్ పెంచి చూశాడు. కాని చైతన్యకు మెసేజ్ అందిన సూచనలు ఏమీ కనిపించలేదు. అతన్నుంచి రెస్పాన్సు ఏమీ రాకపోయేసరికి మిల్లర్‌కి విసుగు పుట్టింది. ట్రాన్స్మిటర్ ఆఫ్‌చేసి ఏరియల్ ముడిచి వేశాడు.

ఇద్దరూ ట్రాన్స్మిటర్ రూమ్‌నుంచి బయటకు వచ్చారు.

"ఇప్పుడు టైమెంత అయింది?" అన్నాడు మిల్లర్.

"రాత్రి పన్నెండు దాటింది. ఇండియన్ స్టాండర్డ్ టైమ్" అంది టైలర్ చేతి వాచీ చూసి.

"నాకు చాలా అలసటగా వుంది టైలర్" అన్నాడు అతను తన దుస్తులు విప్పి నైట్ డ్రెస్‌లోకి మారిపోతూ.

"కాని టైలర్, నీకు బోర్‌గా లేదూ? ఎప్పుడూ యీ గోళంలో కూర్చుని బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా కాలం గడుపుతూ వుంటే!" అన్నాడు మిల్లర్ ఆప్యాయంగా.

"భలేవాడివే మిల్లర్! నువ్వు నా కళ్ళ ఎదుట వున్నంత సేపూ నా కేమీ బోర్‌గా వుండదు. ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది కూడా! ఈ ప్రపంచంలో యెవరికి దొరుకుతుంది యిటువంటి అదృష్టం? సంవత్సరాల తరబడి ఏకాంతంగా ప్రేమికులు కాలం గడపడం కంటే కావలసింది ఏముంది? ఇటువంటి అవకాశం దొరికినందుకు నాకు ఎంతో గర్వంగా వుంది మిల్లర్! ఐ యామ్ వెరీ హేపీ!" గర్వంగా అంది టైలర్.

"నేను నిద్రపోతాను టైలర్. తెల్లవారుజామున నాలుగు గంటలకు మనస్థావరం మార్చుదాం. ఏర్పాట్లన్నీచేసి నన్ను నిద్రలేపు" అన్నాడు అతను.

"అలాగే మిల్లర్. తెల్లవారు జామున వెలుగుంటుంది.

ఈ చీకట్లో కుదరదుగూడా! కాసేపు నిద్రపోదాం" అంది షైలర్.

షైలర్ తన దుస్తులన్నీ తీసివేసి తెల్లటి నైట్‌గౌన్ వేసుకుంది. పల్చటి నైట్‌గౌను వుందా లేదా అన్నట్లు ఆమె శరీరంలోని వంపులన్నింటినీ స్పష్టంగా బహిర్గతం చేస్తోంది.

మిల్లర్ ఆమె చేతిని అందుకుని తమకంతో ఆమెను తనవైపు లాక్కున్నాడు. ఇద్దరూ బెడ్‌మీదకు వొరిగి పోయారు.

26

తెల్లవారు జామున నాలుగు గంటలకు నిద్రలేచింది సారా షైలర్.

ఆమె ప్రక్కనే మిల్లర్ గాఢనిద్రలో వున్నాడు. అతను నిద్రలేమికి తట్టుకోలేడు. ఎనిమిది గంటలు నిద్ర పోతేగాని అతనికి తృప్తిగా వుండదు. మధ్యలో లేపితే అదోలా ప్రవర్తిస్తాడు. అలసటగా వుంటుందని అంటూ వుంటాడు.

అందుకే ఆమె అతన్ని నిద్ర లేపదల్చుకోలేదు. అతను నిద్రలో వుండగానే 'గోల్డెన్ లాండ్'ని వెంపకొండ రిజర్వాయర్‌లో నుంచి మహాసాగర్ రిజర్వాయర్లోకి మార్చేసి అతన్ని ఆశ్చర్యంలో ముంచాలని ఆమె అనుకుంది.

ఆమె బాత్‌రూంలోకి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని స్నానంచేసి డ్రెస్ మార్చుకుంది. శరీరానికి అంటుకుపోయిన ఆలీవ్ గ్రీన్ ముతకబట్టలు పనిచేస్తున్నంత సేపూ యాక్టివ్‌గా వుంచుతాయి ఆమెను.

కిచెన్‌లోకి వెళ్ళి నాలుగు కప్పుల టీ తయారుచేసింది. తనొక కప్పు తీసుకుని మిగిలిన టీ ఫ్లాస్కులో వుంచింది.

నీళ్ళలో కొన్ని వందల అడుగుల లోపలవున్న గోళం ఒక్కసారిగా పైకి లేవదు. కొన్ని ఫర్లాంగులు ముందుకు నడిపి తర్వాత పైకి లేపాలి. ఇంజన్ స్టార్టు అయిన తర్వాత మీటమీద చెయ్యివుంచి తీసేలోపునే రెండుమూడు ఫర్లాంగుల దూరం వెళ్ళిపోతుంది. వెంటనే పైకి పోనివ్వాలి.

అప్పుడు రెండు సెకండ్లలో నీటిని చీల్చుకుని అమితమైన వేగంతో ఆకాశంలోకి లేచి నాలుగైదు కిలోమీటర్ల పైకి వెళ్ళిపోతుంది. మబ్బుల్లో దాక్కుంటుంది. ఆ చుట్టు ప్రక్కల వున్నవాళ్ళకి శబ్దం వినపడినా అదేదో విమానం అనుకుంటారు. ఆకాశంలో దాన్ని వెతికేలోపలే కనుమరుగైపోతుంది.

సామాన్యంగా మిల్లర్ ఆపరేట్ చేస్తుంటాడు. షైలర్‌కి అంతా తెలిసినా ఆమె మిగిలిన పనులే చూస్తూ వుంటుంది. కాని సాహస కార్యాలు చెయ్యాలనే కుతూహలంతో ఆమె గోల్డెన్ లాండ్‌ని ఆపరేట్ చెయ్యాలని నిశ్చయించుకొంది.

షైలర్ కాబిన్‌లో కూర్చుని ఇంజన్ స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చింది. అంతలోనే ఆమె అదిరిపడేటట్లు గోళం దేన్నో గ్రుద్దుకొంది. ఆమె సడన్‌గా ఇంజన్ ఆపేసింది.

ఆమె అజాగ్రత్తవలన గోల్డెన్ లాండ్ వెళ్ళి వెండి కొండ డామ్‌కి ఢీ కొట్టింది.

నిద్రలో వున్న మిల్లర్ హఠాత్తుగా లేచిపోయాడు. ఆ కుదుపుకి అతను బెడ్‌మీదనుంచి ప్రక్కకు పడిపోయాడు. ఒక్క నిముషం అతను అయోమయంలో ఉండిపోయాడు. ఏం జరిగిందో అతనికి అర్థం కాలేదు. కళ్ళు తెరిచి చూసేసరికి బెడ్ క్రిందకు పడిపోయి వున్నాడు.

అదే సమయంలో షైలర్ కాబిన్‌లోనుంచి వచ్చింది.

"ఏం జరిగింది?" అన్నాడతను.

"నేను ఇంజన్ ఆపరేట్ చేశాను. సూటిగా పోయి పైకి పోవాలి గదా! నేను సూటిగా వెళ్ళడానికి ప్రయత్నించాను. కాని మన గోల్డెన్‌లాండ్ సరాసరి వెళ్ళి ఒక గోడకు ఢీకొన్నది. నేను వెంటనే ఇంజన్ ఆపాను" ఆమె అంతా వివరంగా చెప్పింది.

జరిగింది విని అతను అదిరిపడ్డాడు.

"చంపావు ఫో. నువ్వు ఢీకొన్నది డామ్ గోడని. బహుశా అది పగిలిపోయిగూడా వుండవచ్చును. కొంప మునిగింది. మనం ఇక్కడ ఒక్క క్షణం గూడా వుండ గూడదు" అన్నాడు మిల్లర్ కంగారు పడిపోతూ.

"ఐయామ్ సారీ మిల్లర్." అంది టైలర్ దిగులుగా.

"అసలు నువ్వెందుకు ఆపరేట్ చేశావు. నన్ను నిద్ర లేపితే నీ సొమ్మేంపోయింది....?" అతను కోపంగా అడిగాడు.

అతని కోపం చూసి టైలర్‌కి దుఃఖం వచ్చింది. ఆమె ఏడుస్తూ టైలర్ మెడ చుట్టూ చేతులువేసి తల గుండెకు ఆనించింది.

"నిన్ను నిద్ర లేపగూడదని అలా చేశాను మిల్లర్. అంతకంటే మరేంలేదు. ప్లీజ్ ఎక్స్యూజ్‌మి మిల్లర్! అయామ్ వెరీవెరీ సారీ!"

మిల్లర్‌కు ఆమె ఏడుపు చూడగానే కోపమంతా యెగిరి పోయింది.

"దట్సాల్‌రైల్ టైలర్. ఇక నీ ఏడుపు ఆపు" అన్నాడు అతను.

"మన గోళానికి ఏదైనా నష్టం జరిగివుండదు గదా! ఏదైనా జరిగితే బాస్ మనల్ని క్షమించడు. ఆయన ఆగ్ర

హానికి గురికాక తప్పదు" అంది ఆమె విచారంగా.

"మన గోళానికి ఏమీ జరగదు టైలర్! ఎంతో పటిష్టంగా తయారుచేశాడు బాస్. మనం ఆకాశంలో తిరుగుతున్నప్పుడు ఏదైనా బ్రహ్మాండమైన ఉల్క ఢీకొడితే యెలా? అని ఆలోచించి నిర్మించారు దీన్ని. ఎంత పెద్ద ఉల్క ఢీకొన్నా దీనికి ఏమీ నష్టంలేదు. ఉల్క పగిలిపోవలసిందే తప్ప ఇది చెక్కుచెదరదు" అన్నాడు మిల్లర్,

"అయితే ఏమీ నష్టం జరిగివుండదన్న మాట" అంది టైలర్ ఆనందంతో.

"ఏమీకాదు. కాకపోతే ఇది ఢీకొన్నందు వలన డామ్‌కి నష్టం జరిగివుండవచ్చును. అందువలన నేను విచారిస్తున్నాను."

"ఇప్పుడు ఏం చెయ్యాలి మనం?"

"అంతా నేను చేస్తాను. నువ్వు చూస్తూ వూరుకో!" అంటూ అతను కాబిన్‌లోకి వెళ్ళాడు.

గోళాన్ని గుండ్రంగా తిప్పాడు. ముందుకు కదిలి మైలు దూరం దూసుకుపోయి పైకి లేచింది. రెండు సెకండ్లలో ఆకాశంలో నాలుగైదు కిలోమీటర్లు వెళ్ళిన తర్వాత గోళాన్ని భూమి చుట్టూ త్రిప్పసాగాడు.

"మనం జరిగిందంతా జాన్‌కి చెప్పుదాం!" అన్నాడతను.

ఆమె తల వూపింది.

"డామ్‌కి పెద్దప్రమాదం జరిగివుంటే ఎవరికైనా అనుమానం రావచ్చు. అంతవరకూ మనం యిలా భూప్రదక్షిణాలు చేస్తూవుందాం. లేదా సముద్రంలో దాక్కోవాలి" అన్నాడు మిల్లర్.

27

వెండికొండ డామ్‌మీద ఇరవై నాలుగు గంటలూ సాయుధ పోలీసులు కాపలావుంటారు. విదేశీవ్యక్తులుగాని, దేశం లోని అరాచకులుగాని డామ్‌కి ప్రమాదం కల్పించకుండా అహర్నిశలూ అప్రమత్తతతో వుంటారు సెక్యూరిటీ గార్డులు. వంతులవారీగా ఎనిమిది గంటల కొక బ్యాచ్ డ్యూటీలో వుంటారు.

వాళ్ళే కాకుండా వాటర్ లెవల్ ప్రమాణం చెక్‌చేసి ఫోన్‌ద్వారా అధికారులకు తెలియజెయ్యడానికి డామ్‌కి సంబంధించిన వుద్యోగులు గూడా నైట్ డ్యూటీ చేస్తూ వుంటారు.

డామ్ క్రిందభాగాన పవర్ హౌస్‌లో సిబ్బంది వుంటారు. కాని డామ్‌పైన ఏమి జరిగినా వాళ్ళకు తెలిసే అవకాశం లేదు. డామ్ దిగువభాగంలో దాదాపు నాలుగువందల అడుగుల క్రింద వుంటుంది పవర్ హౌస్.

అప్పుడు సమయం నాలుగున్నర దాటింది.

డామ్ పైభాగం దాదాపు మైలు పొడుగు వుంటుంది. ఆ మైలు పొడుగునా ఒక్క మనిషి గూడా లేడు. సెక్యూరిటీ గార్డులు టవర్‌లో పడుకుని నిద్రపోతున్నారు. టవర్ డామ్‌కి మధ్యభాగంలో వుంది. ఒకచివర టోల్‌గేట్ సిబ్బంది గదిలో ముడుచుకుని నిద్రలో పడిపోయారు. మరొకచివర చెక్‌పోస్టు వాళ్ళు గేటుకట్టేసి జోగుతున్నారు.

పొగమంచు బాగా కురుస్తోంది. డామ్‌పైన లైట్లు మంచు ప్రభావంవల్ల మినుకు మినుకుమంటున్నాయి.

డామ్‌మీద క్రెస్ట్‌గేటు ప్రక్కన రేకుల గదిలో బల్లమీద పడుకున్న వర్కు ఇన్‌స్పెక్టర్ సత్యంరెడ్డికి మెలకువ వచ్చింది. చెవులకు ఏదో శబ్దం వినిపిస్తోంది. లేచి కూర్చు

న్నాడు. ఏదో వినిపిస్తోందిగాని స్పష్టంగా తెలీదు. బల్లకు చెవి ఆనిస్తే బాగా వినిపిస్తోంది.

'గమ్మత్తుగా వుందే' అనుకున్నాడు.

లేచి వళ్ళు విరుచుకున్నాడు. స్వెట్టర్ వేసుకున్నా చలి ఆగడంలేదు. మఫ్లర్ తలచుట్టూ కట్టుకున్నాడు. రేకు తలుపు నెట్టుకుని గదిలోనుంచి డామ్‌మీద అడుగుపెట్టాడు.

అంతే!

డామ్‌ని ఏదో గుద్దుకున్నట్లు పెద్ద శబ్దమైంది. కాళ్ళు కదిలిపోతున్నాయి. డామ్ గజగజ వణుకుతున్నట్లయింది. అతను తూలిపోయి వెల్లకిలా పడిపోయాడు.

అతని తల దిమ్మెక్కిపోయింది. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపల అతని కళ్ళు మూతలుపడిపోయాయి. తెలివితప్పి పడిపోయాడు.

కొంతసేపటికి అతనికి స్పృహ వచ్చింది. నెమ్మదిగా కళ్ళువిప్పి చూశాడు. అతని చుట్టూ తుపాకులు పట్టుకున్న పోలీసులు కనిపించారు.

"ఏం జరిగింది?" అన్నాడతను లేవడానికి ప్రయత్నిస్తూ.

"ఏమో రెడ్డిగారూ! మాకూ అర్థం కావడంలేదు. భూకంపం వచ్చినట్లుంది. కిటికీ తలుపులు కొట్టుకున్నాయి, బల్లమీద పడుకున్న నేను క్రిందపడిపోయాను. అంతా కంపించిపోయింది కొన్ని క్షణాలు" అన్నాడు ఒక గార్డు.

సత్యంరెడ్డిని లేపి నిలబెట్టారు. తలకు దెబ్బతగిలి నెత్తురు కారింది. అతని తలకి ఫస్ట్ ఎయిడ్ చేసి కట్టుకట్టి కూర్చోబెట్టారు.

ఇంతలో ఒక గార్డు గావుకేక పెట్టాడు. "అరే భాయ్!" అంటూ.

అంతా తెల్లబోయి "ఏమిటి?" అన్నాడు ఆతృతతో.

"అదుగో అటు చూడండి!" అతను చేతిని చాచాడు.

డామ్‌పైన రోడ్డు అడ్డంగా పగిలినగుర్తు కనిపించింది. దాదాపు ఆరు అంగుళాల వెడల్పున బీటలు కనిపించాయి. పిట్టగోడ దగ్గర్నుంచి ఆ పగులుడు వుంది. సత్యంరెడ్డి పిట్టగోడ దగ్గర నిల్చుని డామ్‌ని పరిశీలించి చూశాడు. బ్యాటరీ లైట్ ఫోకస్ చేశాడు. ఆ పగులు డామ్ పొడుగునా కనిపించింది. నెమ్మదిగా నీళ్ళు లీక్ అవుతున్నాయి.

అతని గుండె దడదడ కొట్టుకుంది. శరీరం గజగజ వణికిపోసాగింది. భయంతో అతనికి చేతులు కాళ్ళు ఆడడం లేదు.

"డామ్ పగిలిపోయింది" అన్నాడతను పిచ్చివాడిలా పరుగుపెడుతూ.

సత్యంరెడ్డి ఆ మాట అనగానే సెక్యూరిటీ గార్డులు మూటా ముల్లె సర్దుకుని బూట్లు శబ్దం చేసుకుంటూ పరుగులు తీశారు.

కొద్దిసేపటికి అంతా చెక్‌పోస్ట్ దగ్గరికి వచ్చారు. అక్కడ రెండు లారీలు ఆగివున్నాయి. సిబ్బంది లారీలో సామాను చెక్ చేస్తున్నారు. డ్రైవర్లు సిగరెట్లు కాలుస్తూ నిల్చున్నారు.

డామ్‌పై నుంచి పరిగెత్తుకొస్తున్న వాళ్ళను చూసి చెక్‌పోస్ట్ వాళ్ళు అయోమయంలో పడిపోయారు. బూటు శబ్దం, కాకీబట్టలు చూసి వాళ్ళని పోలీసులుగా గుర్తుపట్టారు. పోలీసులు ఎందుకు పారిపోయి వస్తున్నారో వాళ్ళకి చచ్చినా అర్థంకాలేదు.

"ఏం జరిగింది ఎందుకు పరిగెత్తుతున్నారు?" అంటూ ఆతృతతో ప్రశ్నించారు.

అపరాధ పరిశోధన పోటీ-163

[ఫలితాలు]

ఫిబ్రవరి' 82 నెల "అపరాధ పరిశోధన పోటీ— 163"కి సరియైన సమాధానాలు:

1. పోలెండు.
2. దోమలు.
3. హంతకులు.
4. మంత్రులు.
5. శాస్త్రీయ సంగీతం.

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మే '82 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ ఎమ్. శ్రీనివాస్ ఆర్య,
3—3—73B, కంచర బజార్,
సికింద్రాబాదు — 3.

(2) శ్రీమతి టి. పద్మావతిదేవి, బి. ఎస్. సి.,
w/o టి. ఎస్. ఎస్. వి. బి. ప్రసాద్,
బి IV సెక్షన్,
ఆఫీస్ ఆఫ్ ద రిజిస్ట్రార్,
ఆంధ్రా యూనివర్శిటీ,
వాల్తేరు—530003.

(3) శ్రీమతి ముదుకుట్ల కుమారి,
c/o వెంకటరత్నం,
సంకురాత్రిపాడు—పోస్ట్,
చిలుకలూరిపేట—తాలూకా,
(గుంటూరు జిల్లా)

పోలీసులు రొప్పుకుంటూ అన్నారు.

"డామ్ పగిలిపోయింది."

కరెంట్ షాక్ తగిలిన వాళ్ళలా ఎక్కడి వాళ్ళక్కడ నిలబడిపోయారు.

"ఏమిటీ నిజమా? ఎలా పగిలింది?"

"మీకు తెలీదా? భూకంపం వచ్చింది. డామ్ పగిలింది."

సత్యంరెడ్డి ఫోన్ రిసీవర్ ఎత్తి వాళ్ళ సూపర్‌వైజర్‌కి ఫోన్ చేశాడు.

చాలా సేపటివరకూ ఎవరూ ఎత్తలేదు. పదినిమిషాల తర్వాత ఎవరో ఎత్తారు.

"హల్లో! సూపర్‌వైజర్‌గారేనా?"

"ఎవరు మీరు?"

"నేను సత్యంరెడ్డిని, కాంప్ ఇన్‌స్పెక్టర్ని. డామ్ సైట్ నుంచి మాట్లాడుతున్నాను. సూపర్‌వైజర్‌గారితో మాట్లాడాలి."

"ఆయన నిద్రపోతున్నారు."

"ప్లీజ్! లేపండి."

"ఎందుకు?" అంది ఆమె.

"అమ్మా! చాలా అర్జెంట్. ఇక్కడ డామ్‌కి ప్రమాదం జరిగింది. పగిలి బీటలు వచ్చాయి."

"ఏమిటీ!"

"అవునమ్మా! ఇప్పుడే భూకంపం వచ్చింది. మీరు గమనించలేదా!"

"ఏమో నిద్రపోతున్నాం. మాకు తెలీలేదు. ఆయన్ని నిద్ర లేపుతాను."

విషయం వినేసరికి సూపర్‌వైజర్‌గారికి నిద్రమత్తు

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 43: మోహన్ ఇంట్లో మధు అద్దెకుచేరాడు. ఇంటద్దె నెలకు వందరూపాయలు. ఇది కాక నల్లా నీళ్ళు వాడుకున్నందుకు నెలకు 5 రూ.లు, ఎలక్ట్రిసిటీ ఎంతైతే అంతా కట్టుకోవాలి.

కొన్ని నెలలు బాగానే గడిచింది. తర్వాత ఇద్దరికి పేచీ వచ్చింది. మధును ఇల్లు ఖాళీచేయమన్నాడు. మధు ససేమిరా ఖాళీచేయనన్నాడు. మోహన్‌కు ఒళ్ళుమండి నల్లాలో నీళ్ళు రాకుండా చేశాడు. దానిపై మధు కోర్టు కెక్కాడు.

నల్లా వాడుకున్నందుకు నెలకు 5 రూపాయలు వసూలు చేశాననీ, వాడుకోనప్పటినుండీ అలా 5 రూ.లు. వసూలు చేయటంలేదనీ, తన కలా చేసే హక్కుందనీ మోహన్ వాదించాడు.

మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-4-'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమ మైన తీర్పుకు 6 నెలలపాటు పత్రిక బహుమతిగా పంపుతాము. ఫలితాలు జూన్ '82 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 41 (తీర్పు)

రఘు సగం నష్టపరిహారం ఇవ్వనక్కరలేదు.

బుద్ధిపూర్వకంగా చేసిన తప్పుకు "ఈ తప్పులో నీ భాగం ఇంత ఇచ్చుకో" అని అడిగే అధికారం ఎవరికీ లేదు. రఘు, రవికి రు. 250/-లు ఇవ్వనవసరం లేదు.

ఈ నెల న్యాయనిర్ణేత : డాక్టర్ ఎస్.వి.సుధీర్, 1-2-299, గగనమహల్ రోడ్, హైద్రాబాదు.

దెబ్బకి వదిలిపోయింది.

"ఆఁ...." అంటూ పక్కమీద నుంచి దూకి ఒక్క అంగలో టెలిఫోన్ దగ్గరకెళ్ళాడు.

"వాట్ రెడ్డీ!"

"సార్! ఇంత క్రితమే భూకంపం వచ్చింది. నేను బాగా అబ్జర్వ్ చేశాను. అప్పుడు నేను మన రూమ్ వదిలి డామ్మీద వున్నాను. భూకంపం వచ్చి పెద్ద శబ్దం అయింది. డామ్ బాగా కదిలింది. నిల్చున్న నేను వెనక్కి పడి పోయాను. తలకు దెబ్బ తగిలిందిగూడా!"

"అది సరే స్ట్రక్చర్ బీటలిచ్చిందా?"

"అవును సార్! ఆరంగుళాల వెడల్పున మధ్యకి పగి లింది. సార్ నాకు భయంగా వుంది. అది ఇంకా పెద్దదై డామ్ మధ్యకు విచ్చిపోతుందేమోనని."

"ఆ పగులు ఎక్కడ? ఏ బ్లాక్‌లో."

"మన రూమ్ ముందరే సార్! నలభై తొమ్మిదో బ్లాక్!"

వెంటనే ఇ.ఇ., ఎస్.ఇ., గార్లకు ఫోన్ చేసి సంగతి చెప్పారు. ఇంజనీర్లందరికీ నిద్రమత్తు వదిలిపోయింది. మతులు పోయిన వాళ్ళలా డామ్ సైట్‌కి బయల్దేరారు. జీప్‌లు రోడ్ల మీద పరిగెత్తాయి.

28

తెల్లవారుతూనే వెండికొండ ప్రాజెక్ట్ ప్రాంతం అట్టుడికి పోయింది డామ్ పగిలిపోయిందనే వార్తతో. జనం ముఖాలు గూడా సరిగ్గా కడుక్కోకుండా డామ్ సైట్‌కి బయల్దేరారు. పిల్లలు, పెద్దలు, ముసలీ ముతకా అంతా గుంపులు గుంపులుగా చేరారు.

ఫారము-4

1. ప్రచురణ స్థలము : హైద్రాబాదు-29.

2. ప్రచురణ కాలము : మాసపత్రిక.

3. ముద్రాపకుని పేరు : శ్యామ దామోదరరెడ్డి.
   జాతీయత : భారతీయుడు.
   చిరునామా : హైద్రాబాదు-29.

4. ప్రచురణకర్త పేరు : -డిటో-
   జాతీయత
   చిరునామా

5. సంపాదకుని పేరు : -డిటో-
   జాతీయత
   చిరునామా

6. వార్తపత్రికపై యాజమాన్యముగల వ్యక్తులు, భాగస్తులు పేర్లు చిరునామాలు : శ్యామ దామోదరరెడ్డి 3-4-554, నారాయణగూడ హైద్రాబాదు-29. (సోల్ ప్రొప్రయిటరు)

శ్యామ దామోదరరెడ్డి అయిన నేను, పై తెలిపిన వివరములు నాకు తెలిసినంతవరకు, నేను విశ్వసించినంత మేరకు సత్యమైనవని, ఇందు మూలముగా ప్రకటించుచున్నాను.

—శ్యామ దామోదరరెడ్డి
ప్రచురణకర్త సంతకం

తేది. 1-3-82

డామ్‌పైన రాకపోకలు బంద్ చేశారు. లారీలు బస్సులు, రెండువైపులా నిల్చిపోయాయి. కొన్ని బళ్ళు వెనక్కి వెళ్ళిపోయాయి.

ఆరువందల అడుగుల పొడుగు మైలు వెడల్పు వున్న వెండి కొండ డామ్ మధ్య సన్నటి పగులు నుంచి నీళ్ళు చిమ్ముతున్నాయి.

అధికారులు కాలుగాలిన పిల్లుల్లా అటూ ఇటూ తిరుగుతున్నారు. టన్నుల కొద్దీ సిమెంట్, లారీలతో ఇసుక చేరుస్తున్నారు. పగులు చిన్నదే అనీ, దాన్ని మరమ్మత్తు చేసి సరి చేస్తామని జనంతో చెప్తున్నారు.

ఆ పగులు ఇంకా పెద్దదై రిజర్వాయర్ నిండా వున్న నీళ్ళు ఒక్కుమ్మడిగా నదిలోకి దూకితే ఏం జరుగుతుందో ప్రజలు వూహించలేక పోతున్నారు.

అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడికి రిజర్వాయర్ దిగువన నదికి రెండు ప్రక్కలా ఎన్నో గ్రామాలు వున్నాయి. ఆ గ్రామాలన్నీ ఖాళీ చేయించవలసిందిగా వుత్తర్వులు జారీచేశారు.

దిన పత్రికలలో గోవిందరాయుడనే కంట్రాక్టర్ నలభై తొమ్మిదో బ్లాక్ కట్టాడనీ, సిమెంట్ అంతా అమ్ముకుని కట్టడపు పని సరిగా చేయనందువల్లనే ప్రమాదం సంభవించిందనీ, అధికారులు భూకంపం వల్ల జరిగిందని బుకాయిస్తున్నారనీ, భూకంపం వచ్చినట్లుగా అబ్జర్‌వేటరీలో రికార్డు కాలేదనీ ప్రముఖంగా ప్రచురణ అయింది.

దీనితో పాత గొడవలన్నీ త్రవ్వాయి పత్రికలు. గోవిందరాయుడు సిమెంట్ లారీలు పట్నానికి చేరవేస్తుండగా చైతన్య అనే యువకుడు పట్టిచ్చాడనీ కాని అతనే

అపరాధ పరిశోధన పోటీ-165

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-4-82 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూన్ '82 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. యీ ముఖ్యమంత్రిగారి ఉద్వాసన నిజంగా అవమానకరంగా జరిగింది—? (అంతూలే, అంజయ్య)
2. ఎరువుల ధరలు అత్యధికంగా వున్న దేశం—? (ఇండోనేషియా, ఇండియా)
3. ఈమధ్య జరిగిన రైలు ప్రమాదంలో ఇక్కడ జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమైనది—? (ఆగ్రా, సిర్పూర్)
4. దీనిని చంపటానికే ఉపయోగిస్తారు—? (వురి, తుపాకీ)
5. నేరమనస్తత్వం వీరిలో ఎక్కువగా వుంటుంది—? (త్రాగుబోతులు, దైవోపహతులు)

దొంగతనం చేశాడని కేసు పెట్టించారనీ ఇంతకంటే ఘోరం వుండదనీ, గోవిందరాయుడి వంటి అవినీతి పరులను ప్రభుత్వం రక్షించి నందువల్ల నే ఇటువంటి ప్రమాదం జరిగిందనీ సంపాదకీయాలు వ్రాశాయి.

దీనితో అధికారులకు పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్లైంది. వుక్కిరి బిక్కిరై పోయారు ఇందులోనుంచి ఎలా తప్పించుకోవాలో తెలియక.

తక్షణ చర్యగా గోవిందరాయుడిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు.

గోవిందరాయుడు లబలబ కొట్టుకున్నాడు. అతనప్పుడు హైదరాబాద్‌లోనే వున్నాడు. డామ్ సైట్‌లో పని పూర్తయినందువలన వర్క్స్ లేక మకాం హైదరాబాద్‌కి మార్చాడు. స్వంతంగా ప్లాట్లు కొని బిల్డింగ్స్ కట్టించి అమ్ముతున్నాడు. మరొకప్రక్క వెండికొండ కెనాల్స్ వర్క్స్ చేస్తున్నాడు.

సిమెంట్ బ్లాక్ మార్కెట్ కేసులో చిక్కుకోవడం, చైతన్య తన ఇంట్లో దొంగతనం చేసి వర్కర్స్‌కి పంచడం, ఛాలింజీ చేసి దొంగతనం చేసి మాయమై పోవడం అతనికి ఎంతో బాధగా వుంది. అవన్నీ చాలవన్నట్లు కూతురు అరుణతార, చైతన్యని ప్రేమించడం మరింత తలనొప్పి వ్యవహారంగా తయారైంది.

అవన్నీ అలా వుండగా డామ్‌కి పగులు ఏర్పడడం ఏమిటి? అదీ తను వర్క్స్ చేసిన నలభై తొమ్మిదో బ్లాక్‌లోనే ఎందుకు జరిగింది. ఇందులో చైతన్య ప్రమేయం ఏమైనా వుందా? వాడెందుకు తనని ఇలా వెంటాడుతున్నాడు?

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 100/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—4—'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు నగదు బహుమతితోపాటు ఐదు నెలల పత్రికను కూడా పంపుతాము. ఫలితాలు జూన్ '82 నెల సంచికలో చూడండి.

ఫిబ్రవరి '82 పోటీ ఫలితాలు

(1) ఫిబ్రవరి' 82 నెల "అపరాధపరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

హుషారైన నిషా!

నిషా కాదు తమాషా!!

పంపినవారు: కుమారి శేఖరమహంతి సుశీల, 9—1—243, అమర్‌నగర్, విశాఖపట్టణం—3.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

పడతికి కట్లు!

మృత్యువుకు మెట్లు!!

పంపినవారు : శ్రీ యన్. సత్యానంద్ మెయిన్ రోడ్, బెల్లంపల్లి—504251. (ఆదిలాబాదు జిల్లా)

పై విజేతలు ఇరువురికీ చెరొక రు. 25/-లు బహుమతి పంపబడుతుంది.

గోవిందరాయుడికి మతి చెడిపోయినట్లయింది. లోకం దృష్టిలో తను యెంతో గొప్ప అవినీతిపరుడైపోయాడు. నలుగురిలోనూ తలెత్తుకోవడానికి వీల్లేకపోతోంది. డామ్‌కి పగులు పెద్దదై నీళ్ళన్నీ పోతే బాధ్యత అంతా తనమీద వేస్తారు అధికారులు. తినేటప్పుడు అందరూ వాటాలు వేసుకున్నా ఆపద రాగానే అంతా తప్పుకుని తనని బలిపశువుని చేస్తున్నారు.

ఇప్పుడు తనని బ్లాక్‌లిస్ట్‌లో వేయడంవల్ల పరువు పోవడమేకాదు తను చేస్తున్న కాల్వల పనులు ఎక్కడివక్కడ ఆగిపోతాయి. పెట్టుబడి అంతా బ్లాక్ అయిపోతుంది. తను కట్టిస్తున్న ఏడంతస్థుల బిల్డింగ్స్ గూడా గట్టిగా వున్నాయా లేదా? అనే సందేహంతో కొనేవాళ్ళు వెనక్కిపోవచ్చును. ఇక ఇప్పుడు తను యెంత నష్టపోతాడో అంచనాలకు అందదు. నష్టమేమిటి సర్వనాశనం జరిగితీరుతుంది.

చైతన్య తనమీద యెందుకు యింత పగబట్టాడు? తన గురువు కాంట్రాక్టర్ కోటేశ్వరరావుని చంపించినట్లు వీడికి యెలా తెలిసింది?

గోవిందరాయుడు మలేరియా జ్వరం వచ్చినవాడిలా వణికిపోయాడు. తల పగిలిపోతున్నదేమో అన్నంతగా ఆలోచనలు గిరగిరా తిరుగుతున్నాయి. కాళ్ళక్రింద భూమి విచ్చి తను అగాధంలోకి కూరుకుపోతున్నట్లు ఫీలయ్యాడు. ఏమీ తోచడంలేదు. ఈ ఆపద యెలా తప్పుతుందో అర్థం కావడంలేదు. ఏ ఆశా కనిపించడంలేదు. భూతంలా భవిష్యత్తు భయపెడుతోంది.

విస్కీబాటిల్ ముందు పెట్టుకుని ఆ మత్తులో అంతా మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 10-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి.పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

అతని భార్య శ్రీలక్ష్మి భర్త పరిస్థితి చూసి, విచార పడింది. ఏదైనా ఉపాయం ఆలోచించాలిగాని తాగుతూ కూర్చుంటే లాభం ఏమిటని ఆమె మందలించింది.

ఇదంతా ఆ చైతన్యగాడు చేసిన పని అనీ, డామ్ పగులు చూపించడానికి కారణం గూడా వాడేననీ, యేదో ద్రోహం చేశాడనీ, బాంబు పెట్టించి వాడే పగలగొట్టడానికి ప్రయత్నించాడనీ భార్యముందు అన్నాడు. గోవిందరాయుడు కసి తీరేవరకూ చైతన్యని తిట్టాడు.

అదంతా పత్రికల వాళ్ళకి చెప్తే సరిపోతుంది గదా! కొంతైనా ప్రయోజనం వుంటుంది. ఆ పగులు యెందుకు వచ్చిందో ఎంక్వయిరీ జరిపిస్తారు అంది శ్రీలక్ష్మి.

గోవిందరాయుడికి భార్యసలహా నచ్చింది. మర్నాడు తన యింట్లో పత్రికా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశాడు. చైతన్య తనపై పగబట్టి యెలా చేశాడో గతంలో జరిగినవన్నీ పూసగుచ్చినట్లు చెప్పాడు. తన కూతురు అరుణతారను పెళ్ళి చెయ్యడానికి అంగీకరించనందుకే పగబట్టాడనీ, సరిగ్గా తన వర్క్సు చేసిన బ్లాక్‌లోనే పగులు యెందుకు వచ్చిందో ఆలోచిస్తే అర్థమౌతుందనీ, అతడే డామ్‌కి బాంబ్ పెట్టాడని తన అనుమానం అనీ చెప్పాడు.

ఈ కథ ఏదో గమ్మత్తుగా వుందే అనుకుని విలేఖర్లు వుత్సాహంగా నోట్ చేసుకున్నారు అతని వివరాలన్నీ.

(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3–4–554 Narayanaguda, Hyderabad-500 029
and Printed at Kranti Press, Madras–600 001.

Blank Page

Regd.n
H/HD-4
PRABHAKAR